www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శ్రద్ధాంజలి
ప్రేమకు ప్రతిరూపంగా..
ధైర్యానికి నిలువుటద్దంగా..
మా వెన్ను తట్టి నడిపించిన మీరు
భౌతికంగా దూరమైనా..
మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచే వుంటారు.
కీ॥శే॥ శ్రీమతి పురిటిపాటి విజయలక్ష్మి
(1951 - 05/10/2025)
meil family

సోమవారం | 6-10-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 171 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి మ.12.24 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.6.16, ఉత్తరాభాద్ర తె. 4.01 వర్జ్యం: మ.2.58-4.25, దుర్ముహూర్తం: మ.12.26-1.13, మ.2.48-3.35, అమృతఘడియలు: రా.11.40-1.07, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.09, సూర్యాస్తమయం: 5.56 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రద్ధాంజలి



కీ.శే. శ్రీమతి పురిటిపాటి విజయలక్ష్మి

(1951 – 05/10/2025)

ప్రేమకు ప్రతిరూపంగా.. ధైర్యానికి నిలువుటద్దంగా..
మా వెన్ను తట్టి నడిపించిన మీరు భౌతికంగా దూరమైనా..
మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచే వుంటారు.

భర్త
పి. వీరా రెడ్డి

సోదరుడు
పి.పి. రెడ్డి - పి. రమ

కుమారులు
పి.వి. కృష్ణా రెడ్డి – పి. సుధారాణి
పి.వి. సుబ్బా రెడ్డి – పి. సుమలత

కుమార్తె
పి. ప్రసన్న కుమారి – పి. నాగి రెడ్డి

పెద్దకర్మ

2025 అక్టోబరు 15వ తేదీ
బుధవారం

స్థలం:
హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్,
హైదరాబాద్.

meil family

స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 6 అక్టోబరు 2025

కీటకాల దండయాత్ర



సహజంగా క్రికెట్ మ్యాచ్‌లకు వర్షం లేక వెలుతురులేమితో అంతరాయం కలుగుతుంటుంది. కానీ కొలంబోలో జరిగిన భారత్-పాక్ మహిళల వన్డేకు మాత్రం కీటకాలు అడ్డు తగిలాయి. ఆదివారం మేఘావృతంగా ఉండడంతో సాయంత్రమే ఫ్లడ్‌లైట్స్ వేశారు. ఈ వెలుతురుకు ప్రేమదాస స్టేడియంలోకి భారీగా కీటకాలు వచ్చాయి. మొదట భారత్ ఇన్నింగ్స్ 28వ ఓవర్‌లో వీటిపై బౌలర్ నష్రా అంపైర్లకు ఫిర్యాదు చేసింది. ఇంతలోనే పాక్ సబ్‌స్టిట్యూట్ స్ప్రే తేగా దాంతో కెప్టెన్ ఫాతిమా పురుగులను పంపేందుకు ప్రయత్నించింది. కానీ అదేమీ పనిచేయకపోగా వాటి సంఖ్య మరింత పెరిగింది. దీంతో 34వ ఓవర్ ముగిశాక ప్లేయర్లను బయటికి పంపి 15 నిమిషాలపాటు గ్రౌండ్ స్టాఫ్ స్మోక్ మిషన్లతో వాటిని పారదోలాలని చూశారు. ఈ ప్రయత్నం కూడా పెద్దగా ఫలించకపోయినప్పటికీ మ్యాచ్ మాత్రం కొనసాగింది.

టాస్ గెలిచిందెవరో?

భారత్-పాక్ మ్యాచ్ టాస్ విషయంలో గందరగోళం ఏర్పడింది. పాక్ సారథి ఫాతిమా టాస్ ఓడినప్పటికీ తనే ముందుగా ఏం కావాలో కోరుకోవడం గమనార్హం. జరిగిందేమిటంటే.. భారత కెప్టెన్ హర్మన్ హెడ్, ఫాతిమా టెయిల్ అని చెప్పారు. కానీ రెఫరీ ఫ్రిట్జ్, ప్రజెంటర్ మెల్ జోన్స్‌కు మాత్రం ఫాతిమానే హెడ్ అన్నట్టుగా అర్థం చేసుకున్నారు. ఇక టాస్ నాణేన్ని హర్మన్.. పైకి విసరగా హెడ్ పడింది. దీంతో రెఫరీ హర్మన్‌ను కాకుండా ఫాతిమాను పిలవగా తను ఫీల్డింగ్ కోరుకుంది. కానీ అక్కడే ఉన్న హర్మన్ మాత్రం దీనిపై ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా ఉండిపోయింది.



అమ్మాయిలూ.. నో హ్యాండ్‌షేక్

ఊహించినట్టుగానే మహిళల వన్డే వరల్డ్‌కప్‌లోనూ భారత జట్టు పాకిస్థాన్‌తో నో హ్యాండ్‌షేక్ విధానాన్ని పాటించింది. టాస్ వేసే సమయంలో పాక్ కెప్టెన్ ఫాతిమా షేక్‌తో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కరచాలనం చేయలేదు. ఇటీవలి ఆసియాకప్‌లో భారత కెప్టెన్ సూర్యకుమార్ పాక్ సారథి సల్మాన్ ఆఘాతో ఇదే రీతిన వ్యవహరించిన విషయం తెలిసిందే.

అమ్మాయిలూ.. చిత్తు చేశారు

పాక్‌పై భారత్ ఘనవిజయం

క్రాంతికి సహచరుల అభినందన



మహిళల వన్డే వరల్డ్‌కప్

కొలంబో: వేదిక ఏదైనా.. టోర్నీ ఏదైనా అదే ఫలితం. ఒకటి కాదు, రెండు కాదు వరుసగా నాలుగు ఆదివారాలపాటు దాయాది పాకిస్థాన్‌తో ఆడిన మ్యాచ్‌ల్లో భారత క్రికెట్ జట్లదే ఆధిపత్యం. ఇటీవలి ఆసియాకప్‌లో భారత పురుషుల జట్టు పాక్‌ను మూడుసార్లు ఓడించిన సంగతి తెలిసిందే. తాజాగా మహిళల వన్డే వరల్డ్‌కప్‌లోనూ హర్మన్‌ప్రీత్ బృందం 88 పరుగుల తేడాతో పాక్‌పై ఘన విజయం సాధించింది. ఇక ఈ టోర్నీలో భారత్‌కిది వరుసగా రెండో గెలుపు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటైంది. హర్లీన్ (46), రిచా (35 నాటౌట్), జెమీమా (32), ప్రతీకా (31), దీప్తి శర్మ (25) రాణించారు. పేసర్ డయానా బేగ్‌కు నాలుగు.. ఫాతిమా, సాదియాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో పాక్ 43 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. సిద్రా అమీన్ (81) మాత్రమే పోరాడింది. ఆరంభంలో పేసర్లు రేణుకా సింగ్, క్రాంతి గౌడ్ (3/20)ల స్వింగ్ బంతులకు పాక్ బ్యాటర్ల దగ్గర సమాధానం లేకుండా పోయింది. సిద్రాకు నటాలియా (33) జత కలిసినప్పుడు పాక్ పరిస్థితి ఆశాజనకంగా కనిపించినా.. ఈ జోడీని క్రాంతి విడదీసి భారత్‌కు రిలీఫ్‌నిచ్చింది. ఆ తర్వాత పాక్ వికెట్ల పతనం వేగంగా సాగింది. అయితే కీపర్ రిచా మూడు క్యాచ్‌లను వదిలేయకపోతే వీరి ఆట మరింత ముందుగానే ముగిసేది. దీప్తి శర్మకు మూడు, స్నేహ్ రాణాకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా క్రాంతి గౌడ్ నిలిచింది.

ఆదుకున్న హర్లీన్, రిచా: టాస్ 'ఓడి'న భారత్ బ్యాటింగ్‌కు దిగగా పిచ్ మందకొడిగా ఉండడంతో భారీ స్కోరు సాధించలేకపోయింది. పాక్ బౌలర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చారు. అయితే మధ్య ఓవర్లలో హర్లీన్ నిలకడైన ఆటతీరు కనబర్చగా, చివర్లో రిచా మెరుపులకు స్కోరు 250కి సమీపానికి రాగలిగింది. ఆరంభంలో ఓపెనర్లు ప్రతీకా, మంధాన (23) తొలి వికెట్‌కు 48 పరుగులు జోడించారు. డయానా ఓవర్‌లో ప్రతీకా హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకుంది. అయితే మంధాన పవర్‌ప్లేలోనే వెనుదిరిగింది. ప్రతీకాను సాదియా బౌల్డ్ చేశాక హర్లీన్ అండగా నిలిచే ప్రయత్నం చేసింది. హర్మన్ (19)తో కలిసి మూడో వికెట్‌కు 39, జెమీమాతో కలిసి నాలుగో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యాలను నెలకొల్పింది. అయితే హాఫ్ సెంచరీకి చేరువలో ఉన్న హర్లీన్‌ను రమీన్ అవుట్ చేసింది. అనంతరం పాక్ బౌలర్లు పరుగులను కట్టడి చేశారు. దీప్తి (25), స్నేహ్ రాణా (20) ఆచితూచి ఆడి ఆరో వికెట్‌కు 42 రన్స్ జత చేశారు. కానీ 203/7 స్కోరుతో కష్టాల్లో పడినట్టు కనిపించిన జట్టును రిచా ఆదుకుంది. ధనాధన్ షాట్లతో విరుచుకుపడి చివరి 4 ఓవర్లలో 44 పరుగులు జోడించగలిగింది.

నేటి మ్యాచ్ — మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
న్యూజిలాండ్ × దక్షిణాఫ్రికా

స్కోరుబోర్డు

భారత్: ప్రతీకా (బి) సాదియా 31; మంధాన (ఎల్బీ) ఫాతిమా 23; హర్లీన్ (సి) నష్రా (బి) రమీన్ 46; హర్మన్‌ప్రీత్ (సి) సిద్రా (బి) డయానా 19; జెమీమా (ఎల్బీ) నష్రా 32; దీప్తి శర్మ (సి) సిద్రా (బి) డయానా 25; స్నేహ్ (సి) అలియా (బి) ఫాతిమా 20; రిచా (నాటౌట్) 35; శ్రీచరణి (సి) నటాలియా (బి) సాదియా 1; క్రాంతి (సి) అలియా (బి) డయానా 8; రేణుకా (సి) సిద్రా (బి) డయానా 0; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 50 ఓవర్లలో 247 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-48, 2-67, 3-106, 4-151, 5-159, 6-201, 7-203, 8-226, 9-247, 10-247; **బౌలింగ్:** సాదియా 10-0-47-2; డయానా 10-1-69-4; ఫాతిమా 10-2-38-2; రమీన్ 10-0-39-1; నష్రా సంధూ 10-0-52-1.

పాకిస్థాన్: మునీబా (రనౌట్) 2; సదాఫ్ (సి అండ్ బి) క్రాంతి 6; సిద్రా అమీన్ (సి) హర్మన్ (బి) స్నేహ్ రాణా 81; అలియా (సి) దీప్తి (బి) క్రాంతి 2; నటాలియా (సి-సబ్) రాధా యాదవ్ (బి) క్రాంతి 33; ఫాతిమా (సి) మంధాన (బి) దీప్తి 2; సిద్రా నవాజ్ (సి అండ్ బి) స్నేహ్ రాణా 14; రమీన్ (బి) దీప్తి 0; డయానా బేగ్ (రనౌట్) 9; నష్రా సంధూ (నాటౌట్) 2; సాదియా ఇక్బాల్ (సి) మంధాన (బి) దీప్తి 0; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 43 ఓవర్లలో 159 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-6, 2-20, 3-26, 4-95, 5-102, 6-143, 7-146, 8-150, 9-158, 10-159; **బౌలింగ్:** రేణుకా సింగ్ 10-1-29-0; క్రాంతి గౌడ్ 10-3-20-3; స్నేహ్ రాణా 8-0-38-2; శ్రీచరణి 6-1-26-0; దీప్తి శర్మ 9-0-45-3.

చివరిరోజు 4 పతకాలు

- సిమ్రన్, ప్రీతి, నవ్‌దీప్‌కు రజతాలు
- మొత్తంగా భారత్ ఖాతాలో 22 మెడల్స్

ప్రపంచ పారా అథ్లెటిక్స్


ప్రీతి పాల్


సిమ్రన్


నవ్‌దీప్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌ను భారత్ ఘనంగా ముగించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 22 పతకాలు (6 స్వర్ణ, 9 రజత, 7 కాంస్య) సాధించి పదో స్థానంలో నిలిచింది. పోటీలకు చివరి రోజైన ఆదివారం మరో మూడు రజతాలు, కాంస్యం భారత్ ఖాతాలో చేరాయి. సిమ్రన్ శర్మ, ప్రీతి పాల్ చాంపియన్‌షిప్స్‌లో రెండో పతకాన్ని సొంతం చేసుకొన్నారు. మహిళల 200 మీటర్ల టీ12 ఫైనల్లో సిమ్రన్ 24.46 సెకన్ల టైమింగ్‌తో రజతం సాధించింది. ఇప్పటికే 100 మీ. టీ12 కేటగిరీలో సిమ్రన్ స్వర్ణం నెగ్గిన సంగతి తెలిసిందే. ఇక, మహిళల 100 మీటర్ల టీ35 ఫైనల్లో 14.33 సెకన్లలో రేస్ పూర్తి చేసిన ప్రీతి రజతం దక్కించుకొంది. ఇదివరకే 200 మీ. టీ35 రేస్‌లో పాల్ కాంస్యం సాధించింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 కేటగిరీలో 45.46 మీటర్ల దూరం విసిరిన నవ్‌దీప్ రెండో స్థానంతో రజతం అందుకొన్నాడు. పురుషుల 200 మీటర్ల టీ44 విభాగంలో సందీప్ 23.60 సెకన్ల టైమింగ్‌తో కాంస్యం సాధించాడు. బ్రెజిల్ 44 (15 స్వర్ణ, 20 రజత, 9 కాంస్య) పతకాలతో టాప్‌లో నిలవగా.. చైనా 52 (13-22-17), ఇరాన్ 16 (9-2-5) మెడల్స్‌తో రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి.

శ్రియాన్షికి తొలి 'సూపర్' టైటిల్



అల్ ఐన్ (యూఏఈ): తెలుగమ్మాయి శ్రియాన్షి వలిశెట్టి కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ సూపర్ 100 టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం ముగిసిన అల్ ఐన్ మాస్టర్స్ మహిళల సింగిల్స్ ఫైనల్లో హైదరాబాద్ యువ షట్లర్ శ్రియాన్షి 15-21, 22-20, 21-7తో భారత్‌కే చెందిన తస్నీం మీర్‌పై గెలిచింది. హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడిన శ్రియాన్షి..తర్వాతి రెండు గేముల్లో సత్తా చాటి విజేతగా నిలిచింది.

టైటాన్స్ ఆల్‌రౌండ్ షో

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ వరుసగా నాలుగో విజయం సాధించింది. ఆదివారం చెన్నై వేదికగా యూపీ యోధాస్‌తో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 40-35తో గెలిచింది. టైటాన్స్ ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. విజయ్ భరత్ 14 పాయింట్లతో సూపర్-10 సాధించడంతో పాటు పీకేఎల్‌లో 700 రైడ్ పాయింట్ల మైలురాయికి చేరుకున్నాడు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 33-29తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది.

'ఇరానీ' విజేత విదర్భ



నాగ్‌పూర్: ఇరానీ కప్‌ను విదర్భ గెలుచుకుంది. ఇక్కడ ముగిసిన ఐదు రోజుల మ్యాచ్‌లో 93 పరుగులతో రెస్టాఫ్ ఇండియా ఓడించింది. 361 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 30/2తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన రెస్ట్ 267 రన్స్‌కు ఆలౌటైంది. యశ్ ధుల్ (92), మానవ్ సుతార్ (56 నాటౌట్) పోరాడినా 'రెస్ట్'కు ఓటమి తప్పలేదు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 104 రన్స్ జోడించారు.

సంక్షిప్తస్కోర్లు: విదర్భ: 342, 232; **రెస్టాఫ్ ఇండియా:** 214, 267 (ధుల్ 92, మానవ్ 56 నాటౌట్, ఇషాన్ 35, హర్ష్ దూబే 4/73, ఆదిత్య ఠాక్రే 2/27, యశ్ ఠాకూర్ 2/47).

యశ్-ధుల్ కొట్టుకోబోయారు!

ఆఖరిరోజు ఆటలో విదర్భ పేసర్ యశ్ ఠాకూర్, రెస్ట్ బ్యాటర్ యశ్ ధుల్ కొట్టుకుకున్నంత పని చేశారు. ఠాకూర్ వేసిన షార్ట్‌పిచ్ బంతికి ధుల్ క్యాచవుటయ్యాడు. కీలకమైన వికెట్ పడగొట్టిన నేపథ్యంలో ఠాకూర్ తీవ్రంగా స్పందించాడు. అది జీర్ణించుకోలేని ధుల్..ఠాకూర్‌పై దాడి చేసేందుకు అతడివైపు దూసుకు పోయాడు. ఠాకూర్ కూడా తగ్గేదిలేన్నట్టుగా జవాబివ్వడంతో ఇద్దరూ కొట్టుకొనేదాకా వెళ్లారు. అయితే అంపైర్లు కలుగజేసుకొని వారిని విడదీశారు.

ప్రభ్‌సిమ్రన్ సెంచరీ

మూడో వన్డేలో ఆసీస్ 'ఎ' పరాజయం
సిరీస్ భారత్ 'ఎ' వశం

కాన్పూర్: ఆస్ట్రేలియా 'ఎ'తో మూడు మ్యాచ్‌ల అనధికార వన్డే సిరీస్‌ను భారత్ 'ఎ' 2-1తో దక్కించుకుంది. ఆదివారం ఇక్కడ ఉత్కంఠ భరితంగా జరిగిన మూడో మ్యాచ్‌లో భారత్ 'ఎ' రెండు వికెట్లతో నెగ్గింది. తొలుత ఆస్ట్రేలియా 'ఎ' 49.1 ఓవర్లలో 316 పరుగులకు ఆలౌటైంది. ఎడ్వర్డ్స్ (89), స్కాట్ (73), కొనొలీ (64) అర్ధ శతకాలు సాధించారు. అర్ష్‌దీప్, హర్షిత్ చెరో మూడేసి, బదోని రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో భారత్ 'ఎ' 46 ఓవర్లలో 322/8 స్కోరు చేసి గెలుపొందింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (102) సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ శ్రేయాస్ (62), పరాగ్ (62) హాఫ్ సెంచరీలో సత్తా చాటారు. చివర్లో వరుస వికెట్లు కోల్పోయి భారత్ 'ఎ' ఇబ్బందులో పడినా అర్ష్‌దీప్ (7 బ్యాటింగ్) అండగా విప్రాజ్ నిగమ్ (24 నాటౌట్) జట్టును విజయ తీరాలకు చేర్చాడు. టాడ్ మర్ఫీ, తన్వీర్ సంఘా చెరో 4 వికెట్లు తీశారు.

మళ్లీ ఓడిన అఫ్ఘాన్

- 3-0తో బంగ్లా క్లీన్‌స్వీప్

షార్జా: అఫ్ఘానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను బంగ్లాదేశ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన మూడో, ఆఖరి టీ20లో బంగ్లా 6 వికెట్ల తేడాతో అఫ్ఘాన్‌ను ఓడించింది. తొలుత అఫ్ఘాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులు చేసింది. సైపుద్దీన్ 3, నసుమ్, తన్జిమ్ షకిబ్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో బంగ్లా 18 ఓవర్లలో 144/4 స్కోరు చేసి గెలిచింది. సైఫ్ హసన్ (64 నాటౌట్) సత్తా చాటాడు.

బిజినెస్

బిట్‌కాయిన్ కొత్త రికార్డు



న్యూయార్క్: ప్రపంచంలో అతి పెద్ద క్రిప్టోకరెన్సీ 'బిట్‌కాయిన్' ధర చుక్కలంటింది. ఆదివారం ఒక దశలో 1,25,245.57 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. శనివారంతో పోలిస్తే ఇది 2.7 శాతం ఎక్కువ. దీంతో బిట్‌కాయిన్ మార్కెట్ క్యాప్ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌ను మించిపోయింది. సంస్థాగత మదుపరుల కొనుగోళ్లు, ట్రంప్ సర్కారు సానుకూల విధానాలు, ప్రధాన కరెన్సీలతో పడిపోతున్న డాలర్ మారకం రేటు, అమెరికా ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల స్తంభన బిట్‌కాయిన్ ర్యాలీకి కారణాలుగా కనిపిస్తున్నాయి.

2047 నాటికి జీడీపీలో 25% ఆస్తులు లక్ష్యం

- టాప్-20 గ్లోబల్ బ్యాంకుల్లోనూ చోటు
- ఎస్‌బీఐ చీఫ్ చల్లా శ్రీనివాసులు శెట్టి

న్యూఢిల్లీ: అభివృద్ధి కోసం ప్రభుత్వ రంగంలోని అతి పెద్ద బ్యాంక్ ఎస్‌బీఐ భారీ లక్ష్యాలను పెట్టుకుంది. ఇందు కోసం ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని నిర్ణయించింది. 'వికసిత్ భారత్' సాధనకు నిర్దేశించుకున్న లక్ష్యం 2047 నాటికి దేశ జీడీపీలో తమ బ్యాంకు ఆస్తులను 25 శాతానికి పెంచుకోవాలని భావిస్తున్నట్టు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి తెలిపారు. ఎన్‌డీటీవీ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో ఎస్‌బీఐ ఆస్తుల వాటా 20 శాతం వరకు ఉంది. ఆస్తుల పరంగా ప్రస్తుతం ప్రపంచంలోని టాప్-50 బ్యాంకుల్లో ఎస్‌బీఐ 43వ స్థానంలో ఉంది. 2047 నాటికి ఆస్తి-అప్పుల పట్టీని (బ్యాలెన్స్ షీట్) మరింత మెరుగుపరుచుకుని ప్రపంచంలోని టాప్-10 లేదా టాప్-20 బ్యాంకుల జాబితాలో స్థానం సంపాదిస్తామన్నారు. 'ప్రస్తుతం దేశ జీడీపీలో మా ఆస్తుల వాటా 20 శాతం వరకు ఉంది. 2047 నాటికి దీన్ని 25 శాతానికి అంటే జీడీపీలో నాలుగో వంతుకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అప్పటికి ప్రపంచంలోని టాప్-10 లేదా టాప్-20 బ్యాంకుల్లోనూ స్థానం సంపాదిస్తాం' అని శ్రీనివాసులు శెట్టి చెప్పారు.



కొత్త రంగాలకు రుణ మద్దతు: సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజెన్, బ్యాటరీ స్టోరేజి వంటి నూతన వ్యాపార రంగాలపై కంపెనీలు, ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఎస్‌బీఐ చీఫ్ చెప్పారు. ఇలాంటి కొత్త ప్రాజెక్టులకు తమ రుణ మద్దతు ఉంటుందన్నారు. ఇందుకోసం ఆయా పరిశ్రమ వర్గాలతో సమన్వయం కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. సరికొత్త రంగాలు భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఎంతో తోడ్పడనున్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరం చివరికి ఎస్‌బీఐ ఆస్తి-అప్పుల పట్టీ (బ్యాలెన్స్ షీట్) రూ.66 లక్షల కోట్లు దాటిందని చెప్పారు.

అంతర్జాతీయంగానూ ఆసరా : విదేశీ మార్కెట్లలో ఎదగాలనుకునే భారత కంపెనీలకు సైతం ఎస్‌బీఐ మద్దతు కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం తమ బ్యాంకుకు 29 దేశాల్లో 240 పైగా శాఖలు ఉన్న విషయాన్ని శ్రీనివాసులు శెట్టి గుర్తు చేశారు. ఈ శాఖల ద్వారా భారత కంపెనీల ఎగుమతుల వృద్ధి, విదేశీ రుణ సేకరణకు అవసరమైన సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం తమ ఆస్తి-అప్పుల పట్టీలో విదేశాల్లోని శాఖల వాటా 10 శాతం వరకు ఉందన్నారు. ముందు ముందు దీన్ని 12 నుంచి 13 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు.

25250 పైన బుల్లిష్

(అక్టోబరు 6-10 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 24896 (+241)

నిఫ్టీ గత వారం 24601-24896 పాయింట్ల మధ్యన కదలాడి 241 పాయింట్ల లాభంతో 24896 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25250 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24991, 24839, 24944, 24164 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25250 బ్రేక్‌డౌన్ స్థాయి: 24600
నిరోధ స్థాయిలు: 25100, 25200, 25300 (25000 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24700, 24600, 24500 (24800 దిగువన బేరిష్)

పండుగ సీజన్ విమాన ధరలపై డీజీసీఏ నిఘా

న్యూఢిల్లీ: ప్రస్తుత పండుగల సీజన్‌లో విమాన టికెట్ ధరల ధోరణి, విమానాల్లో సీట్ల సామర్థ్యంపై పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయం గట్టి నిఘా పెట్టింది. టికెట్ల ధరలు విపరీతంగా పెంచకుండా చూడడం దీని లక్ష్యం. సాధారణంగా పండుగ సీజన్‌లో విమాన టికెట్లకు డిమాండ్ అధికంగా ఉంటుంది గనుక అధికంగా రద్దీ ఉండే రూట్లతో సహా అన్ని రూట్లలోనూ విమాన ధరలు పెంచేస్తూ ఉంటారు. విమాన ధరలపై ఎలాంటి నియంత్రణలు లేని కారణంగా ప్రజలు భరించలేని స్థాయిలో ధరలు పెంచేయకుండా కట్టడి చేయడానికి డీజీసీఏ తగు చర్యలు తీసుకుంటూ ఉంటుంది. పండుగల సీజన్‌కు ముందు విమాన ధరలపై నిఘా పెట్టిన డీజీసీఏ పెరుగుతున్న రద్దీకి దీటుగా విమాన సామర్థ్యాలు పెంచాలని విమానయాన సంస్థలను కోరినట్టు పౌర విమానయాన శాఖ తెలిపింది. సీజనల్ రద్దీని తట్టుకునేందుకు ఇండిగో, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్ అదనపు సర్వీసులు నడుపుతున్నట్టు ఇప్పటికే ప్రకటించాయి.

4 లక్షల యూనిట్ల ఎగుమతి లక్ష్యం సాధిస్తాం: మారుతి

న్యూఢిల్లీ: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా.. ఈ ఆర్థిక సంవత్సరంలో 4 లక్షలకు పైగా వాహనాలను ఎగుమతి చేసే లక్ష్యం దిశ గా దూసుకెళ్తోంది. ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో ఇప్పటికే 2 లక్షలకు పైగా యూనిట్లను విదేశాలకు పంపించినట్లు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (కార్పొరేట్ అఫైర్స్) రాహుల్ భారతి వెల్లడించారు. సెప్టెంబర్ నెలలో ఎగుమతులు గత ఏడాదితో పోలిస్తే 52% పెరిగి 42,204 యూనిట్లకు చేరాయి. 'మొదటి త్రైమాసికంలో దాదాపు 1.10 లక్షల యూనిట్లు, ప్రథమార్ధంలో 2.07 లక్షల యూనిట్లను ఎగుమతి చేశాం. ఇదే వేగాన్ని కొనసాగిస్తే, ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్ణయించుకున్న 4 లక్షల యూనిట్ల ఎగుమతి లక్ష్యాన్ని తప్పక చేరుకుంటాం అని ఆయన అన్నారు. తమ ఎగుమతులు దేశీయ పోటీదారుల కంటే రెండింతలు ఎక్కువే ఉన్నాయన్నారు.

పెరగనున్న ముడి చమురు ఉత్పత్తి



వియన్నా (ఆస్ట్రియా): నవంబరు నుంచి ముడి చమురు రోజువారీ ఉత్పత్తిని 1.37 లక్షల బ్యారెళ్ల మేర పెంచాలని ఒపెక్ దేశాల కూటమి, రష్యా నిర్ణయించాయి. తాము కోల్పోయిన వాటా పెంచుకునేందుకు రోజువారీ ఉత్పత్తిని 2.74 లక్షల నుంచి 5.48 లక్షల బ్యారెళ్ల మేర పెంచాలని సౌది అరేబియా పట్టుపట్టింది. అయితే మెజారిటీ దేశాలు 1.37 లక్షల బ్యారెళ్ల పెంపునకు ఆమోదం తెలిపాయి. దీంతో ఈ సంవత్సరం మార్చి నుంచి ఈ దేశాలు అమలు చేస్తున్న ఉత్పత్తి కోతకు తెరపడింది. తాజా నిర్ణయంతో ప్రస్తుతం 65 డాలర్ల వద్ద ట్రేడవుతున్న బ్రెంట్ రకం చమురు బ్యారెల్ ధర మరింత దిగి వస్తుందని భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	528	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	124
వరంగల్	115	గుంటూరు	125
కరీంనగర్	115	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	119
కర్నూలు	115	నెల్లూరు	124
విశాఖపట్నం	127	అనంతపురం	124
గోదావరి	124		

ట్రేడింగ్‌లో మిశ్రమ ధోరణికి ఆస్కారం

స్టాక్ మార్కెట్ ఈ వారంలో మిశ్రమ ధోరణిలో ట్రేడ్ కావొచ్చు. మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకరణాలు, ఆర్‌బీఐ సమీక్ష నేపథ్యంలో కొన్ని రంగాల షేర్లు తీవ్ర ప్రభావానికి లోనయ్యే అవకాశముంది. వరుసగా ఎనిమిది సెషన్లు నష్టపోయిన బెంచ్‌మార్క్ సూచీలు చివరి రెండు సెషన్లలో భారీగా పెరిగాయి. ఆటోమొబైల్, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, మెటల్, డిఫెన్స్, గ్లాస్, ఆయిల్ అన్వేషణ రంగాలు జోరు ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమెండేషన్లు

టాటా స్టీల్: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కీలకమైన రూ.160 జోన్‌లో ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. ఐరన్ అండ్ స్టీల్ సెక్టార్ సైతం జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం 3.4 % లాభంతో రూ.173 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.195 టార్గెట్ ధరతో రూ.170పై శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.166.

బంధన్ బ్యాంకు: చాలా కాలంగా ఈ షేర్లలో దిద్దుబాటు జరుగుతూనే ఉంది. కొన్ని రోజులుగా ప్రైవేటు బ్యాంకింగ్ సెక్టార్ మూమెంటమ్ మెరుగవుతూ వస్తోంది. గత శుక్రవారం రూ.165 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.185 టార్గెట్ ధరతో రూ.160 శ్రేణిలో అక్యూములేట్ చేసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.157.

ఆదిత్య బిర్లా క్యాపిటల్: ప్రస్తుతం ఈ షేర్లు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కొనసాగుతున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగున్నాయి. పైగా అక్యూములేషన్ జోన్‌లో ఉన్నాయి. గత శుక్రవారం రూ.303 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.340 టార్గెట్ ధరతో రూ.290 శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.280.

ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్: ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ కౌంటర్లో అక్యూములేషన్ జరుగుతోంది. ప్రస్తుతం రివర్సల్‌కు అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.209 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.230 టార్గెట్ ధరతో రూ.205 వద్ద పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.205.

కోటక్ బ్యాంకు: ఆరు నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో ఉంది. ఆర్‌బీఐ ద్రవ్యవిధాన సమీక్ష ముగిసిన నేపథ్యంలో వీటిపై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగింది. గత శుక్రవారం రూ.2100 ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.2250 టార్గెట్ ధరతో రూ. 2050 వద్ద ప్రవేశించవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 2010.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

25000 పైన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం పునరుజ్జీవం బాట పట్టి 240 పాయింట్లకు పైగా లాభంతో 24,900 వద్ద ముగిసింది. ముందు వారంలో ఏర్పడిన బలమైన డౌన్‌ట్రెండ్ అనంతరం ఏర్పడిన టెక్నికల్ రికవరీ ఇది. కాని మైనర్ రికవరీ కావడం వల్ల పరిమిత కదలికలు మరి కొంత కాలం కొనసాగే ఆస్కారం ఉంది. నెలవారీగా చూసినా కనిష్ఠ స్థాయిల్లో ముగిసినప్పటికీ ఇంకా ప్రధాన మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. మార్కెట్ ఎలాంటి కన్సాలిడేషన్ లేకుండానే గత వారంలో 'వి' ఆకారంలో రికవరీ సాధించినందువల్ల సానుకూల సంకేతం కోసం తొలుత కన్సాలిడేట్ అయి నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం మానసిక అవధి 25,000 సమీపంలో ఉన్నందు వల్ల ఈ వారంలో అప్రమత్తంగా ప్రారంభమయ్యే ఆస్కారం ఉంది.


వి. సుందర్ రాజా

బుల్లిష్ స్థాయిలు: స్వల్పకాలిక సానుకూల సంకేతం ఇవ్వాలంటే మార్కెట్ కీలక నిరోధం 25,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. గత కొద్ది నెలల్లో ఈ కీలక స్థాయిలోనే మార్కెట్ విఫలమవుతూ వస్తోంది. ప్రధాన నిరోధ స్థాయిలు 25300, 25500.

బేరిష్ స్థాయిలు: 25000 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. దిగువన మద్దతు స్థాయి 24,700. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,500. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనతగా భావించి అప్రమత్తం కావాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం మంచి పనితీరుతో 1200 పాయింట్లకు పైగా బలపడి మూడు వారాల గరిష్ఠ స్థాయి 55,600 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 55,600. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన మద్దతు స్థాయి 55,000. ఇక్కడ విఫలమైతే బలహీనత ముప్పు తప్పదు.

పాటర్న్: స్వల్పకాలిక చలన సగటు స్థాయి 25,000 కన్నా నిఫ్టీ స్వల్పంగా దిగువన ఉంది. సానుకూలత కోసం ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24920, 25000
మద్దతు	24780, 24700

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 6-10-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

అమ్మాయిలూ కొట్టేశారు..

ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో

భారత్ చేతిలో పాక్ చిత్తు

88 పరుగుల తేడాతో హర్మన్ సేన విజయం

రాణించిన క్రాంతి గౌడ్, దీప్తి, రిచా

వరుసగా రెండు విజయాలతో

టేబుల్ టాపర్‌గా ఇండియా

11





కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

పండగైపోయింది..

పోదాం పద..!!

సెలవులు ముగియడంతో

స్వస్థలాల నుంచి తిరుగు ప్రయాణాలు

విజయవాడ-హైదరాబాద్ హైవేపై భారీగా ట్రాఫిక్

టోల్‌ప్లాజాల వద్ద బారులు తీరిన వాహనాలు

8

టమాటా కిలో రూ. 4

పత్తికొండ మార్కెట్‌లో

పతనమైన ధరలు

రోడ్డుపై పారబోసి

నిరసన తెలిపిన రైతులు



ధర తగ్గడంతో టమాటాలు రోడ్డుపై పారబోస్తున్న రైతులు

8

ఆయుర్దాయంలో మనం వెనకే!



జపనీయులకు 85 ఏళ్లు

భారతీయులకు 72 ఏళ్లే

మనోళ్ల సగటు ఆయుష్షు

13 ఏళ్లు తక్కువ

అలవాట్లు, ఆహారంలో

తేడాలే కారణం

10

'తల్లికి వందనం'తో జీఎస్టీ జోష్!

పిల్లలందరికీ ఇవ్వడంతో

మారిన ఆర్థిక స్థితి



సాధారణంగా సంక్షేమ పథకాలతో ఖజానాపై భారం పెరిగిపోతుంటుంది. ప్రభుత్వాలు ఓట్లు, రాజకీయ ఎజెండాలకే ప్రాధాన్యమిస్తూ.. వీటి అమలు కోసం అభివృద్ధిని సైతం అటకెక్కించడం చూస్తున్నాం. అయితే ఇప్పుడు నవ్యాంధ్రలో చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం.. అటు ప్రజలకే గాక.. ఇటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకూ లబ్ధి చేకూర్చడం విశేషం. ప్రభుత్వం ప్రతి ఇంట్లో చదువుకుంటున్న పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికీ వారి తల్లుల పేరిట.. ఒక్కొక్కరికి రూ.13,000 చొప్పున ఖాతాల్లో వేసింది. ఇద్దరు పిల్లలుంటే రూ.26,000, ముగ్గురికి రూ.39,000, నలుగురుంటే రూ.52,000, ఐదుగురు పిల్లలుంటే రూ.65,000, ఆరుగురు పిల్లలుంటే రూ.78,000 కూడా తల్లుల ఖాతాల్లో వేసింది. అరకొరగా కాకుండా వేల రూపాయలు చేతిలోకి రావడంతో ప్రజలకు ఎంతో మేలు జరిగింది. పిల్లల స్కూలు ఖర్చులు, చిన్నచిన్న అవసరాలు పోనూ.. చేతిలో మరికొన్ని డబ్బులు మిగలడంతో జనంలో కొనుగోలు శక్తి పెరిగింది. వివిధ వస్తువుల కొనుగోలుతో జీఎస్టీ వసూళ్లు పెరిగి ప్రభుత్వానికి ఆదాయం కూడా అందుతోంది. 'ఆంధ్రజ్యోతి' పరిశీలనాత్మక కథనం..

ఒకేసారి సొమ్ము అందడంతో ప్రజల్లో పెరిగిన కొనుగోలు శక్తి

చదువులకే కాకుండా గృహోపకరణాలు, సైకిళ్లు, బైకుల కొనుగోలుపై వ్యయం

కొందరు మరికొంత సొమ్ము కలిపి బంగారం కొన్న వైనం

దీంతో జీఎస్టీ వృద్ధి రెండింతలు

జూలై, ఆగస్టులో గణనీయ పెరుగుదల

జూన్ నెలలో వసూళ్లు 2,591 కోట్లు

తర్వాతి 2 నెలల్లో 2,977 కోట్లకు చేరిక

(ఆంధ్రజ్యోతి-అమరావతి/న్యూస్ నెట్‌వర్క్)

కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జూన్ 12న తల్లికి వందనం పథకం డబ్బులను లబ్ధిదారులైన తల్లుల ఖాతాల్లో వేసింది. దీనికి రూ.10,000 కోట్లకు పైగా ఖర్చు చేసింది. ఈ పథకం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతోంది. ఈ పథకం అమలుచేసిన మరుసటి నెలలు జూలై, ఆగస్టుల్లో రాష్ట్ర జీఎస్టీ సాధారణం కంటే ఎక్కువగా పెరిగింది. వైసీపీ హయాంలో ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ)లు ఉన్నప్పటికీ.. అవి అర్హులకు ఒక్కసారిగా ఇంత ప్రయోజనం కలిగించలేదు. ఆ డబ్బు ఒక్కసారిగా కాకుండా ఏడాదికి కొంచెం చొప్పున పడడంతో అవి అప్పటి అవసరాలకు సరిపోయాయి. వాటితో ఏదైనా ఉపయోగపడే వస్తువు గానీ, బంగారం గానీ కొనే అవకాశం లేకుండా పోయింది. కానీ ఇప్పుడు తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధిదారులకు ఒక్కసారిగా రూ.13 వేల నుంచి

మిగతా 9వ పేజీలో...

● పాత ఆటో కొనుక్కున్నాం



మా ముగ్గురు పిల్లలకూ తల్లికి వందనం డబ్బులు జమయ్యాయి. ఆ సొమ్ముతో కుటుంబ జీవనోపాధి కోసం ఒక పాత ఆటో కొనుక్కున్నాం. దాని ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. తల్లికి వందనం మాలాంటి కుటుంబాల్లో వెలుగులు నింపింది.

- వెలకపాటి రవికుమార్, రాచర్ల ఫారం, ప్రకాశం జిల్లా



శ్రీశైలం అభివృద్ధిపై నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి ఆనం, అధికారులు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

తిరుమల తరహాలో శ్రీశైలం అభివృద్ధి

పుణ్యక్షేత్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

ఏటా లక్షల మంది భక్తులు వస్తున్నారు

తదనుగుణంగా వసతులు పెంచాలి

ప్రధాన రహదారులతో అనుసంధానం

2 వేల హెక్టార్ల అటవీ భూమి కేటాయించాలని కేంద్రాన్ని అడుగుదాం

ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దాలి: సీఎం

16న ప్రధాని పర్యటన ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు సూచనలు

వర్చువల్‌గా పాల్గొన్న డిప్యూటీ సీఎం

శబరిమల, ఇతర ఆలయాలను పరిశీలించి అభివృద్ధి చేద్దామని పవన్ సూచన

అమరావతి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆదివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం అభివృద్ధిపై సమీక్షించారు. దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఏటా లక్షల సంఖ్యలో శ్రీశైలం ఆలయానికి భక్తులు వస్తున్నందున మెరుగైన సదుపాయాలు ఎలా కల్పించాలి, మాస్టర్ ప్లాన్, అటవీ శాఖ అంశాలపై సమావేశంలో చర్చించారు. ఆలయ అభివృద్ధికి 2 వేల హెక్టార్ల అటవీభూమి

మిగతా 9వ పేజీలో...



విజయవాడలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బందరు రోడ్డుపై నిలిచిన నీరు

మండిన ఎండ.. పిడుగుల వాన

రాష్ట్రంలో వాతావరణ అనిశ్చితి

నేడు తీవ్ర స్థాయిలో పిడుగులు: ఐఎండీ

7



10

బిహార్ ఎన్నికలు నవంబరు 22లోపే

త్వరలో దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తాం

ఎన్నికల ప్రక్రియలో 17 సంస్కరణలకు శ్రీకారం

పట్నాలో జరిపిన సమీక్షలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్

పీహెచ్‌సీ వైద్యులకు 20% ఇన్‌సర్వీస్ కోటా

అంగీకరించిన ప్రభుత్వం

9

2030 వరకూ అమలుకు వైద్యుల డిమాండ్

త్వరలో నిర్ణయం తీసుకుంటామన్న కమిషనర్



కొనబోతే కొరివి

వాయుసేన ముందు సవాల్.. స్టెల్త్ విమానాలపై ఎటూ తేల్చుకోలేని స్థితి

చైనా వద్ద 300 జె-20 స్టెల్త్ విమానాలు.. జె-35ల తయారీలో బిజీ

2030 నాటికి పాక్‌కు జే-35లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న డ్రాగన్

ఐదేళ్లలో ఇరు దేశాల నుంచీ పెను ముప్పు.. మన వద్ద ఉన్నవి రాఫెల్‌లే!

ఏఎంసీఏ విమానాలు తయారుచేసుకోవాలన్నా మరో పదేళ్లు

మనకున్న ప్రత్యామ్నాయాలు ఎఫ్35 లేదా ఎస్‌యూ57లు కొనడమే

ఎఫ్-35ల స్టెల్త్ సామర్థ్యం అద్భుతమే కానీ.. కొనాలంటేనే షరతులు

వాటితో పోలిస్తే ఎస్‌యూ-57ల స్టెల్త్ సామర్థ్యం అంతంత మాత్రమే

కొనాలన్నా అవి అందుబాటులోకి వచ్చేసరికి పదేళ్ల దాకా పట్టొచ్చు

ఎల్లుండి 'ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ డే' సందర్భంగా ప్రత్యేక కథనం

(సెంట్రల్ డెస్క్)

గగనతల యుద్ధాల్లో అత్యంత ప్రభావం చూపే ఐదో తరం యుద్ధవిమానాల తయారీలో అమెరికా, చైనా.. ఇప్పటికే మిగతా దేశాలకు అందనంత దూరంలో ఉన్నాయి! అమెరికా వద్ద అద్భుతమైన స్టెల్త్ (శత్రుదేశ రాడార్లకు చిక్కని) సామర్థ్యాలున్న ఎఫ్-35లు, ఎఫ్-22లు ఉండగా.. చైనా వద్ద ఇప్పటికే 300కు పైగా జే-20 స్టెల్త్ ఫైటర్ జెట్లు ఉన్నాయి! ఇవి కాక జే-35లను చైనా తయారుచేస్తోంది. రేసులో మరింత ముందుకెళ్లి.. వైట్ ఎలిఫెంట్ (జే36) పేరిట ఆరో తరం యుద్ధ విమానాలనూ

మిగతా 6వ పేజీలో...

కన్నతల్లిని చంపిన డబ్బు పిచ్చి!

డబ్బులివ్వలేదని కత్తితో గొంతుకోసి చంపిన ఉన్మాది

ఒక్కడే కొడుకని గారాబంగా పెంచడమే ఆమె పాపం

హైదరాబాద్ నుంచి వచ్చి తల్లితో గొడవపడి హత్య

తండ్రి బెడ్‌రూమ్‌లో ఉండగా గడియపెట్టి దారుణం

తర్వాత ఇంట్లోకి వెళ్లి ఫోన్‌లో పాటలు వింటూ నవ్వులు

కడప జిల్లా ప్రొద్దుటూరులో దారుణం

8

పిన్నిని నరికేసి.. 4 ముక్కలుగా చేసి!

8

భార్యను దూరం చేసిందని 13 ఏళ్లుగా పగ

16 ఏళ్ల కొడుకుతో కలిసి కత్తితో నరికి హత్య

సంచుల్లో కట్టి కాల్వల్లో పడేసి.. బెజవాడలో ఘోరం

ఏపీపీఎస్సీలో లీకు వీరుడు!

అనధికార సోషల్ మీడియాలో అధికారిక సమాచారం

ముందే లీక్ చేస్తున్న కమిషన్ సభ్యుడు

గోప్యంగా ఉంచాల్సిన విషయాలూ వెల్లడి

అభ్యర్థుల అభిప్రాయాలు సేకరణ

తాజా ర్యాంకింగ్ జాబితాలపై పోల్స్

వైసీపీ హయాంలో సుధీర్ నియామకం

జగన్‌కు సమీప బంధువనే ప్రచారం

సర్వం తానే అన్నట్టుగా వ్యవహారం

సర్కారుకు నిరుద్యోగుల సంఘం ఫిర్యాదు

APPSC

అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): లక్షలాది మంది నిరుద్యోగుల కలలను సాకారం చేసే రాజ్యాంగ బద్ధమైన సంస్థ ఏపీపీఎస్సీ. దీని నుంచి ఎలాంటి ప్రకటన వచ్చినా నిరుద్యోగులను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇప్పటి వరకు ఏపీపీఎస్సీకి ఎలాంటి సోషల్ మీడియా ఖాతా లేదు. కానీ, కమిషన్ సభ్యుడు పరిగె సుధీర్ అత్యుత్సాహానికి పోయారు. తనే సొంతంగా ఓ టెలిగ్రామ్ గ్రూప్‌ను సృష్టించి.. ఏపీపీఎస్సీకి సంబంధించిన సమాచారాన్ని అనధికారికంగా ముందే వెల్లడిస్తున్నారు. అంతేకాదు.. అభ్యర్థుల నుంచి పలు కీలక విషయాలపై సమాచారం సేకరిస్తున్నారు. ఈ వ్యవహారంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. "గ్రూప్1, 2 ఫలితాలకు ముందు జనరల్ ర్యాంకింగ్

మిగతా 9వ పేజీలో...

నకిలీ మద్యం తీగ.. తెనాలిలో కదిలిన డొంక!

కీలక నిందితుడు కొడాలి శ్రీనివాసరావు కోసం గాలింపు

ములకలచెరువులో ఇతడి పేరుపైనే భవనం లీజు

వైసీపీ హయాం నుంచి రాకెట్

కూటమి వచ్చాకా కొనసాగింపు

9

ఇద్దరు టీడీపీ నాయకులపై వేటు

తంబళ్లపల్లి ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, కట్టా సురేంద్ర నాయుడు సస్పెన్షన్



వివిధ

బొమ్మలు: అక్బర్

'అక్రమ తుపాకులు' తమిళ అనువాద కథలు

పదకొండు మంది తమిళ రచయితల కథలకు శ్రీనివాస్ తెప్పాల తెలుగు అనువాదాలతో కథా సంకలనం 'అక్రమ తుపాకులు' ఆవిష్కరణ సభ అక్టోబర్ 9 సా.6గంటలకు లామకాన్, బంజారాహిల్స్, హైదరాబాద్‌లో జరుగుతుంది. వక్తలుగా కవి సిద్ధార్థ, పి. జ్యోతి, ఇండ్ల చంద్రశేఖర్, కె. రామచంద్రరెడ్డి మాట్లాడతారు.

బోధి ఫౌండేషన్

రెండుతరాల కవిసంగమం

రెండుతరాల కవిసంగమం సిరీస్ - 44 కార్యక్రమం అక్టోబర్ 11 సా.6గంటలకు నిజాం కాలేజి, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. పాల్గొంటున్న కవులు: కొండి మల్లారెడ్డి, వి.ఆర్. తూములూరి, లావణ్య సైదీశ్వర్, మహేష్ వేల్పుల, పి. వెంకటేష్ (నిజాం కాలేజి ఎం.ఏ విద్యార్థి)

కవిసంగమం


సృజన సమాలోచన సదస్సు

తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమి సౌజన్యంతో కవి యాకూబ్ సృజన సమాలోచన సదస్సు అక్టోబర్ 13 ఉ.10గంటల నుంచి సా.8గంటల వరకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

తెలుగు భాషా చైతన్య సమితి

సాంస్కృతిక అస్తిత్వాన్ని ఎలా నిలబెట్టాలో స్పష్టత ఉన్నది!

– ఏనుగు నరసింహారెడ్డి



ఉమ్మడి నల్లగొండ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి కవి, రచయిత, విమర్శకులు, అనువాదకులు. మీర్ లాయక్ అలీ రచన 'ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్'ను 'హైదరాబాదు విషాదం'గాను, వి.పి. మీనన్ రచన 'ద స్టోరీ ఆఫ్ ద ఇంటిగ్రేషన్ ఆఫ్ ద ఇండియన్ స్టేట్స్'ను 'అసఫ్ జాహీ సంస్థానం విలీన గాథ'గా తెలుగులోకి అనువదించి సెప్టెంబర్ 17 పరిశీలనకు కొత్త కోణాన్ని అందించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వీరి 'మట్టిపాట', 'తెలంగాణ రుబాయిలు' రచనలు సాహిత్యాభిమానుల మనసును చూరగొన్నాయి. 2017లో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా నియమితులై ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతమయ్యేందుకు కృషి చేశారు. ఇటీవల తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా నియమితులైన సందర్భంగా ఆయనతో సంభాషణ:

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా నియమితులైన సందర్భాన మీకు శుభాకాంక్షలు. మీరు ఈ పదవిలో నియమించబడిన మొదటి పక్షంలోనే తెలంగాణ బతుకమ్మకు రెండు గిన్నిస్ రికార్డులు రావడం పట్ల మీ స్పందన ఏమిటి?

తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఇదొక అత్యంత ఉత్సాహవంతమైన సందర్భం. 63.11ఫీట్ల ఎత్తు బతుకమ్మకు ఒక గిన్నిస్ రికార్డు, 1500మంది మహిళల బతుకమ్మ ఆటలోని ఏకత్వానికి మరో గిన్నిస్ రికార్డు సాధించాం. తక్కువ వ్యవధిలో సరైన ప్రణాళికతో, పర్యాటక-సాంస్కృతిక శాఖల మధ్య సమన్వయంతో ఇది సాధ్యమైంది.

మీరు గతంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఆ అనుభవం ఇప్పుడు ఈ కొత్త హోదాలో ఉపయోగపడుతుంది అని భావించవచ్చా?

తప్పకుండా! సాహిత్య అకాడమీలో పనిచేసిన పరిజ్ఞానమే గాక, గత ముప్పై ఏళ్ళుగా వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థలతో నాకున్న అనుబంధం, కవులు రచయితలతో వ్యక్తిగత సాన్నిహిత్యం తప్పనిసరిగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడిగా పనిచేయడంలో నాకు ఉపయోగపడుతుంది. 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో కవులు రచయితలను మాత్రమే కాకుండా కళాకారులను కూడా చాలా సందర్భాలలో ఇన్వాల్వ్ చేశాము. ఆ సందర్భంగా తెలంగాణ అస్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం చేయవలసిన కార్యక్రమాల పట్ల నాకు స్పష్టమైన అవగాహన ఏర్పడింది.

విద్యావ్యవస్థలో మార్పులతో ఇంగ్లీష్ భాష డామినేట్ చేస్తున్న పరిస్థితుల్లో తెలంగాణ భాషను కాపాడుకోవడంపై మీ ఆలోచనలు ఏమిటి?

రెండు తెలుగు రాష్ట్రాలలోనూ తెలుగు మాధ్యమం ప్రాథమిక పాఠశాలల స్థాయిలో కూడా లేకుండా పోయింది కాబట్టి ఇంకొక ఇరవై ఏళ్ళ తరువాత వచ్చే యువతకు తెలుగుపట్ల సాధికారత ఉండదనే విషయాన్ని ఒప్పుకుని తీరవలసిందే. తెలుగుని ఒక భాషగానైనా తప్పనిసరిగా నేర్చుకోవలసిన అవసరం తెలంగాణ రాష్ట్రంలో అందరికీ ఉంది అని తెలుగు భాషా చట్టం 2018 తెలియజేస్తుంది. దీని ప్రకారం ఏ రకమైన యాజమాన్య నిర్వహణలో ఉన్న పాఠశాలల్లోనైనా తెలుగును ఒక అంశంగా చదివి తీరాలి. కాబట్టి తెలుగును ఆసక్తిగా చదివే విద్యార్థులు భవిష్యత్తులో భాషాలో నైపుణ్యాన్ని సాధిస్తారు. ఇక సంస్కృతి విషయానికి వస్తే భాషకు ఉన్నంత డోకా సంస్కృతికి లేదు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బోనాలు, బతుకమ్మ పండగలకి ఆదరణ పెరిగింది. ప్రభుత్వం వైపు నుండి కూడా ఈ పండుగలను ఉత్సాహభరితంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి కాబట్టి సంస్కృతి పరిరక్షణ, భాషా పరిరక్షణ కంటే మెరుగ్గా ఉంది.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ ఆటల్లో డీజేలు, దాండియా వచ్చి చేరినవి. తెలంగాణ జీవితం ఉట్టిపడే ఈ పండుగకు పూర్వకళ తీసుకురావడానికి ఎలాంటి ప్రణాళికలు వేసుకున్నారు?

బతుకమ్మ పాటలు ఏ కర్తృత్వం లేకుండా, మౌఖికంగా తరం నుండి తరానికి వస్తున్న సాంస్కృతిక సంపద. ఇవి ఒకప్పటి కుటుంబ సంబంధాలకు, ఆ సామాజిక స్థితికి అద్దం పడతాయి. అయితే మొదటి నుండి తెలంగాణాలో ఎగసిపడిన ఉద్యమాల ప్రభావాలకు బతుకమ్మ పండుగ కూడా లోనయ్యింది. ఇక ముందు ఎలాంటి కృత్రిమత్వం లేకుండా, సహజసిద్ధంగా ఈ పండుగ కొనసాగించే ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. ఈ శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు కూడా ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించారు. ఈ సారి బతుకమ్మ ఆటలో ఈశ్వరమ్మ అనే ఒక ఆవిడతో బతుకమ్మ పాటలు పాడించాము. ఇకపై బతుకమ్మ సంబరాల్లో భౌతికంగా ఆడే పాడే సాంప్రదాయమే కొనసాగుతుంది తప్ప రికార్డింగ్‌లు, డీజేలు ఉండవు.

ఆదివాసీల కళారూపాలు, జానపదకళలు మొదలుకొని తెలంగాణ నాటకం వరకు మీ కార్యాచరణ ఎలా ఉండబోతున్నది? సినిమా విషయంలో గతంలో ఉన్న ప్రోత్సాహం ఎలా ఏవిధంగా కొనసాగబోతున్నది?

కోయ, గుస్సాడి, లంబాడి లాంటి ఆదివాసి కళారూపాలు; ఒగ్గుడోలు, బహురూపులు, పగటి వేషాలు, చిరుతలు, కోలాటం లాంటి జానపద కళారూపాల ప్రదర్శనకు వివిధ సందర్భాలలో అవకాశం దొరుకుతున్నది. ఇదివరకు ఇలాంటి కళా ప్రదర్శనలు చూడని నగర ప్రజలు కూడా వీటిని చూసే అవకాశాలు కలుగుతున్నాయి. ఆధునిక కాలం తీసుకువచ్చిన వేగం వల్ల ఒక్క సినిమాలే గాక టీవీలు, యూట్యూబ్ చానళ్లు, ఇతర మీడియా విస్తరించడంతో ఒక ప్రదర్శన రూపంగా నాటకం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఇది తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన సమస్య కాదు. అయినప్పటికీ వరంగల్, నల్గొండ, ఖమ్మం, హైదరాబాదులో అనేక నాటక సమాజాలు ఉన్నాయి. అవి ప్రదర్శనలు కూడా చేస్తున్నాయి. ఇప్పటికీ పౌరాణిక నాటకాలు కూడా తెలంగాణలో ప్రదర్శించబడుతూనే ఉన్నాయి. రవీంద్రభారతిలో నాటకాలు, జానపద కళలు, ఆదివాసి కళారూపాలు సందర్భానుసారంగా ప్రదర్శించబడుతున్నాయి. సినిమా రంగానికి ప్రోత్సాహం కొనసాగుతుంది. తెలంగాణ భాషలో సంస్కృతిని ప్రతిబింబించే సినిమాలకు ఆదరణ లభిస్తుంది. ప్రభుత్వం గద్దర్ అవార్డులను కూడా బహూకరిస్తూ ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే.

భాషా సాంస్కృతిక శాఖ తరపున సాహిత్య రంగం విషయంలో మీ దృష్టిలో ఎలాంటి కొత్త ఆలోచనలు, ప్రతిపాదనలు ఉన్నాయి?

సాహిత్యంలో కృషి చేయడానికి తెలంగాణ సాహిత్య అకాడమీ, సంగీతంలోనూ నాటకంలోనూ కృషి చేయడానికి తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఉన్నాయి. ఈ రెండు సంస్థలతో సమన్వయంతో పని చేస్తూ సాహిత్యాన్ని సంగీత నాటకాలను ప్రజలకు చేరువ చేయడానికి ప్రణాళిక ఉంది. గతంలో సాహిత్య అకాడమీ తరపున 'కావ్య పరిమళం', 'నవలా స్రవంతి' అనే రెండు కార్యక్రమాల ద్వారా తెలంగాణ కావ్యాలను, నవలలను విస్తృతంగా పరిచయం చేసి యూట్యూబ్‌లో స్థిరపరిచాం. పుస్తకాలుగా కూడా ప్రచురించాం. ఈ దిశగా భారతీయ సాహిత్య వైవిధ్యాన్ని తెలంగాణ పాఠకులకు తెలియజేయడానికి ఒక్కో భాషకు సంబంధించిన ప్రాతినిధ్య కావ్యాన్ని లేదా గ్రంథాన్ని పరిచయం చేసే ఆలోచన ఉంది. అనంతరం ప్రపంచంలో ప్రసిద్ధ సాహిత్య గ్రంథాలను విశేషజ్ఞుల చేత పాఠాలుగా చెప్పించి అటు దృశ్య రూపంలోనూ ఇటు గ్రంథరూపంలోనూ స్థిరపరిచే ఆలోచన కూడా ఉంది. నాటక సమాజాల దృష్టి కోణం నుండి కాకుండా, దార్శనికతతో కొన్ని నాటకాలను సృజింపజేసి అవి తెలంగాణ ప్రధాన పట్టణాలన్నింటిలోనూ ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయాలన్న ఆలోచన ఉంది.

సాహిత్య కార్యక్రమాలు ఇక ముందు మీ శాఖ నిర్వహిస్తుందా? సాహిత్య అకాడమీ నిర్వహిస్తుందా?

సాహిత్య కార్యక్రమాలను ప్రధానంగా సాహిత్య అకాడమీ నిర్వహిస్తుంది. కానీ సాంస్కృతిక శాఖ కూడా సందర్భావసరాలను బట్టి, సాహిత్య అకాడమీతో సమన్వయం చేసుకుంటూ సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

భాషా సాంస్కృతిక శాఖ తరపున మీ దృష్టిలో వినూత్న కార్యక్రమాలు ఏమైనా ఉన్నాయా?

సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి సాహిత్యాన్ని కళలను ఉపయోగించ దలచుకున్నాం. స్త్రీ సాధికారత కోసం, గంజాయి, మాదకద్రవ్యాలులాంటి దుర్వ్యసనాలను నిర్మూలించడం కోసం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి ప్రజలను చైతన్యపరచడం కోసం అవసరమైతే జిల్లా కేంద్రాలకు నియోజకవర్గ కేంద్రాలకు మండల కేంద్రాలకు కూడా భాషా సాంస్కృతిక శాఖ కార్యక్రమాలను విస్తరించాలనుకుంటున్నాం.

ఇంటర్వ్యూ ■ ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

✆ 98490 82693



బిరసాడొల్లా కొండదారి

అమరాయొల్ల తగలకండా
సింతలొల్ల నుండి జమితెల్లాలంతే
కనబడీది ఈ అడ్డదారి

బిరసాడొల్ల నుండి ఆల్తిపేరంటాల గుడి దాకా
ఉంతాదంతాం కదా
అదే ఈ బతుకు దారి

ఇప్పలొల్ల బస్సునేకమునుపు
ఎవ్వలైనా
దేశమెల్లిపోతే
నెత్తి మీన మూట బరువేగాదు
బారమైపోయిన గుండె బరువూ
దీనికి అనుబవమే

కూలికెల్లే సైకిల్ సెక్రాలు ఎత్తుపల్లాలు ఓరవలేనపుడు
పడిపోయిన కేరేజీని చూసి
తెల్లగా గడ్డకట్టేసిన దుక్కమైపోయీదీ దారి

అప్పుడే దించిన జీరుక్కల్లు
పూటుగా తాగీసి పడిపోయినోడ్ని
ఓ పక్కన పడుకోబెట్టుకొని
సెట్టుగొడుగు తొడిగే అమ్మవొడైపోయీది

జమితిలో పెల్లయితే
సెంపావతిలో దిగొచ్చిన పిట్టాడనేత్తాల
అరికాల్లతో ఊసులాడి
నది సంగతులు తెలుసుకొని
పక్కనే పారుతున్న కాలవలో
సేపపిల్లయి సంబరపడిపోయీది

మెంటాడ నాలం పెద్దోడి
మలారం ఇలగే నడిసీది
గజంగుడ్డొల్ల కొండదొర్ల ఆడబొట్టి
సేతిని గాజుపువ్వై మెరిసీది

శీతాకాలం తెల్లారినుండి పొద్దోయిందాకా
కొత్తబట్టల మూటల్ని కొండమీదకి
ఎల్లండ్రా అన్నట్టు పంపి
ఎక్కడెక్కడో పండుగుల్ని ఇక్కడే కలగనీసీది

సముద్రాన్నెండబెట్టి
తట్టకెత్తకొచ్చిన కోనాడ సేపలమ్మని
నెలకోపాలి కీసురాయి గొంతుతో పలకరించీసీది

పంచరు సామాన్లొట్టుకొని
ఊరూరు తిరిగే అప్పారావుని
ఒక్కరోజు సూడప్పోయినా
కోసీసి తిన్నగా పరిసిన
గాల్లేని సైకిల్ సూపునాగ అయిపోయీది

అట్టాటిదారి
మట్టిదారి
మందిదారి
ఇప్పుడేటైపోనాదనుకుంతన్నా
అనుకున్నదే అయింది
అడివిని నొల్లీసుకోడానికి
బూకంపం నాగొచ్చీసి
మడిసిని సూత్తే బగ్గుమంతన్న పేద్దరోడ్డొకటి
దీన్ని మింగీసింది

మాది గానిది
మేమంటే ఒప్పన్ది
ఎంతగొప్పదైతే మాకేటి
ఎంత పెద్దదైతే మాకేటి

రాజైమా
ఇంకేటి సేత్తాం సెప్పిమి
నీ దారి నీది
మా దారి మాది


■ పాయల మురళీకృష్ణ

✆ 83094 68318

గురజాడకు ముందే ముత్యాలసరం

19వ శతాబ్దాన్ని క్షీణ యుగంగా తెలుగు సాహిత్య చరిత్రకారులు నిర్ణయించడం కారణంగా– ఆ శతాబ్ది సాహితీ ప్రాభవం అజ్ఞాతమై విస్మరణకు గురైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపన తర్వాత పీజీ విద్యార్థులకు వాఙ్మయ పాఠ్య ప్రణాళిక రూపొందించిన సాహితీవేత్తలు కూడా ఇదే అభిప్రాయం కలిగి ఉండటంతో ఈ భావన అలాగే స్థిరపడిపోయింది. 19వ శతాబ్దాన్ని క్షీణయుగంగా నిర్ధారించి నిర్దిష్ట అధ్యయనం, పరిశోధన చేయకపోవటంతో తెలుగు భాష ఎంతో సాహిత్య చరిత్రను కోల్పోయింది.

ఇటీవల ఆధునిక సాహితీవేత్తలు, కవిపండిత విమర్శకులు కొందరు ఆ శతాబ్దిపై దృష్టి సారించారు. వారి కృషి వల్లనే ఆధునిక నవ్యయుగానికి సంబంధించిన బీజాలు 19వ శతాబ్దిలోనే పడ్డాయన్న సత్యం ఎట్టకేలకు వెలుగు చూసింది. ఈ దిశగా తన పరిశోధన ఎక్కుపెట్టిన వారిలో డా. ఆచార్య ఫణీంద్ర ముఖ్యులు. 20వ శతాబ్ది నవ్యకవితా మహావృక్షం ఒక్క మారుగా అవతరించలేదనీ, 19వ శతాబ్దిలో పడిన బీజాలు అంకురించాయనీ ఫణీంద్ర వివిధ దృక్కోణాలలో విస్తృత అధ్యయనం అనంతరం నిరూపించారు. ఆయన ఈ ఇతివృత్తంపై తన పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాన్ని 2008లో సమర్పించారు. ఆ సిద్ధాంత గ్రంథం 2024లో ప్రచురితమై పండితలోకంలో సంచలనం సృష్టించింది.



'క్షీణయుగం కాదు... ఉషోదయ యుగం (19వ శతాబ్ది తెలుగు సాహిత్య చరిత్ర)' పేరుతో ప్రచురితమైన ఈ గ్రంథంలోని ఆరవ అధ్యాయంలో, 11వ శతాబ్ది నుండి 19వ శతాబ్ది అంతం వరకు సంప్రదాయ పద్య ఛందస్సులతో కొనసాగిన తెలుగు కవిత్వం ఏవిధంగా కొత్త మలుపు తిరిగినదీ ఫణీంద్ర విశ్లేషించారు. 19వ శతాబ్ది తెలుగు కవిత్వంలో ఛందో నవ్యతను, నవ్య కవిత్వ యుగారంభంలో దారి ప్రభావాన్ని స్పష్టం చేసారు. రేవణూరి వెంకటార్యుడు 1810ప్రాంతంలో ఇంచుమించుగా ముత్యాలసరం ఛందస్సును తన 'శ్రీపాద రేణు ప్రభావం' అన్న కావ్యంలో ప్రయోగించారని, గురజాడ కంటే సుమారు వందేళ్ళకు పూర్వమే ఈ ఛందస్సు వుందని ఆధారాలతో ఫణీంద్ర రుజువు చేసారు.

రేవణూరి వేంకటార్యుని ఛందస్సు పేరును తురంగ వృత్తంగా పేర్కొంటూ, రెండు ఛందస్సుల సామ్యాన్ని తన సిద్ధాంత గ్రంథంలో పరిశోధనా దృక్కోణంతో అవలోకింప చేసారు ఫణీంద్ర. ఈ వృత్తం గురజాడ ముత్యాలసరం ఛందస్సుకు ఆద్యరూపంగా పేర్కొన్నారు. గురజాడ కొత్తగా మాత్రా ఛందస్సుకు ముత్యాలసరం సృజించాడనే విషయం పూర్తిగా వాస్తవం కాదని నిరూపించారు.

1831 నాటి 'ఆంధ్రభారతి' పత్రికలో 'మేలుకొలుపు' అన్న గేయం ముత్యాలసర మిశ్రగతిలో వుందని సి. నారాయణరెడ్డి తన 'ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయాలు ప్రయోగాలు' గ్రంథంలో ప్రస్తావించారు. గురజాడ రచన 'తోకచుక్క'కు ఒక ఏడాది ముందే 'మేలుకొలుపు' వచ్చింది. 'మేలుకొలుపు' గేయకర్త మంగిపూడి వేంకట కృష్ణశర్మ అయివుండవచ్చని 'ఆధునికాంధ్ర గేయకవిత్వం'లో డా. జి. చెన్నకేశవరెడ్డి అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా ఫణీంద్ర పరిశోధన ప్రకారం 'రేవణూరి' కవి తురంగ వృత్తకావ్య ప్రభావం తదనంతర శతాబ్ది లోని నవ్యకవితారీతులపై పడి వుండవచ్చునని స్పష్టమవుతోంది.

1862లో జన్మించిన గురజాడ కాలం నాటి స్థితిగతులకు, మత సాహిత్యం వెల్లివిరిసిన రేవణూరి వేంకటార్యుని రోజులకు సంబంధం లేదు. గురజాడ 53ఏళ్ల జీవితకాలంలో గ్రాంథిక భాషావాదుల ప్రతిఘటనను ఎదుర్కొంటూ సంస్కరణాయుత తిరుగుబాటుతో ఎదురీదారు. తేటైన తల్లి నుడి కూర్చుకొని ముత్యాలసరాలు గుచ్చి వాడుక పలుకుబడితో తెలుగు పద్య మణిహారాన్ని గేయంగా అవతరింప చేసారు. ఆయన మాటలలో– ముత్యాలసరము ఒక వితత కవితా ఖని. ఆయన తన ముత్యాలసరం రచనా ప్రక్రియ మూలం గురించి వివరంగా ఎక్కడా చెప్పలేదు. "ఒక జాతి పార్సీ గజలు యొక్క నడకతో ముత్యాలసరం తెచ్చుటకు ప్రయత్నించాను" అని మాత్రం లక్షణ వ్యాసంలో తెలిపారు. రేవణూరి వెంకటార్యుని అద్భుత సృష్టి తురంగ వృత్తం, 'వృషభగతి', 'హరిణగతి' ప్రాచీన జానపద గేయాల రగడల ఒరవడిలోనే సాగింది.



గురజాడ అనంతరం తొలి శ్రేణిలో అబ్బూరి, బసవరాజు, దేవులపల్లి, కవికొండల, శ్రీశ్రీ ఎందరో గురజాడ అడుగుజాడలో ఈ ప్రక్రియ అనుసరించి నవ్య కవితా మహోదయాన్ని ఆహ్వానించారు. విశ్వమానవ సౌభ్రాతృత్వం, సంఘ సంస్కరణ ప్రియత్వం, మానవతా విలువలు, జాతీయతా, దేశభక్తి మహదాశయంతో ముత్యాలసరాలు నాంది పలికింది. ఈ అద్భుత ప్రక్రియ సృష్టికర్త రేవణూరి వేంకటార్య కవి తెలుగుజాతికి చిరఃస్మరణీయులు.

■ జయసూర్య

✆ 94406 64610

ఎంత గొట్టుగా రాస్తే అంత మంచి కవిత అనుకునేవాడ్ని!

అది 1974వ సంవత్సరం. అప్పుడు నాకు 18ఏళ్ళ ప్రాయం. కామారెడ్డి కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరంలో ఉన్నాను. మాకు ఇంటర్, డిగ్రీల్లో గుండి వేంకటాచార్య, కసిరెడ్డి వెంకటరెడ్డి గార్లు తెలుగు బోధించేవాళ్ళు. అదే ఏట నా మొదటి కవితా సంపుటి 'మానవుడా' వచ్చింది. ఇందులో పదహారు గేయాలున్నాయి. దేశభక్తి గేయాలు, అభ్యుదయ గీతాలు, ప్రణయ గీతాలు మొదలైనవి అన్నీ దాదాపుగా త్రిస్ర చతురస్ర గతుల్లోని గీతాలు. వీటిపై సి. నారాయణరెడ్డి, కనపర్తి, చొప్పకట్ల, వడ్డెపల్లి ప్రభావాలు పడ్డాయి. పైగా అప్పటికి దాదాపు ప్రబంధాలు నేనే ఆసక్తికరంగా చదువుకున్నాను కనుక వాటి ప్రభావమూ ఉంది. చిన్నప్పుడు బాగా పాటలు పాడేవాణ్ణి! కాబట్టి ఆ అసర్ కూడా ఉంది, ఇంతో కొంతో. నా కవిత్వం ప్రతి అక్షరం చూసిన గురువు కసిరెడ్డి గారే నా 'మానవుడా' గేయ సంపుటికి ముందుమాట రాసారు. గుండి వారు, అవధానం రంగనాథ వాచస్పతి గారి ముందు మాటలూ ఉన్నాయి. పుస్తకాన్ని మా కళాశాలకే అంకితం చేసాను. ప్రిన్సిపాల్ ఎ. నరసింహారెడ్డిగారు ఆర్థిక సాయం చేసారు. అప్పట్లో కవర్ పేజీలు ఇంత అందంగా లేవు. అచ్చులో పేరు చూసుకుంటే చాలు అనుకునే సంతృప్తి. సిరిసిల్ల విష్ణు ప్రెస్‌లో అచ్చయింది. ఆవిష్కరణ కళాశాలలోనే. గిరిజా మనోహర్ బాబు సమీక్షించారు. మొదటి ప్రతి ప్రిన్సిపాల్ గారికే. నిజామాబాద్ సిహెచ్.మధు ఏదో పత్రికలో సమీక్ష చేసారు.



ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి 'మానవుడా' అనే టైటిల్ గేయం నాలుగు సార్లు ప్రసారితమైంది. వింజమూరి సోదరీమణుల సంగీతం. నరసింహరాజు 'మానవుడా మానవుడా – మానవతను మరచినావు దారుణ తిమిరాన మునిగి దానవతకు మరగినావు' అంటూ పాడారు. 'రాడాయె వెన్నెల రేడు లేడాయె మిన్నుల నేడు ఎదురు చూసి కన్ను దోయి అలసిపోయె కనవోయి నిరీక్షణ' కవిత. అప్పుడు ఎంత గొట్టుగా రాస్తే అంత మంచి కవిత అనే ఎరుక నాది. 'తృణ సస్య పర్ణస్థిత తుషారమ్ము స్వచ్ఛంద మౌక్తిక సమ ప్రకాశితమ్ము–తరుణీకంకణ కల నినాదమ్ముగృహ బహిర్ద్వారముల కలయంపి చిమ్ము' అని చిమ్ముతూ ఉండేవాణ్ణి! లంచాలను, అక్రమ సంబంధాలను, అత్యాచారాలను కూడా గేయాలతో బలంగా గాయపరచాను

నా మొదటి పుస్తకం

నలిమెల భాస్కర్



'సంతోషము సంత్రాసము వర్షమ్మును గ్రీష్మమ్మును వాత్సల్యము మాత్సర్యము రసఝురులను విష కీలల కారుణ్యము కాఠిన్యము ఒక్కరూపుగా తలచెడు సమదర్శిని సమదర్శిని' అంటూ నా గురించి చెప్పుకున్నాను. మొదటి ముద్దులో లేని, మొదటి ముద్దులో లేని, మొదటి పొగ గుక్కలో లభించని, చివరి అదృష్టపు డ్రాప్స్‌లో దొరకని అనుభవం సృజనకారులు తమ సిరా చుక్కల్ని మొదటి పుస్తకంలో చూసుకున్నప్పుడు పొందే అనుభూతితో కలుగుతుంది. అది చెప్ప శక్యం కాని ఆనందపారవశ్యం. ■

చిన్ని చిన్ని ఆనందాలు



ఎప్పుడో ఎక్కాల పుస్తకంలో
శ్రావణభాద్రపదాలు వర్షరుతువని
బట్టీ పెట్టిన దర్మాలు మారి
ఏ కాలంలోనైనా ఉక్కపోతల చెమట ఋతువే
ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే
మంచి మనసు లాంటి
మంచిగంధపు తెర వీచినంత ఆనందం

అప్పటివరకు
అలమరలో బీరువాలో వెదకి వెదకీ
ఇక కనబడదనుకొన్న ఇష్టమైన పుస్తకం
చాలాకాలం తర్వాత
అనుకోకుండా
పాతపుస్తకాల దొంతరలో
ఒక్కసారి కనబడగానే
ఎగిరి గంతేసినంత ఆనందం

ఆకులన్నీ రాలిపోయి
రెమ్మలన్నీ ఎండిపోయి
తలవాల్చేసిందనుకొన్న మొక్క
ఒకరోజు పొద్దున్నే
ఎండిన కొమ్మల మధ్యనుంచి
ఎర్రని చిగురునవ్వులతో పలకరించినపుడు
ఆకాశమే వంగినంత ఆనందం


చిన్నపుడు బళ్ళో
ఒకే బెంచీపై పక్కపక్కనే
కబుర్లు అల్లర్లు మేట్నీ సినిమాల
బాల్యస్నేహితురాలు
బతుకు తాపత్రయాల ప్రయాణంలో
చీలిన దారుల్లో
ఎవరికి వారు వేరయ్యాక
చిరకాలానంతరం కలిసినప్పుడు
ఉత్సాహం ఊయల్లో
ఊగిన ఆనందం

కృత్రిమ మేధా ప్రపంచంలో
చుట్టూ నిలువెత్తు
నిశ్శబ్దం గోడలు మొలిచినపుడు
ఉరి తీయబడుతున్న మాటల నేపథ్యంలో
ఒంటరితనం గొంగళి పురుగు
తన కన్నీటి పత్రాలను తానే తింటున్న వేళ
ఎక్కణ్ణుంచో
చెవుల్లో గుసగుసగా
పాట వినబడుతుంటే
మైమరచిన ఆనందం

చిన్న చిన్న ఆనందాలే
చెప్పలేని మాధుర్యాలు
ప్రమిదల్లో వత్తులు నిలిచి కాలుతున్నట్లు
జీవితాన్ని వెలిగించే అపురూప క్షణాలు

■ మందరపు హైమవతి

✆ 94410 62732



నయా వాణిజ్య దందా!

చూడడానికి అధికారుల వలే కనిపిస్తారు. తనిఖీలకు వెళ్లినప్పుడు అధికారులు చేసే హడావిడి చేస్తారు. బిల్లులు చూపించమని గద్దిస్తారు. ఆ తర్వాత ఆయా వ్యాపారుల నుంచి అందినకాడికి దండుకుంటారు. ఇదీ వాణిజ్య పన్నుల శాఖలో డ్రైవర్ల నయా దందా!. అధికారులు చేయాల్సిన సీవీటీ(వెహికల్ చెకింగ్ ట్యాక్స్)ను డ్రైవర్లే నిర్వహిస్తుండడం వాణిజ్య పన్నుల శాఖలో పెద్ద దుమారాన్ని రేపుతోంది. అధికారులు ఇచ్చిన అలుసుతో డ్రైవర్లు అడ్డగోలుగా రెచ్చిపోతున్నారు. వ్యాపారులను జలగల్లా పట్టుకుని పీడిస్తున్నారు. తనిఖీల పేరుతో డ్రైవర్లు చేస్తున్న అరాచకాలు పరాకాష్టకు చేరుతున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.



వాణిజ్య పన్నుల శాఖలో నకిలీ సీవీటీలు

అధికారుల అవతారం ఎత్తుతున్న డ్రైవర్లు

- ఒక్కో వ్యాపారి నుంచి వేలాది రూపాయల వసూలు
- ఉన్నతాధికారుల వద్దకు చేరిన ఇద్దరు, ముగ్గురు డ్రైవర్ల వ్యవహారం
- డ్రైవర్లతో అధికారుల కుమ్మక్కు!



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ప్రతి ప్రభుత్వ శాఖకు అధికారిక వాహనాలు ఉంటాయి. వాటి సంఖ్య ప్రతి ఏటా తగ్గుతూ వస్తోంది. కొత్త వాహనాల కొనుగోలుకు బడ్జెట్ కేటాయింపులు ఉండడం లేదు. దీంతో ప్రైవేటు కారులను ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకుంటున్నాయి. ఈ విధంగానే వాణిజ్య పన్నుల శాఖలోకి అధికారుల కోసం అద్దె కారులను తీసుకున్నారు. కారుల యజమానుల వద్ద ఉండే డ్రైవర్లే ఈ వాహనాలను నడుపుతారు. వాణిజ్య పన్నుల శాఖలో సుమారుగా 20-30 ప్రైవేటు కారులు ఉన్నాయి. ఈ వాహనాలకు డ్రైవర్లుగా ప్రైవేటు వ్యక్తులే వ్యవహరిస్తున్నారు. ఒక్కో కారుకు నెలకు రూ.36 వేలను అద్దెగా వాణిజ్య పన్నుల శాఖ చెల్లిస్తోంది. ఈ వాహనాలపై పనిచేసే డ్రైవర్లు సుదీర్ఘకాలంగా ఉండడంతో ఆయా సర్కిళ్లలో ఉన్న లొసుగులను పసిగట్టి వ్యవహారాలు చక్కబెడుతున్నారు. వ్యాపార సంస్థలు, సరుకు రవాణా వాహనాలు జీఎస్టీ చెల్లించాయా లేదా అన్న వివరాలను పరిశీలించడానికి వాణిజ్య పన్నుల శాఖలో ప్రధాన కార్యాలయం నుంచి షెడ్యూల్ ఇస్తారు. దీని ప్రకారమే సర్కిళ్లలోని అధికారులు సీవీటీ(వెహికల్ చెకింగ్ ట్యాక్స్)లకు వెళ్తారు. ఈ తనిఖీలకు వెళ్లినప్పుడు సహాయకులుగా అటెండర్లు, కారు డ్రైవర్లను తీసుకెళ్తున్నారు. అధికారులు సీవీటీల్లో ఏయే వివరాలు వ్యాపారులను, సరుకు మిగతా 4లో..

అధికారులే గేట్లు తెరిచారు!

సీవీటీలకు వెళ్లినప్పుడు అధికారులు వ్యాపారులను ఏ చిన్న లోపం కనిపించినా బెదిరిస్తున్నారు. వారి నుంచి సరుకు విలువను బట్టి ముడుపులు వసూలు చేస్తున్నారు. ఈ బాధ్యతలను డ్రైవర్లు, అటెండర్లతో చేయిస్తున్నారు. దీంతో డ్రైవర్లు తామే అధికారులమన్న భావనలోకి వెళ్లిపోతున్నారు. తమ కళ్ల ముందు అధికారులు ప్రదర్శించిన అధికార దర్పాన్ని ఎలాంటి అధికారం లేకపోయినా డ్రైవర్లు చూపిస్తున్నారు. అధికారులు వ్యాపారుల నుంచి ఎంతెంత వసూలు చేశారో ప్రత్యక్షంగా చూసిన డ్రైవర్లు నకిలీ తనిఖీల్లో అదే సూత్రాన్ని అమలు చేస్తున్నారు.



ట్రాఫికర్!

నందిగామ వద్ద బైపాస్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్

- వాహనదారుల కష్టాలు వర్ణనాతీతం
- తొమ్మిది నెలల క్రితం బైపాస్ విస్తరణ పనులకు బ్రేక్
- సర్వీసు రోడ్డే దిక్కు.. గుంతలమయం కావడంతో తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని జాతీయ రహదారులశాఖ అధికారులు


(ఆంధ్రజ్యోతి, నందిగామ): నందిగామ పట్టణంలోని వైజంక్షన్ వద్ద బైపాస్ రోడ్డు విస్తరణ పనులు సుమారు తొమ్మిది నెలల కిందట ఆకస్మికంగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి వాహనాలు అన్నీ సర్వీసు రోడ్డులోనే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఇటీవల జరిగిన వేర్వేరు బైక్ ప్రమాదాల్లో ఇద్దరు మిగతా 4లో..

జాతీయ రహదారుల శాఖ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందిగామ వద్ద బైపాస్ పనులు నిలిచిపోవడంతో గుంతలమయంగా తయారైన సర్వీసు రోడ్డులోనే ప్రయాణికులు అవస్థలు పడుతూ ముందుకు సాగుతున్నారు. ఆదివారం వాహనాల రద్దీ పెరగడంతో రెండు, మూడు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. అధికారుల తీరుపై ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

కరిగిపోతున్న ద్వీపం

133 ఎకరాల నుంచి 120 ఎకరాలకు తగ్గిన భవానీ ఐల్యాండ్

- 2009 నుంచి తరచూ కృష్ణానదికి వరదలు
- రూ.కోట్ల అభివృద్ధి పనులు వరదపాలు
- ద్వీపం రక్షణకు శాశ్వత పరిష్కారం అవసరం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణానదికి తరచూ వస్తున్న వరదలతో భవానీ ద్వీపం విస్తీర్ణం తగ్గిపోతోంది. 133 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దీపం ప్రస్తుతం 120 ఎకరాలకు చేరింది. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణం కనుమరుగైంది. గతేడాది రికార్డు స్థాయిలో వచ్చిన వరద కారణంగా ఆరు ఎకరాల విస్తీర్ణం కొట్టుకుపోయింది. భవానీ ద్వీపానికి 2009 నుంచి 2025 వరకు తరచూ వస్తున్న వరదల వల్ల క్రమంగా భారీ స్థాయిలో కోతకు గురవుతోంది. 2009లో కృష్ణానదికి 10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినపుడు మొదటిసారి కోతకు గురైంది. ప్రస్తుత టవర్ ఏరియా దాటి ముందుకు ఉండే ద్వీపం కాస్తా.. టవర్ అంచు వరకు వెళ్లిపోయింది. 2009 నుంచి 2024 వరకు చూస్తే భవానీ ద్వీపానికి మొత్తం ఎనిమిది సార్లు వరదలు వచ్చాయి. 2024లో రికార్డు స్థాయిలో వచ్చిన 12 లక్షల క్యూసెక్కుల వరద కారణంగా భవానీ ద్వీపానికి తీవ్ర నష్టం జరిగింది. కృష్ణానదికి 2009కి పూర్వం కూడా వరదలు వచ్చాయి. అప్పట్లో పెద్దగా కోతకు గురి కావటం కానీ, నష్టపోవటం కానీ జరగలేదు. అప్పట్లో పర్యాటకంగా భవానీ ద్వీపంలో పెద్దగా పెట్టుబడులు కూడా పెట్టలేదు. విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానదికి వరదలు రావటం రివాజుగా మారిపోయింది. ఉత్తరాది రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానదికి తరచూ వరద వస్తోంది. మరీ ముఖ్యంగా మహారాష్ట్రలో కురిసే భారీ వర్షాలతో కృష్ణానదికి వరద ఉప్పొంగుతోంది. ఉత్తరాది వర్షాలతో పాటు, పొరుగు రాష్ట్రం మిగతా 4లో..

రక్షణకు చర్యలు అవసరం

భవానీ ద్వీపాన్ని ప్రభుత్వం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. రాజధాని అమరావతికి కూత వేటు దూరంలో కృష్ణానదిలో సహజసిద్ధమైన ద్వీపం ఇది. భవానీ ద్వీపం కనుమరుగు కాకుండా ఉండాలంటే తక్షణం భవానీ ద్వీపాన్ని ఇప్పుడున్న పరిస్థితుల నుంచి కాపాడాలి. దీని కోసం రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఒకటి ద్వీపం చుట్టూ రిటెయినింగ్ వాల్ నిర్మించటం.. లేదంటే పూర్తిస్థాయిలో స్టీల్ షీటింగ్‌ను పైలింగ్ చేయటం వంటి చర్యల ద్వారానే భవానీ ద్వీపాన్ని కాపాడుకోవటం సాధ్యమవుతుందని నిపుణులు అంటున్నారు. లేనిపక్షంలో పెట్టుబడుల పరంగానూ, విస్తీర్ణంగానూ భవానీ ద్వీపానికి నష్టం జరిగే అవకాశం ఉంది.



బూడిదతో నిండిపోయిన వేడి నీటి కాల్వలోని నీరు

కృష్ణానదిలోకి బూడిద నీరు

ఎన్టీటీపీఎస్ తీరుపై సర్వత్రా విమర్శలు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీటీపీఎస్ అధికారులు ఆదివారం పెద్ద ఎత్తున బూడిద నీటిని వేడి నీటి కాలువ ద్వారా కృష్ణానదిలోకి వదిలేశారు. గమనించిన స్థానికులు ఎన్టీటీపీఎస్ యాజమాన్యం, అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. గత 45 రోజులుగా స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ ఉచితంగా బూడిద లోడింగ్ చేయాలని, టెండర్‌ను రద్దు చేయాలని చేస్తున్న ఆందోళనల వల్ల యాష్ పాండ్‌లో బూడిద రవాణా నిలిచిపోయింది. ఈక్రమంలో ఏం చేయాలో తెలియని యాజమాన్యం ఆదివారం పెద్ద ఎత్తున బూడిదతో నిండిన నీటిని వేడి నీళ్ల కాలువ ద్వారా కృష్ణానదిలో కలిపేసింది. ఎన్టీటీపీఎస్ అధికారుల దుశ్చర్యను ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కొండపల్లి మున్సిపాలిటీతో పాటు ఇబ్రహీపట్నంలోని మరో ఐదు గ్రామాల్లో ఉన్న1.5 లక్షల

తాగునీరు కలుషితమవుతుందని ప్రజల ఆందోళన

మంది ప్రజలు ఇప్పటికే ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో అనేక రోగాల పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అది సరిపోనట్లు ఇప్పుడు తాగునీటిని కూడా నేరుగా కలుషితం చేసే కుట్రలో భాగంగా వేడి నీటి కాలువలోకి బూడిద నీటిని వదలడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే కాలుష్యంపై ఎన్టీటీపీఎస్‌కు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మందలించినా యాజమాన్యం తన తీరు మార్చుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు ఫిల్టర్ బెడ్ వరకే బూడిద నీరు కలిసేదని, ఇప్పుడు కృష్ణానది మొత్తంలో బూడిద నీటిని వదిలి ఎన్టీటీపీఎస్ అధికారులు పెద్ద తప్పు చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. ఈ విషయంపై జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఎన్టీటీపీఎస్ చేస్తున్న దుర్మార్గపు చర్యలను ఆపి ప్రజల ప్రాణాలను రక్షించాలని, వాయు, నీటి కాలుష్యాలను అరికట్టేలా చూడాలని వేడుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
LiFE Lifestyle for Environment
ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు
డి.నెం.135-43, మొదటి అంతస్తు, SBI బిల్డింగ్ పైన, లక్ష్మీ కాంప్లెక్స్, JKC కాలేజి రోడ్, గుంటూరు. ఫోన్. 0863-2215537

పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533 తేది:14.09.2006 అనుసరించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, గుంటూరు వారు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా జిల్లా గనులు మరియు భూగర్భశాఖ కార్యాలయం వారు, సర్వే నెం.1, దిడుగు గ్రామం, అమరావతి మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522020 నందు విస్తీర్ణం 9.0 హెక్టార్లలో సాధారణ ఇసుక త్రవ్వకం (ఓపెన్ కాస్ట్ సెమీమెకనైజ్డ్) సంవత్సరానికి 90,000 క్యూబిక్ మీటర్లు లేదా 1,35,000 టీపిఏ కొరకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన ప్రతిపాదికులు ఇచ్చిన ప్రాజెక్టు కార్యకలాపాలకు సంబంధించిన వివరములు ఈ క్రింద విధమున పొందుపరచబడినవి.

1.	కంపెనీ పేరు చిరునామా తో	జిల్లా గనులు మరియు భూగర్భశాఖ అధికారి (తాత్కాలిక ప్రాజెక్ట్ ప్రతిపాదకుడు) డి.నెం.3-33-78, 3వ లైను, యన్‌జిఒ కాలని, నరసరావుపేట, పల్నాడు జిల్లా-522601
2.	ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశము, సర్వే నెంబర్లు మరియు స్థలము/లు కొలతలు	సర్వే నెం.1, దిడుగు గ్రామం, అమరావతి మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522020 విస్తీర్ణం: 9.0 హెక్టార్లు
3.	సంప్రదించవలసిన అధీకృత వ్యక్తి పేరు, చిరునామా & ఫోన్ నెం.	జిల్లా గనులు మరియు భూగర్భశాఖ అధికారి (తాత్కాలిక ప్రాజెక్ట్ ప్రతిపాదకుడు) డి.నెం.3-33-78, 3వ లైను, యన్‌జిఒ. కాలని, నరసరావుపేట, పల్నాడు జిల్లా-522601. ఫోన్: 9849190995
4.	ప్రాజెక్టు అంచనా వ్యయం	రూ. 33 లక్షలు
5.	కార్యకలాపాల వివరములు మరియు సామర్థ్యం	9.0 హెక్టార్లలో సాధారణ ఇసుక త్రవ్వకం (ఓపెన్ కాస్ట్ సెమీమెకనైజ్డ్) సంవత్సరానికి 90,000 క్యూబిక్ మీటర్లు లేదా 1,35,000 టీపిఏ కొరకు
6.	బహిరంగ విచారణ తేది / ప్రదేశం / సమయం	తేది : 05-11-2025 (బుధవారం) సమయం: మధ్యాహ్నం గం॥03:00 లకు ప్రదేశము: గ్రామ సచివాలయ కార్యాలయం, దిడుగు గ్రామం, అమరావతి మండలం, పల్నాడు జిల్లా.
7.	ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కార్యనిర్వాహక సారాంశము (తెలుగు మరియు ఆంగ్లము) మరియు పర్యావరణప్రభావ అంచనా రిపోర్టులు ప్రజల పరిశీలనార్థం దిగువ ప్రదేశములందు ఉంచడమైనది.	

1. కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, పల్నాడు, పల్నాడు జిల్లా.
2. ముఖ్య కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్ ఆఫీస్, గుంటూరు
3. జాయింట్ డైరెక్టర్, పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయం మరియు క్లైమేట్ ఛేంజ్, భారత ప్రభుత్వం సమీకృత ప్రాంతీయ కార్యాలయం (ఐఆర్ఓ) గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్డు, విజయవాడ-520010.
4. మెంబర్ సెక్రటరీ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డ్, పర్యావరణ్ భవన్, ఎపిఐఐసి కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ-520007.
5. జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ కార్యాలయము, ప్లాట్ నెం.41, కనకదుర్గ ఆఫీసర్స్ కాలనీ, గురునానక్ రోడ్, విజయవాడ.
6. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, ప్రాంతీయ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, డి.నెం.135-43, మొదటి అంతస్తు, SBI బిల్డింగ్ పైన, లక్ష్మీ కాంప్లెక్స్, JKC కాలేజి రోడ్, గుంటూరు, గుంటూరు జిల్లా.
7. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, ప్లాట్ నెం.41, కనకదుర్గ ఆఫీసర్స్ కాలనీ, గురునానక్ రోడ్, విజయవాడ.
8. జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, పల్నాడు, పల్నాడు జిల్లా.
9. రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా.
10. తహశీల్దార్ వారి కార్యాలయం, అమరావతి మండలం, పల్నాడు జిల్లా.
11. తహశీల్దార్ వారి కార్యాలయం, చందర్లపాడు మండలం, యన్‌టిఆర్ జిల్లా.
12. తహశీల్దార్ వారి కార్యాలయం, కంచికచర్ల మండలం, యన్‌టిఆర్ జిల్లా.
13. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం, దిడుగు (గ్రా), అమరావతి మండలం, పల్నాడు జిల్లా.
14. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం, లింగాపురం (గ్రా), అమరావతి మండలం, పల్నాడు జిల్లా.
15. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం, కస్తల (గ్రా), అమరావతి మండలం, పల్నాడు జిల్లా.
16. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం, విభరీతలపాడు (గ్రా), చందర్లపాడు మండలం, యన్‌టిఆర్ జిల్లా.
17. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం, చింతలపాడు (గ్రా), చందర్లపాడు మండలం, యన్‌టిఆర్ జిల్లా.
18. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం, ఏటూరు (గ్రా), చందర్లపాడు మండలం, యన్‌టిఆర్ జిల్లా.
19. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం, వేములపల్లి (గ్రా), కంచికచర్ల మండలం, యన్‌టిఆర్ జిల్లా.
20. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం, మొగులూరు (గ్రా), కంచికచర్ల మండలం, యన్‌టిఆర్ జిల్లా.

సంబంధిత ప్రజలు వారి సలహాలు, అభిప్రాయాలు, వ్యాఖ్యలు మరియు అభ్యంతరములు ఏమైనా ఉన్నట్లయితే ఈ ప్రకటన ప్రచురించబడిన 30 రోజుల లోపు తెలుప వలసినదిగా కోరడమైనది. పై పేర్కొనబడిన విధముగా సంబంధిత ప్రజలు ఎవరైనా తమ వ్రాతపూర్వకమైన సలహాలను, అభిప్రాయాలను ఈ దిగువ సంతకం చేయబడిన అధికారి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణమండలి వారికి పంపవచ్చును. సంబంధితులందరూ పైన తెలుపబడిన తేదీ, ప్రదేశమున బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలుపవచ్చును.

ప్రదేశం: గుంటూరు
తేది : 05-10-2025

సం/- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరు
ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, గుంటూరు



శీఘ్ర దర్శనం

ఇంద్రకీలాద్రిపై సాధారణ స్థితి

- క్రమంగా తగ్గుతున్న భవానీల రద్దీ
- హోల్డింగ్ పాయింట్లు రద్దు
- కమాండ్ కంట్రోల్ సెంటర్ మూసివేత

విజయవాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ క్రమంగా తగ్గుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వచ్చినట్టుగా క్యూలైన్లలోకి చేరుకుంటున్నారు. వినాయకుడి ఆలయం నుంచి క్యూలైన్లలో ఘాట్ రోడ్డు మీదుగా ప్రధానాలయానికి వెళ్తున్నారు. భక్తులకు దర్శన సమయం గంట పడుతోంది. భవానీల సంఖ్య తగ్గడంతో అధికారులు హోల్డింగ్ పాయింట్లను రద్దు చేశారు. అదేవిధంగా మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మూసివేశారు. సెప్టెంబరు 22 నుంచి ప్రారంభమైన దసరా శరన్నవరాత్రులు మొదలు శనివారం వరకు మొత్తం 16 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది ఐదారు లక్షల మిగతా 4లో..

రైల్వేలో దసరా జోష్!

ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిన విజయవాడ డివిజన్

- శనివారం 2.80 లక్షల మంది ప్రయాణం.. రూ.5 కోట్ల ఆదాయం
- ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల నుంచి భారీగా రాక
- డివిజన్ ఆదాయంలో సింహభాగం విజయవాడ రైల్వేస్టేషన్‌దే !
- ఒక్కరోజే 82 వేల మంది ప్రయాణికులు ..రూ. 2 కోట్ల ఆదాయం
- ఉద్యోగుల సమష్టి కృషి ఫలితమే : డీఆర్ఎం మోహిత్ సోనాకియా

విజయవాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకునేందుకు రైళ్లలో విజయవాడ తరలివచ్చారు. నవరాత్రుల్లో ప్రతి రోజూ రైళ్లు కిక్కిరిసిపోయి నడిచాయి. దసరా పండగ తర్వాత ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాలు, రాయలసీమ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భవానీలు కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి వచ్చారు. దీంతో శనివారం ఒక్క రోజే రికార్డు స్థాయిలో 2.80 లక్షల మంది బయట ప్రయా



ణికులు రాకపోకలు సాగించారు. లోకల్‌గా కూడా ప్రయాణాలు చూస్తే మొత్తంగా 5.5 లక్షల మంది ప్రయాణికులు చేశారు. శనివారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను 1.90 లక్షల మంది దర్శనం చేసుకోవటానికి వచ్చారు. ఈ నేపథ్యంలో 82 వేల మంది మిగతా 4లో..

కనకదుర్గమ్మ దసరా ఉత్సవాల నేపథ్యంలో విజయవాడ రైల్వే డివిజన్ రికార్డు స్థాయిలో ఆదాయాన్ని ఆర్జించింది. శనివారం ఒక్క రోజే 2.80 లక్షల మంది ప్రయాణం చేయడం ద్వారా రూ. 5 కోట్ల ఆదాయాన్ని సాధించి చరిత్ర సృష్టించింది. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలోనే ఏ డివిజన్ కూడా ఒక్క రోజులో ఇంత ఆదాయాన్ని సాధించలేదు. తొలిసారిగా ఈ రికార్డును విజయవాడ రైల్వే డివిజన్ దక్కించుకుంది.



హుండీలపైనే ఆశలు!

- నేటి నుంచి దుర్గగుడి హుండీల ఆదాయం లెక్కింపు 4

భవానీపురంలో కలకలం రేపిన హత్య

- భార్యను దూరం చేసిందని వృద్ధురాలిని చంపిన వ్యక్తి

పీడీఎస్ అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలి

» మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పంపిణీ చేసే పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందజేస్తున్న సుమారు 28లక్షల టన్నుల బియ్యంలో సుమారు మూడింట రెండువంతుల బియ్యంలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. కిలో 8 నుంచి 10 రూపాలయల చొప్పున బ్రోకర్లకు విక్రయిస్తున్నారని, వారు కిలో రూ.18కి రైస్‌మిల్లర్లకు విక్రయిస్తున్నట్టు చెప్పారు అదే బియ్యాన్ని ప్రాసెస్ చేసి సుమారు కిలో రూ.33లకు ప్రభుత్వానికి, కాకినాడ పోర్టు ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారని ఆరోపించారు.

సమస్యలపై పీహెచ్‌సీ వైద్యుల దీక్ష

ధర్నాచౌక్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని పీహెచ్‌సీ వైద్యులు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో నిరాహార దీక్షను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇచ్చిన హామీ మేరకు ఇన్‌సర్వీస్ పీజీ కోటాలో 20 శాతం కొనసాగించాలన్నారు. 20 ఏళ్లుగా పీహెచ్‌సీ వైద్యులకు ఎటువంటి ప్రమోషన్లు కల్పించడం లేదని వాపోయారు. ఆటవీ ప్రాంతాల్లో సేవచేస్తున్న వైద్యులకు ట్రైబల్ అలవెన్స్ అందడంలేదన్నారు. గత మూడేళ్లుగా నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదన్నారు. ఇతర వైద్యసంఘాలతో మాదిగానే తమసంఘంతో కూడా గ్రీవెన్స్ కన్సల్టేషన్, ప్లానింగ్ చర్చలు జరపాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డాక్టర్ రవీంద్ర, డాక్టర్ కిషోర్ పలువురు వైద్యులు పాల్గొన్నారు.



ఎంపీ శివనాథ్‌ను శాలువాతో సత్కరించిన జైన సంఘం నిర్వాహకులు

విజయవాడ అభివృద్ధిలో జైనుల పాత్ర కీలకం

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగర అభివృద్ధి, వాణిజ్య రంగం, సామాజిక సేవల్లో జైనుల పాత్ర కీలకమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని వన్‌టౌన్ (తమినవారి వీధి) జైన్ టెంపుల్ వీధిలో ఆదివారం ఘనంగా శ్రీసంభవనాథ్ జైన్ శ్వేతాంబర్‌మూర్తి పూజక్ సంఘం ఆధ్వర్యంలో మెగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన మహోత్సవానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు ఆహారం వడ్డించారు. ఈ సందర్భంగా ఎంపీ జైన సమాజ ఆధ్యాత్మిక సంప్రదాయాలు, సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం జైనుల సంప్రదాయ రీతిలో ఎంపీకి సంఘం సభ్యులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మెగా అన్నదాన కార్యక్రమం 25ఏళ్లు పూర్తి చేసుకోవడం విశేషమన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు జయంతి లాల్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జైనులు, భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

దుర్గగుడికి కంప్యూటర్, ప్రింటర్లు విరాళం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన టీడీపీ అధికార ప్రతినిధి ఎ.ఎస్.రావు కుటుంబసభ్యులతో కలిసి రూ.లక్ష విలువ చేసే కంప్యూటర్, రెండు ప్రింటర్లను ఆదివారం ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం, చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి



అలరించిన గీతా మాధురి లైవ్ మ్యూజిక్

గొల్లపూడి : గొల్లపూడిలోని ఎగ్జిబిషన్‌లో ఆదివారం రాత్రి ప్రముఖ సింగర్ గీతా మాధురి లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. హనుమాన్‌తో కలిసి గీతా మాధురి పాడిన 'రాను బొంబాయికి.. రాను.. పాట ప్రేక్షకులను ఒక ఊపు ఊపింది. 'నేను పక్కా లోకల్, నేను పక్కా లోకల్, టాప్ లేచిపోద్ది టాప్ లేచిపోద్ది, డార్లింగే డార్లింగే ఒసినా డార్లింగే' పాటలతో ప్రేక్షకులను అలరించారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న బస్సు

» నల్లగొండ జిల్లాలో ప్రమాదం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు తీవ్రగాయాలు

చిట్యాల రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారును ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో అది దాని ముందు ఉన్న మరో ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఢీకొని నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన జోష్ కుమార్, విజయవాడకు చెందిన పైలా మురళి, మచిలీపట్నానికి చెందిన చల్ల శ్రీహర్షలు శనివారం విజయవాడ దుర్గమ్మను దర్శించుకుని కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున చిట్యాల శివారులోని ఓ పెట్రోల్ బంకు వద్ద రహదారిపై వాహనాలు నిదానంగా వెళుతున్నాయి. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక ఆగి ఉన్న వారి కారును హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు రెండు బస్సుల మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయింది. వెంటనే ఇతర వాహనదారులు కారులో ఉన్న ముగ్గురిని బయటకు తీశారు. వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స కోసం నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించారు. శ్రీహర్ష పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఆసుపత్రికి పంపించారు. పైలా మురళి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్సై రవి కుమార్ తెలిపారు.

శీఘ్ర దర్శనం

(3వ పేజీ తరువాయి)

మంది భవానీలు మాలలు ధరించారని గురుభవానీలు చెబుతున్నారు. దసరా ఉత్సవాలు పూర్తయిన మూడు, నాలుగు రోజుల వరకు భవానీల తాకిడి ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న భవానీలు దాదాపుగా శనివారం రాత్రికి అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులు సమర్పించినట్టు తెలుస్తోంది. ఇంకా మిగిలిన భవానీలు సోమ, మంగళవారాల్లో వస్తారని గురుభవానీలు చెబుతున్నారు. నెమ్మదిగా ఇంద్రకీలాద్రిపై సాధారణ పరిస్థితి నెలకొంటుంది.

హుండీలపైనే ఆశలు!

» దసరా ఉత్సవ ఖర్చు రూ. 15 కోట్లు

» ఈ ఏడాది టిక్కెట్ల రూపంలో రూ. కోటి ఆదాయం కోల్పోయిన దేవస్థానం

» నేటి నుంచి దుర్గగుడి హుండీల ఆదాయం లెక్కింపు

» గతేడాది ఖర్చు రూ.13 కోట్లు.. రూ.10.50 కోట్లు ఆదాయం



దుర్గగుడిలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవస్థానం దుర్గామలేశ్వరస్వామి ఆలయానికి ఈసారి దసరా ఉత్సవాలు ఆదాయార్జనలో కాస్త నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. గతేడాది కంటే అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో.. సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తీసుకున్న నిర్ణయాలతో టికెట్ల ఆదాయంలో భారీ కోత పడింది. గతేడాది టిక్కెట్ల ద్వారా రూ.6.50 కోట్లు రాగా.. ఈ ఏడాది రూ.5.50 కోట్లు ఆదాయం వచ్చింది. ఈసారి రూ. 10 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అధికారుల అంచనా. సోమవారం నుంచి మూడురోజుల పాటు హుండీల ఆదాయం లెక్కింపుపైనే దేవస్థాన అధికారులు ఆశలు పెట్టుకున్నారు.

దసరా ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాల నుంచి డబ్బులు రావటం లేదు. అమ్మకు ఉత్సవాలలో వచ్చే ఆదాయంతోనే దసరా ఏర్పాట్లు చేస్తుంటారు. గతేడాది హుండీల ద్వారా రూ. 4 కోట్లు.. మొత్తంగా రూ.10.50 కోట్ల ఆదాయం రాగా.. ఖర్చులు రూ.13 కోట్లు అయ్యాయి. ఈ ఏడాది రూ. 15 కోట్ల మేర దేవస్థాన అధికారులు ఏర్పాట్లకు ఖర్చు పెట్టారు. సామాన్య భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దసరా ఉత్సవాలకు ముందే రూ.500 టిక్కెట్ దర్శనాలను రద్దుచేశారు. ఈ దసరా ఉత్సవాలకు అశేషంగా భక్తులు తరలివచ్చారు. ఒక్క రోజు తప్పితే మిగిలిన అన్ని రోజులూ లక్షకు తగ్గకుండా కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి వచ్చారు. సామాన్యభక్తులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి వీలుగా టిక్కెట్లను రద్దుచేసి అందరికీ ఉచితంగా దర్శన అకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ఇంద్రకీలాద్రిపై లెక్కించే హుండీలపై దేవస్థాన అధికారులు ఆశలు పెట్టుకున్నారు. భక్తుల తాకిడి కారణంగా క్యూలలో రద్దీని నివారించటానికి పోలీసులు భక్తులు ఆగి హుండీలలో డబ్బులు వేసే సమయం కూడా ఇవ్వలేదు. దీంతో చాలామంది భక్తులు హుండీలలో కానుకలు వేయలేకపోయారని తెలుస్తోంది. ఇదే జరిగితే రూ. 3 నుంచి రూ. 5 కోట్ల వరకు దేవస్థానం భరించే పరిస్థితి ఏర్పడబోతోంది.



లడ్డూ విక్రయాలు ఆదాయంగా పరిగణించలేం

దసరాలో ఉత్సవాల్లో కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదాల విక్రయాలకు సంబంధించి ఆదాయంగా పరిగణించే పరిస్థితి లేదు. కేజీ లడ్డూ తయారీకి నాణ్యమైన సరుకులను ఉపయోగిస్తున్న కారణంగా రూ. 800 నుంచి రూ. 1000 వరకు ఖర్చు అవుతోంది. పరిమాణం రీత్యా 80 గ్రాముల లడ్డూను అందిస్తున్నారు. కేజీ లడ్డూలను అధికారులు కేవలం రూ.400లకే విక్రయిస్తున్నారు. దీంతో ఈసారి భారీ సంఖ్యలో లడ్డూల విక్రయాలు జరిగాయి. లడ్డూల విక్రయాల ద్వారా ఆదాయం వచ్చినా.. దానికి అయ్యే ఖర్చు ఇంకా పెరుగుతుందనేది తెలిసిందే..

14 రోజుల్లో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు 20 లక్షలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా ఉత్సవాలతో పాటు ఈనెల 5వ తేదీ రాత్రి వరకు మొత్తం 20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఈవో వీకే శీనానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 22 నుంచి దుర్గమ్మ వారిని 11 రోజుల పాటు 15,90,400 మంది భక్తులు దర్శించుకున్నారని ఈవో వివరించారు. ఉత్సవాల అనంతరం 3వ తేదీన 1,47,590 మంది, 4వ తేదీన 1,38,360 మంది, 5వ తేదీ రాత్రి వరకు మొత్తం కలిపి 20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

క్యూలైన్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత...

ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి దేవస్థానం అధికారులు క్యూలో కాలినడకన అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అంతరాయం కలగకుండా భద్రత నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. భక్తులను గాలిగోపురం నుంచి నేరుగా ఘాట్ రోడ్డులోకి అనుమతించారు. ఆదివారం కూడా అధికారులు ఘాట్ రోడ్డులోకి వాహనాలను నిలిపివేశారు. కేవలం వీఐపీ వాహనాలను మాత్రమే కొండపైకి అనుమతించారు.

నేటి నుంచి ఘాట్‌రోడ్డులోకి వాహనాల అనుమతి

దుర్గగుడిలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని రెండు రోజుల ముందు నుంచి ఘాట్ రోడ్డుపై వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. కేవలం కమిటీ ఛైర్మన్, కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబులు ఇచ్చిన పాస్‌లు ఉన్న వాహనాలను మాత్రమే అనుమతించారు. సోమవారం నుంచి ఘాట్ రోడ్డులోకి యథావిధిగా వాహనాలను అనుమతించనున్నట్టు అధికారులు తెలిపారు.

ఇంద్రకీలాద్రికి భవానీల తాకిడి..

» ఆదివారం పెరిగిన రద్దీ.. నేటి నుంచి తగ్గనున్న భక్తులు



రద్దీగా క్యూ లైన్లు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీ భక్తుల తాకిడి కొనసాగుతోంది. దసరా మహోత్సవాలు ముగిసిన తరువాత కూడా భవానీదీక్షాధారులు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి 68,540 మంది భక్తులు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. మరోవైపు దసరా సెలవులు ముగియనుండటంతో కుటుంబాలతో సహా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భక్తులకు మంచినీరు, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం, తరువాత 10 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతోంది. ఈవో వీకే శీనానాయక్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ రాధాకృష్ణ (గాంధీ) భక్తుల సౌకర్యాలపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. సోమవారం నుంచి పనిదినాలు ప్రారంభం కానుండటంతో భక్తుల రాక తగ్గుతుందని భావిస్తున్నారు. దేవస్థానం సిబ్బంది, పోలీస్, రెవెన్యూ, నగరపాలక సంస్థ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తిస్తున్నారని ఈవో శీనానాయక్ తెలిపారు.



అమ్మను దర్శించుకుంటున్న భవానీలు

భవానీ భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు : ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి : దసరా మహోత్సవాల అనంతరం అమ్మవారి దర్శనానికి పెద్దఎత్తున తరలివస్తున్న భవానీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈవో వీకే శీనానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన కనకదుర్గానగర్‌లోని ప్రసాదాల కౌంటర్లు, అన్నదాన విభాగం, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కనకదుర్గానగర్‌లోని ప్రసాదాల కౌంటర్లను పరిశీలించిన ఆయన లడ్డూల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అన్నదాన విభాగాన్ని పరిశీలించి భక్తులతో నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.



అనతరం ఘాట్ రోడ్డులో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. క్యూలలో భక్తులకు మంచినీరు, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ జరుగుతూనే ఉండాలని అధికారులకు సూచించారు. సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయా విభాగాల అధికారులను ఈవో ఆదేశించారు.

భవానీపురంలో కలకలం రేపిన హత్య

» పోలీసుల అదుపులో నిందితులు

» హత్య కేసు నమోదు

విద్యాధరపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భవానీపురంలో వృద్ధురాలి దారుణహత్య స్థానికంగా కలకలం రేపింది. వృద్ధురాలు మ్యారేజీ బ్యూరో నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. నిందితుడు ఆమె సోదరి కొడుకు వంకధార హనుమాన్‌జీ సుబ్రహ్మణ్యంగా పోలీసులు నిర్ధారించారు. హత్యపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీపురం హెచ్‌బి కాలనీ ఎంఐజీ 1, బ్లాక్ నెం.21, ప్లాట్ నెం.1లో (కుండల బజార్) వంకధార హనుమాన్‌జీ సుబ్రహ్మణ్యం భార్య, కుమారుడితో కలిసి ఉంటు.. టైలరింగ్ పనులతో పాటు ఓ షాపులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అతడి భార్య ఓ రౌడీషీటర్‌తో సన్నిహితంగా ఉంటూ మూడేళ్ల క్రితం భర్తనుంచి విడిపోయి కుమారుడితో వెళ్లిపోయినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవానీపురం ఊర్మిళానగర్ చివరి రోడ్డులో ఉంటున్న పిన్నివరసైన పొత్తూరి విజయలక్ష్మి (60) ప్రోత్సాహంతోనే తన భార్య వెళ్లిపోయిందనే కోపంతో నిందితుడు సుబ్రహ్మణ్యం ఆమెపై పగ పెంచుకున్నాడు. విజయలక్ష్మి హత్యకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. దీనిలో భాగంగా ఈనెల 1న సుబ్రహ్మణ్యం కుమారుడు బైక్‌పై విజయలక్ష్మిని హెచ్‌బి కాలనీలోని తనఇంటికి తీసుకువచ్చాడు. అప్పటికే ఇంట్లో సిద్ధంగా సుబ్రహ్మణ్యం పథకం ప్రకారం ఆమెను పదునైన ఆయుధాలతో హత్యచేసి శరీర భాగాలను వేరు చేశాడు. శరీర భాగాలను రెండు గోనె సంచుల్లో కట్టి అర్ధరాత్రి బైక్‌పై డ్రైనేజీ కాలువల్లో ఇంటికి తాళాలు వేసి కుమారుడితో కలిసి నంద్యాల వెళ్లిపోయాడు. అయితే విజయలక్ష్మి కనిపించటం లేదని ఆమె బంధువు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సీసీ పుటేజీ ద్వారా నిందితులను గుర్తించి వారు నంద్యాలలో ఉన్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకుని విజయవాడ తరలించి విచారిస్తున్నారు.విజయలక్ష్మి హత్యపై ఆదివారం ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.





విజయలక్ష్మిని హత్య చేసిన నిందితుడి ఇల్లు

సాఫీగా ఏపీపీ పరీక్ష

అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 42అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) పోస్టులకు జరిగిన రాత పరీక్ష సాఫీగా ముగిసింది. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు నాలుగు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1,494మంది అభ్యర్థులు హాజరైనట్టు రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా తెలిపారు. పరీక్షకు సంబంధించిన కీ సోమవారం మధ్యాహ్నం 12గంటలకు విడుదల చేస్తామని చెప్పారు. అభ్యంతరాలున్న వారు ఈ నెల 8లోగా ఎస్ఎల్‌పీఆర్‌బీకి మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు.

ట్రాఫికర్!

(3వ పేజీ తరువాయి)

మహిళలు మృతిచెందారు. అయినా సదరు కాంట్రాక్టర్ గుంతలు మాత్రం పూడ్చటంలేదు. గుంతల వద్ద వాహనాలు నిదానంగా వెళ్లడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ప్రధాన కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ మధ్య ఏర్పడిన ఆర్థిక వివాదాలతోనే రోడ్డు పనులు ముందుకు సాగడంలేదని తెలిసింది. రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వేలాది వాహనాలు విజయవాడ వైపు వచ్చాయి. గంటల తరబడి ట్రాఫిక్‌లో నిరీక్షించలేక ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికీ సంబంధిత అధికారులు కనీస మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఆదివారం వాహనదారులు అదే ప్రదేశంలో మరో మారు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎవరైనా ఫిర్యాదు చేయాలన్నా హైవే అథారిటీ అధికారులు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి.

నయా వాణిజ్య దందా!

(3వ పేజీ తరువాయి)

రవాణా వాహనదారులను అడుగుతారో వారు తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత నుంచి డ్రైవర్లు రాత్రి సమయాల్లో అధికారుల అవతారం ఎత్తుతున్నారు. సాధారణంగా సీటీలకు సంబంధించి ఒక సర్కిల్ పరిధిలోని అధికారులను మరో సర్కిల్‌లోకి పంపుతారు. దీన్ని గమనించిన డ్రైవర్లు తమకు నచ్చిన సర్కిళ్లలోకి వెళ్లి తనిఖీలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కార్యాలయం పనివేళలు ముగిసిన తర్వాత అధికారులను వారి ఇళ్ల వద్ద వదిలిపెట్టి వాహనాలను అక్కడే విడిచిపెట్టాలి. డ్రైవర్లు ఆ విధంగా చేయడం లేదు. అధికారులను ఇళ్ల వద్ద దింపేసిన తర్వాత కారులను తీసుకుని వెళ్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ కారులను తీసుకుని సీటీలకు వెళ్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు డ్రైవర్లు ఈవిధంగా చేసినట్టు ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. అధికారులు కారుల్లో ఉన్నారని వ్యాపారులను బెదిరించి వేలాది రూపాయలను వసూలు చేసినట్టు ఆరోపణలు బలంగా ఉన్నాయి.

ఏఎన్ఆర్ బార్ సీజ్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో ఉన్న ఏఎన్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌ను సీజ్ చేసినట్టు భవానీపురం ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ ఆదివారం రాత్రి తెలిపారు. అన్నమయ్య జిల్లా ములకల చెరువు నకిలీ మద్యం కేసులో ఉన్న అద్దెపల్లి జనార్దన్ పేరుతో ఉన్న ఏఎన్ఆర్ బార్‌ను సీజ్ చేశామన్నారు. స్టాక్‌ను తనిఖీ చేశామని, ఇక్కడ మద్యం ఏం లభించలేదని సీఐ తెలిపారు. అక్కడి కేసులో ఇబ్రహీంపట్నంకు చెందిన జనార్దన్ ఏ1 ముద్దాయిగా ఉన్నట్టు సీఐ తెలిపారు.



సీజ్‌చేసిన ఏఎన్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్

రైల్వేలో దసరా జోష్!

(3వ పేజీ తరువాయి)

విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించారు. విజయవాడ రైల్వేస్టేషన్ ఒక్కటే రూ.2 కోట్ల ఆదాయాన్ని సాధించింది. బయటి నుంచి వచ్చిన ప్రయాణికులు కాకుండా లోకల్‌గా కూడా కలిపితే విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి 1.7 లక్షల మంది ప్రయాణాలు చేశారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో విజయవాడకు పోటెత్తుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని విజయవాడ రైల్వే డివిజనల్ అధికారులు ప్రయాణికులకు ఎక్కడా సమస్యలు రాకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్‌తో పాటు డివిజన్ పరిధిలోని ప్రధాన స్టేషన్లలో కూడా 25 అదనపు బుకింగ్, రిజర్వేషన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా మొత్తం 72 ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ (ఏటీవీఎం)లను ప్రారంభించారు. ఫలితంగా రికార్డు స్థాయిలో ప్రయాణికులు వచ్చినా కూడా ఎక్కడా ప్రయాణికులకు ఇబ్బందులనేవి తలెత్తకుండా సాఫీగా నడిచింది. విజయవాడ డివిజన్ దక్షిణ మధ్యరైల్వే పరిధిలోనే రికార్డు స్థాయిలో ఆదాయం సాధించటంపై డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) మోహిత్ సోనాకియా అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషిని అభినందించారు.

కరిగిపోతున్న ద్వీపం

(3వ పేజీ తరువాయి)

తెలంగాణలో కూడా ఇటీవల కాలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏడాదిలో మూడు నుంచి నాలుగు సార్లు వరదలు వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ ఏడాది చూస్తే ఇప్పటికి 10 సార్లకుపైగా కృష్ణానదికి వరద వచ్చింది. దసరాకు ముందు ఏడు లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. తరచూ వస్తున్న వరదల కారణంగా భవానీ ద్వీపం కొట్టుకుపోతోంది. ఇప్పటికే 13 ఎకరాలు కొట్టుకుపోయిన నేపథ్యంలో, రానున్న రోజుల్లో భారీ వరదలు వస్తే ఇదే వాలుగా ద్వీపం మరింత తరిగిపోయే ప్రమాదం ఉంది. రానున్న కాలంలో భవానీ ద్వీపం మనుగడకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది.

రూ. కోట్లు వరద పాలు

పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు రెండు దశాబ్దాలుగా భవానీ ద్వీపంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాయి. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రగా ఏర్పడిన క్రమంలో అమరావతి రాజధానికి చెంతనే ఉండటం వల్ల ప్రభుత్వం భవానీ ద్వీపానికి పెద్దపీట వేసింది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. 2024లో వచ్చిన వరదల కారణంగా ద్వీపంలో చేపట్టిన అభివృద్ధి అంతా కూడా వరదకు కొట్టుకుపోయింది. ఆ ఏడాది రూ.5 కోట్ల మేర నష్టం వాటిల్లింది. 2016-17 మధ్య కాలంలో కృష్ణానదిలో ప్రభుత్వం రూ.12 కోట్ల వ్యయంతో ఆసియా దేశాలలోనే అత్యంత భారీగా మ్యూజికల్ అండ్ ఫ్లోటింగ్ లేజర్ షోను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వచ్చిన వరదల కారణంగా ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెయిన్ అండ్ లేజర్ షో కొట్టుకుపోయింది. దీనికి ఇన్సూరెన్స్ చేసినా ఇప్పటికీ ఆ డబ్బులు రాలేదు. భవానీ ద్వీపంలో ప్రతిదానికి ఇన్సూరెన్స్ చేసినా.. వరదల వల్ల సంభవించిన నష్టాలలో గోరంత సాయం మాత్రమే వచ్చింది. ఇప్పటి వరకు భవానీ ద్వీపంలో వరదల కారణంగా రూ. 30 కోట్ల మేర పెట్టిన పెట్టుబడులకు నష్టం జరిగింది.

డాక్యుమెంట్ రైటర్‌పై రియల్టర్ల దాడి

పాయకాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : డాక్యుమెంటు రైటర్, లాయర్ అయిన ఓ వ్యక్తిపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు దాడిచేసి గాయపరచిన సంఘటన ఆదివారం రాత్రి కండ్రికలో జరిగింది. సత్యనారాయణపురానికి చెందిన పాలమర్తి రాజశేఖర్ డాక్యుమెంట్ రైటర్‌గాను, న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. కండ్రిక ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు గేదల వెంకటేశ్వరరావు, అంజిబాబు అతడికి పరిచయమయ్యారు. రాజశేఖర్‌తో తమ వెంచర్లకు సంబంధించిన పనులు చేయించుకుంటారు. రాజశేఖర్ అప్పుడప్పుడూ వారికి డబ్బులు ఇస్తూంటాడు. ఈ నేపథ్యంలో ఓ వెంచర్ విషయంలో వారి మధ్య వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి డబ్బులు ఇస్తానని చెప్పి రాజశేఖర్‌ను తీసుకెళ్లి వెంకటేశ్వరరావు, అంజిబాబు అతడిపై దాడిచేసి గాయపరిచారు. దీంతో బాధితుడు రాజశేఖర్ నున్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం తెలిపారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరి స్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఇతర సమాచారం తెలుసుకొనేందుకు 1100కు నేరుగా ఫోన్ చేయవచ్చన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ!

- కరెన్సీనగర్‌లో పూడుకుపోయిన డ్రెయిన్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- తేలికపాటి వర్షానికే జలమయం అవుతున్న రోడ్లు



ఇటీవల కురిసిన వర్షానికి నీటమునిగిన దాసాంజనేయ స్వామి గుడి (ఫైల్)

భారతీనగర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప.. ఊరుదిబ్బ అన్న చందానంగా కరెన్సీనగర్ కాలనీ పరిస్థితి ఉంది. తూర్పు నియోజక వర్గంలోని 3వ డివిజన్ కొంత కాలంగా ప్రధాన సమస్యలైన డ్రెనేజీలపై అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో



కాలనీ సర్వీస్ రోడ్డు డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలు

సమస్యలకు నిలయంగా మారింది. కాలనీలోని ప్రధాన, అంతర్గత రోడ్లువెంట డ్రైనేజీ వ్యవస్థ పూడికతో నిండిపోవడంతో చిన్నపాటి వర్షం కురిసిన కాలనీలోని పలు రోడ్లు జలమయం అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దానికి ప్రధాన కారణం డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం ఉండటమేనని విమర్శిస్తున్నారు. ఇటీవల రెండు రోజుల పాటు కురిసిన వర్షానికి కాలనీలోని దాసాంజనేయస్వామి గుడి రోడ్డుతో పాటు పలు అంతర్గత రోడ్లు మునిగి పోయాయి. దీంతో కాలనీలో నుంచి బయటకు వెళ్ల లేని పరిస్థితి నెలకొంటుందని స్థానిక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పండలనేని గోపాలకృష్ణయ్య రోడ్డు సైడ్ కాలువల్లో పెరిగిన పచ్చగడ్డి



అంబేడ్కర్ స్మృతి వనం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు ఇవ్వాలి: సీపీఎం

లబ్బీపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్ట్ కార్మికులకు తొమ్మిది నెల లుగా వేతలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు బోయి సత్తిబాబు అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు ఇవ్వాలని కోరుతూ డాక్టర్ బి.ఆర్ . అంబేడ్కర్ స్మృతి వనం వద్ద మూడోరోజు ఆదివారం కార్మికులు ఆందోళన నిర్వహించారు. వీరికి మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న సత్తిబాబు మాట్లాడుతూ కార్మికుల కుటుంబాలు జీతాలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం వారికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం కలక్టర్, మునిసిపల్ కమిషనర్‌కు వారి సమస్యలు తెలుపుతూ వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.



సమావేశంలో కేవీఆర్ఎస్‌పీ రాజు, పెనుగొండ సుబ్బారాయుడు, తదితరులు


ఆర్యవైశ్యుల జీవన విధానం అందరికీ ఆదర్శం

కేవీఆర్ఎస్‌ఏ రాజు


భారతీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో ఆర్యవైశ్యుల జీవన విధానం అందరికీ ఆదర్శమని శ్రీవాసవీ మాట్రిమోనియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కేవీఆర్ఎస్‌ఏ రాజు అన్నారు. గురునానక్ రోడ్డులోని ఒక కళాశాలలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహసభ గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ చార్టెడ్ అకౌంటట్ పెనుగొండ సుబ్బారాయుడు, ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేవీఆర్ఎస్‌ఏ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తమ సంస్థ ఉందన్నారు. పెనుగొండ సుబ్బారాయుడు మాట్లాడుతూ, అర్యవైశ్యులలో ఐక్యత చాటిచెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. తొండెపు హనుమంతరావు, రఘుబాబు, హరినాథ్ తదితరలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు..

గవర్నర్‌పేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం జాతిపిత మహాత్మాగాంధీ గురించి చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 30 మంది విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు గ్రంథాల యాధికారిణి కె. రమాదేవి బహుమతులు అందజేశారు.







విజయవాడ : శైలజ	మచిలీపట్నం : సిరికాంప్లెక్స్
విజయవాడ : స్వర్ణమల్టీప్లెక్స్	మచిలీపట్నం : వరం PVR INOX
విజయవాడ : జి3 రాజ్ యువరాజ్	గుడివాడ : ABR సినిమాస్
విజయవాడ : జయరామ్	గుడివాడ : జి3 సింధూర
విజయవాడ : ఊర్వశి INOX	చల్లపల్లి : కోమల
ఎంజిరోడ్ : లైలా INOX	కైకలూరు : శ్రీవెంకటరమణ
లబ్బీపేట : పీవీపి సినీపోలీస్	లక్ష్మీపురం : అంజనాసినీమ్యాక్స్
లబ్బీపేట : పీవిఆర్‌సినిమాస్	హనుమాన్‌జంక్షన్ : కె.ఎస్.టాకీస్
బెంజిసర్కిల్ : క్యాపిటల్ సినిమాస్	నూజివీడు : ద్వారకకాంప్లెక్స్
పటమట : LEPL INOX	ఆగిరిపల్లి : అనుడీలక్స్
అశోక్‌నగర్ : పవర్‌సినీపోలీస్	ఇబ్రహీంపట్నం : స్వర్ణసినిమ్యాక్స్
వన్‌టౌన్ : సౌమ్య	కొండపల్లి : శివకృష్ణ
భవానీపురం : స్వాతి	కంచికచర్ల : పివిఆర్‌సినీప్లెక్స్
పాయకాపురం : రవీంద్రసినిమాస్	నందిగామ : విజయ
గుణదల : రామ్ సినిమాస్	జగ్గయ్యపేట : జి3 కమల
కానూరు : శ్రీవిజయలక్ష్మి	మైలవరం : సంఘమిత్ర
పోరంకి : వెంకటకృష్ణ	తిరువూరు : శ్రీకృష్ణాటాకీస్
కంకిపాడు : శ్రీరామచంద్ర	విస్సన్నపేట : వెంకటేశ్వర
ఉయ్యూరు : శాంతి	
పామర్రు : శివరామ్	

ANNAPURNA STUDIOS (P) LTD release

పోరుబాటను విజయవంతం చేయాలి

ఫ్యాప్టో చైర్మన్ సాయి శ్రీనివాస్

గాంధీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ విమర్శించారు. ఈ నెల 7న ధర్నాచౌక్‌లో నిర్వహించనున్న 'పోరుబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. హనుమాన్‌పేటలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే బోధనేతర విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా నేటికి ఉపాధ్యాయుల ఆర్థికపరమైన డిమాండ్లను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం అధికమవుతుందన్నారు. సెక్రటరీ జనరల్ చిరంజీవి మాట్లాడుతూ ఇప్పటి వరకు 12వ పీఆర్సీ కమిషన్ నియమించకపోవడం దారుణమన్నారు. కనీసం ఒక్క డీఏ అయినా విడుదల చేయాలన్నారు. డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అమృత మంజరి అంకురం 2 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేదాంతం రాజగోపాల చక్రవర్తి

అమృత మంజరి అంకురం 2 పుస్తకావిష్కరణ

విద్యాధరపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతి, మత, వర్ణ, వర్గ, ప్రాంతీయత అనే భావం లేకుండా అందరూ సమానమేనని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేదాంతం రాజగోపాల చక్రవర్తి అన్నారు. భవానీపురంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం మనుజ్యోతి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత దేవాశీర్ ఇలారీ రచించిన అమృత మంజరి అంకురం-2 పుస్తక ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అనంతరం వేదాంతం రాజగోపాల చక్రవర్తి మాట్లాడుతూ ఒకే దేవుడు, ఒకే దేశం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మాజీ అధ్యక్షుడు చుండూరి సీతారా మాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో విద్యావేత్త నిడుమోలు రమా సత్యనారాయణ, పి.పి.రామన్, పి.రాజేష్, సాంబశివరావు, జయప్రకాష్, ఎస్.ఎస్.ప్రసాద్, నరేంద్ర, నానాజీ, శ్రీను, కిషోర్ పాల్గొన్నారు.



చిత్ర పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ప్రకృతిని చిత్రాలలో ఆవిష్కరించిన చిన్నారులు

విజయవాడ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) :చిన్నారుల్లో దాగి వున్న సృజనాత్మకతను వెలికి తీసి వారికి ప్రకృతి పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంలో 'స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రకృతిలో నేను (ఐ ఎట్ ది రేట్ ఆఫ్ నేచర్) అనే అంశంపై ఆర్ట్ కాంటెస్టు ఆదివారం నిర్వహించారు. ప్రజాశక్తి నగర్‌లోని ఒక ప్రైవేటు స్కూల్‌లో 3 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రకృతి పట్ల తమకు ఉన్న ప్రేమని చిత్రాల ద్వారా చాటారు. సీనియర్ ఆర్టిస్ట్ పావులూరి చిదంబరేశ్వరరావు, ఆస్ట్రాజన్ మల్టీమీడియా పబ్లికేషన్స్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఇన్‌చార్జి మేడా రజిని న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. బహుమతిప్రదానోత్సవం బండ్ల మాధవరావు, కళాసాగర్, పసుమర్తి అమర దీప్తి, రేష్మా సోమూరి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, పతకాలు అందజేశారు. యువ చిత్రకారులు గోపి మనోజ్, హేమంత్ కుమార్, శ్రీ శివ లాస్య, పద్మజ, సింధూశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

పెనమలూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నుంచి బీజేపీలోకి వివిధ పార్టీల నాయకుల చేరారు. బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్చార్జి, సీనియర్ నాయకులు కిలారు దిలీప్ స్వగృహంలో ఆదివారం నియోజకవర్గానికి చెందిన తాళ్ల నరేంద్ర, షేక్ చిన్నాల ఆధ్వర్యంలో వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ కృష్ణాజిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరాం మాట్లాడుతూ, బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులయిన పలువురు నేతలు పార్టీలో చేరుతున్నారని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ బాషా, సీనియర్ నాయకులు వల్లూరి శ్రీమన్నారాయణ, దుర్గాప్రసాద్, మోర్ల మహీధర్, మరీదు రమేష్ పాల్గొన్నారు.



రాష్ట్ర టీఎన్టీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలుగునాడు వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలి

తెలుగునాడు వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులు

భారతీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ టీఎన్‌టీయూసీ కార్యాలయంలో తెలుగు నాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం సమావేశం అదివారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు తమ సంఘం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. శ్రీనివాసచార్యులు, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ఎం భానుమూర్తి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎం. వెంకటలక్ష్మి సభ్యులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావును సత్కరిస్తున్న అగ్నికుల క్షత్రియుల సంఘం నేతలు

అగ్నికుల క్షత్రియుల్లో చైతన్యం రావాలి

కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు

భారతీనగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడిన అగ్నికులక్షత్రియుల సర్వతోముఖాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని అగ్నికులక్షత్రియుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్రిప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం అయ్యప్పనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో నివాసం ఉంటున్న వారికి విద్య, వైద్యం సరిగా అందడంలేదని, చాలా గ్రామాల్లో నేటికి తాగునీరు, రోడ్లు సౌకర్యాలు లేవన్నారు. చైర్మన్ పాపారావు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో అవనిగడ్డ నాగయ్య, మునిస్వామి కృష్ణ, నడకుదిటి నారాయణమూర్తి, జుట్టు నీలకంఠం, బొమ్మిడి గణేష్, కొల్లాటి బాబురావు, అంకాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ ఆఫ్ కైకలూరు సభ్యులు

సమాజాన్ని చైతన్య పరచాలి

భారతీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): యువత మానసిక ఆరోగం, శ్రేయస్సుకు లయన్స్ క్లబ్ ఆఫ్ కైకలూరు మగువ కృషి చేస్తుందని పూర్వ జిల్లా గవర్నర్ లయన్ అన్నపరెడ్డి కోటిరెడ్డి, అన్నారు. పటమటలోని రూట్స్ అండ్ వింగ్ ఐబిటీ అండ్ మెడికల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం అదివారం జరిగింది. కోటిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు, ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు మరిన్ని చేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు జి.ఎస్.వి.రమేష్, లయన్స్ క్లబ్ ఆఫ్ కైకలూరు మగువ అధ్యక్షురాలుగుర్రం లక్ష్మి మానస, కేఎల్‌యూ సైకాలజిస్టులు బి. కిషోర్, జి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

కాల్వలో పడి యువకుడి గల్లంతు

పెనమలూరు, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి):యనమలకుదురు కాల్వలో ప్రమాదవశాత్తూ జారి పడి వ్యక్తి గల్లంతయిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యనమలకుదురుకు చెందిన ఉద్దగిరి వెంకటేశ్వరరావు (20) శనివారం పని నుంచి తిరిగి వచ్చి గ్రామ పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని వంతెనపై కూర్చొని ఉండగా చేయి జారి ప్రమాదవశాత్తూ కాల్వలో పడిపోయాడు. ఇది తెలుసుకొన్న అతడి బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని వెతికారు. ఎలాంటి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వాకర్లకు క్లాత్‌బ్యాగ్‌లను అందజేస్తున్న టీడీపీ యువనేత గద్దె క్రాంతికుమార్

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజా సహకారం అవసరం: గద్దె క్రాంతి

భారతీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని, దానికి ప్రజలు కూడా సహకరించి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని టీడీపీ నేత గద్దె క్రాంతికుమార్ అన్నారు. పాలిటెక్నిక్ వాకర్స్ (ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్)అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో ఆదివారం జరిగింది. క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరుమనం వాడే పారేసిన ప్లాస్టిక్ పర్యావరణాన్ని మాత్రమే కాకుండ మానవ ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోం దన్నారు. కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా ప్లాస్టిక్ వినియోగమే ప్రధాన కారణంగా వైద్యనిపుణులు చెబుతున్నారన్నారు. భవిష్యత్ తరాల భద్రత కోసం ఇప్పటి నుంచే ప్లాస్టిక్ రహిత ఉద్యమం జరగాలని అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా అదనపు ఎస్పీ వి. వెంకటేశ్వరనాయుడు, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ చూపిన యువకులకు బెల్టుల ప్రదానం

విజయవాడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : కరాటేలో ప్రతిభ చూపించిన యువకులకు బెల్టులను ఆదివారం ప్రదానం చేశారు. సీతారామపురంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ వాడో -ఆర్‌వైయూ చీఫ్ ఇన్‌స్పెక్టర్ దాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 22 మంది ఎల్లో, 10 మందికి ఆరెంజ్, పది మందికి పర్పుల్ బెల్టులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్థసారథి, కోచ్‌లు ఆరిఫ్ పాషా, సతీష్ హర్షిత తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999 AJB-235820

PLOTS FOR SALE

» విజయవాడ, కంచికచర్ల, ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో AP CRDA, DTCP ప్లాట్స్, చ.గ. 3,900/- నుండి 7,800/- ఇళ్ళ మధ్యలో ప్లాట్స్, ఫామ్ హౌస్ ప్లాట్ 1 సెంటు 1,45,000/- సెల్ : 63012 98734 AJB-107

» అమరావతి-కాజా-గ్రేటర్ విజయవాడలో ORR దగ్గరలో CRDA అప్రూవ్డ్ గల 133 గజాలు పైన గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు, క్లబ్ హౌస్ ఎమినిటీస్‌తో అమ్మకానికి కలవు. ✆ 95028 22335 AJB-235823

» వాముకుంట గ్రామం, తిరువూరు మండలం, ఖమ్మం దగ్గర, విజయవాడకు అతి చేరువలో DTCP అప్రూవ్డ్ ప్లాట్స్ అమ్మకం. లాంచింగ్ ఆఫర్ 10 గ్రాముల గోల్డ్. ✆ 9642223242 AJB-1314

» విజయవాడ పాత బస్టాండు ఎదురుగా బందరు రోడ్డుకు 50 మీ. దూరంలో మనోరమ హోటల్ దగ్గర 300 చ.గ. ప్లాటు (45 x 58) అమ్మకమునకు కలదు. సంప్ర. సెల్ : 94403 31155 AJB-235642

FOR SALE

» రెస్టారెంట్ అమ్మకం, విజయవాడ, భవానీపురం, స్వాతి రోడ్డు, రన్నింగ్ కండిషన్లో గ్రౌండ్ వెజ్, 1st నాన్ వెజ్, & 2nd & 3rd ఫ్లోర్‌లో బ్యాంకెట్ హాల్స్‌తో. సెల్ : 98484 46926 AJB - 235644

WANTED

» ప్రముఖ ఆటోఫైనాన్స్ నందు అనుభవం కలిగిన లేడి కంప్యూటర్ ఆపరేటర్, టెలీకాలర్ కావలెను & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ సొంత బైకు ఉండాలి. Qul: డిగ్రీ. సెల్ : 9949558181 AJB - 235822

» కేసరపల్లి, బందరురోడ్డు & సిటీలోని అన్ని చోట్ల సెII గార్డ్స్ కావలెను. వయస్సు, చదువుతో పనిలేదు. అనుభవం బట్టి జీతం. ఒంటరి వారికి వసతి సంప్ర. 96423 13999, 92472 71222 AJB - 418

DISTANCE EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA. ✆ 99493 08940 AJB-235758

WANTED PLOTS

★ హైదరాబాద్ పటాన్‌చెరు పెద్ద కంజర్ల గ్రామములో Sy.No.120, 121 & 125 లో ప్లాట్లు అమ్మాలని ఉన్నవారు సంప్రదించాల్సిన Cell. No 9951005666. చంద్రశేఖర్ Hyderabad. AJH-003433

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ॥ 290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777 మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

దిక్సూచి

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ డిసెంబర్ - 2025

సైన్స్ విభాగాల్లో పరిశోధన, బోధనకు అవకాశం కల్పించే సీఎస్ఐఆర్ యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) డిసెంబర్ 2025 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. సైన్స్ సబ్జెక్టుల్లో పరిశోధనలకు అవకాశం కల్పించే జేఆర్ఎఫ్‌తోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం 'సీఎస్ఐఆర్ యూజీసీ నెట్' నిర్వహిస్తారు. దీనితోపాటు జేఆర్ఎఫ్‌కు అర్హత పొందితే సీఎస్ఐఆర్ పరిధిలోని రిసెర్చ్ సెంటర్లలో, వివిధ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వివిధ యూనివర్సిటీల్లో లేదా డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానూ ఎంపిక కావచ్చు.



పరీక్ష: జాయింట్ సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ ఎగ్జామినేషన్ డిసెంబర్ 2025

మొత్తం పరీక్ష పేపర్లు

- కెమికల్ సైన్సెస్
- ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్
- లైఫ్ సైన్సెస్
- మేథమెటికల్ సైన్సెస్
- ఫిజికల్ సైన్సెస్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, థర్డ్ జండర్, దివ్యాంగ, ఓబీసీ అభ్యర్థులకు 50 శాతం చాలు.

వయస్సు: జేఆర్ఎఫ్‌కు సంబంధించి జనరల్ కేటగిరీ అభ్యర్థులు 2025 డిసెంబర్ నాటికి 30 సంవత్సరాలు మించి ఉండరాదు. ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళా అభ్యర్థులకు ఐదేళ్లు, నాన్ క్రిమిలేయర్ ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు వయో పరిమితిలో సడలింపు ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం: పరీక్ష వ్యవధి మూడు గంటలు. మొత్తం 200 మార్కులకు పరీక్ష సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో జరుగుతుంది. మల్టిపుల్ చాయిస్ తరహాలో ప్రశ్నలు ఉంటాయి.

ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1150/-, ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ అభ్యర్థులకు రూ.600/-, ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులు/ థర్డ్ జండర్ అభ్యర్థులకు రూ. 325/-

పరీక్ష తేదీ: 2025 డిసెంబర్ 18 **చివరి తేదీ:** 2025 అక్టోబర్ 10

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in/

జేఈఈ (మెయిన్)-2026

ఈ డాక్యుమెంట్లు సిద్ధమేనా

జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన కళాశాలల్లో ఇంజనీరింగ్ అడ్మిషన్స్‌కు ఉద్దేశించిన జేఈఈ మెయిన్ 2026 పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కొన్ని కీలక సూచనలు చేసింది. 2026 జనవరిలో సెషన్-1, ఏప్రిల్‌లో సెషన్-2 ఎంట్రెన్స్ జరపనున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. సెషన్-1 ఎంట్రెన్స్ పరీక్ష దరఖాస్తులు 2025 అక్టోబర్ నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. దీనికి దరఖాస్తు చేసే విద్యార్థులు అవసరమైన డాక్యుమెంట్లను అప్పటిలోగా అప్‌డేట్ చేసి పెట్టుకోవాలని సూచించింది. లేకుంటే దరఖాస్తు సమయంలో ఇబ్బందులు పడడమో, సరైన సమయంలో అప్‌డేట్ చేసుకోలేకపోతే తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. జాతీయ స్థాయిలో జేఈఈ మెయిన్‌కి దాదాపు పద్నాలుగు లక్షల మంది దరఖాస్తు చేసుకుంటారు. ఇందులో రెండున్నర లక్షల మంది తెలుగు విద్యార్థులే ఉంటారు.

అవసరమైన దరఖాస్తులు

ఆధార్: ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ(పదో తరగతి సర్టిఫికెట్ ప్రకారం) సరిగ్గా ఉండేలా చూసుకోండి. అలాగే తాజా ఫోటో గ్రాఫ్, తండ్రి పేరు, ఇంటి అడ్రస్ అప్‌డేట్ అయి ఉండాలి. వేలి ముద్రలు కూడా అప్‌డేట్ చేయించుకుంటే బెటర్.

దివ్యాంగ అభ్యర్థులైతే: యూడీఐడీ కార్డు చెల్లుబాటు అవుతుంది. అయితే రెన్యూవల్ చేయించుకుని ఉండడం మంచిది.

కేటగిరీ సర్టిఫికెట్: ఈడబ్ల్యూఎస్/ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ-ఎన్‌సీఎల్ సర్టిఫికెట్‌ను చెల్లుబాటు అయ్యేలా అప్‌డేట్ చేసి పెట్టుకోవాలి.

తాజా సూచనలు ఏమైనా ఉన్నాయేమో అని ఎప్పటికప్పుడు https://jeemain.nta.nic.in వెబ్‌సైట్‌ను చెక్ చేసుకుంటూ ఉండాలి.

ఇంటర్‌తో సాఫ్ట్‌వేర్ జాబ్స్

సాధారణంగా సాఫ్ట్‌వేర్ జాబ్ చేయాలంటే ఇంజనీరింగ్, ఎంసీఏ లేదా కనీసం బీఎస్సీ అయినా ఉండాలి. అయితే సంప్రదాయానికి బ్రేక్ చెపుతోంది హెచ్‌సీఎల్ టెక్నాలజీస్. ఇంటర్ పాసైన వారికి సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు కల్పించడం కోసం 'టెక్-బీ' పేరిట కొత్త ప్రోగ్రామ్‌ను రూపొందించింది. దీని ద్వారా ఐటీలో ఎంట్రీ లెవల్ ఉద్యోగానికి అవసరం అయిన శిక్షణను అందిస్తుంది. ఈ ట్రైనింగ్ పూర్తయిన తర్వాత హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో ఉద్యోగం ఇస్తారు.

'టెక్ బీ' ప్రోగ్రామ్ అర్హతలు

- అభ్యర్థులు దరఖాస్తు చేసే సంవత్సరం లేదా అంతకు ముందు సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. అంటే 2024 లేదా 2025లో ఇంటర్ పూర్తి చేసినవారు దరఖాస్తుకు అర్హులు.
- ఇంటర్‌లో మేథ్స్ లేదా బిజినెస్ మేథ్స్ ఒక సబ్జెక్టుగా చదవడంతోపాటు, అందులో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- ఇంటర్‌లో నిర్ణీత పర్సెంట్ సాధించిన విద్యార్థులు మాత్రమే ఈ పరీక్ష రాయడానికి అర్హులు. అయితే ఇంటర్ పర్సెంటేజీ విషయంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో పర్సెంటేజీని నిర్ణయించారు. స్టేట్ సిలబస్‌తో పరీక్ష రాసిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు అయితే 75 శాతం మార్కులు సాధించాలి. అదే సీబీఎస్సీ/ఐసీఎస్‌సీ విద్యార్థులు అయితే 70 శాతం మార్కులు వచ్చి ఉండాలి.

ఉన్నత చదువులు

హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం చేస్తూనే ఐఐటీ గౌహతి, ఐఐఐటి కొట్టాయం, బిట్స్ పిలానీ, శాస్త్ర, ఐఐఎమ్ సిర్మౌర్, అమిటి తదితర యూనివర్సిటీల్లో దూరవిద్య లేదా ఆన్‌లైన్ మోడ్ ద్వారా ఉన్నత విద్య కోసం నమోదు చేసుకోవచ్చు. ఈ మేరకు ఆయా సంస్థలతో హెచ్‌సీఎల్ ఎంఓయూ కూడా చేసుకుంది.



ఎంపిక విధానం: దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు హెచ్‌సీఎల్ కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. దీనిలో ప్రతిభ చూపించిన విద్యార్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.

ఎంపిక తర్వాత శిక్షణ

- హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రామ్‌కి ఎంపికైన విద్యార్థులకు 12 నెలలు శిక్షణ ఇస్తారు. లక్నో, నోయిడా, మధురై, చెన్నై, విజయవాడ, హైద్రాబాద్, నాగపూర్‌లో శిక్షణ కేంద్రాలు ఉన్నాయి.
- ట్రైనింగ్, ఫౌండేషన్, టెక్నాలజీ/ డొమైన్ ట్రైనింగ్, ప్రొఫెషనల్ ప్రాక్టీస్ ట్రైనింగ్ అని మూడు దశల్లో ఉంటుంది.
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అసెస్‌మెంట్లు, చర్చలు, కేస్‌బేస్డ్ సబ్మిషన్లు అన్నీ ఉంటాయి.

ఫీజు : 'టెక్ బీ'లో 'ఐటీ సర్వీసెస్', 'అసోసియేట్' అని రెండు ప్రోగ్రామ్‌లు ఉంటాయి. ఒక్కో కోర్సును బట్టి ఐటీ రోల్‌లో అయితే లక్షన్నర, అసోసియేట్ రోల్‌లో అయితే దాదాపు యాభై ఒక్కవేల వరకు ఫీజు ఉంటుంది. వార్షిక ఆదాయం తక్కువ ఉన్నవారు బ్యాంక్ నుంచి రుణం కూడా పొందవచ్చు.

- శిక్షణలో 90 శాతంపైగా వచ్చిన విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది. 85పైగా వచ్చిన వారికి 50 శాతం మినహాయింపు ఉంటుంది. కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ చేసే సమయంలో కొంత స్టయిఫండ్ ఇస్తారు. కోర్సు తర్వాత హెచ్‌సీఎల్‌లో 1.96 లక్షల నుంచి 2.2 లక్షల వేతనంతో పూర్తిస్థాయి ఉద్యోగిగా చేరవచ్చు.

పూర్తి వివరాల కోసం www.hcltech.com చూడవచ్చు. లేదా support-techbee@hcltech.com ఈ మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.

రిమైండర్స్

ఎంట్రెన్స్ 2026

గేట్

దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'గేట్-2026' షెడ్యూల్ వెలువడింది. మొత్తం 30 సబ్జెక్టు పేపర్లకు ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ ఎంట్రెన్స్‌ను గౌహతి ఐఐటీ నిర్వహిస్తోంది. 'గేట్' ఫలితాలు వెలువడిన నాటి నుంచి మూడు సంవత్సరాలపాటు ఎంట్రెన్స్ స్కోరు వాలీడ్‌గా ఉంటుంది. ఆ స్కోరుతో మూడేళ్లలో ఎంటెక్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ తీసుకోవచ్చు.

- **చివరి తేదీ:** 2025 అక్టోబర్ 6
- **ఆలస్య రుసుముతో:** 2025 అక్టోబర్ 9
- **ఎంట్రెన్స్ తేదీలు:** 2026 ఫిబ్రవరి 7, 8, 14, 15
- **ఫలితాలు:** 2026 మార్చి 19
- **వెబ్‌సైట్:** http://gate2026.iitg.ac.in/

కామన్ లా అడ్మిషన్ టెస్ట్

దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠాత్మక న్యాయ విశ్వ విద్యాలయాల్లో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్'(క్లాట్)-2026 నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్(యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) లా ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. క్లాట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎమ్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ లభిస్తుంది.

కోర్సులు:

- అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ)
- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఏడాది ఎల్ఎల్ఎం డిగ్రీ)



అర్హతలు : అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చేయాలనుకునే విద్యార్థులు కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ పాసై ఉండాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 31

ఎంట్రెన్స్ తేదీ: 2025 డిసెంబర్ 7

వెబ్‌సైట్: consortiumofnlus.ac.in/

సీడాక్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీడాక్)లో ఒప్పంద ప్రాతిపదికన 646 ప్రాజెక్ట్ ఇంజనీర్, ప్రాజెక్ట్ అసోసియేట్, సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్ తదితర పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నారు.

సెంటర్ల వారీగా ఖాళీలు

బెంగళూరు 110, చెన్నై 105, హైదరాబాద్ 65, కోల్‌కతా 06, ముంబాయి 12, నోయిడా 173, పుణె 99, తిరువనంతపురం 54, గువహటి 22

సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, ఎంఫిల్/పీహెచ్‌డీ పాసై ఉండాలి.

దరఖస్తుకు చివరి తేదీ: 2025 అక్టోబర్ 10

వెబ్‌సైట్: https://cdac.in/

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★



హిమాలయాల్లో రజనీకాంత్

● **రోడ్డుపైనే టిఫిన్ చేసిన తలైవర్**

సూపర్‌స్టార్ రజనీకాంత్ హిమాలయాల పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డుపైనే టిఫిన్ చేస్తూ కనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలు ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రజనీకాంత్ నటించిన 'కూలీ' సినిమా ఇటీవల విడుదలైన విషయం తెల్సిందే. తన సినిమా విడుదలైన ప్రతిసారీ హిమాలయాలకు రజనీకాంత్ వెళ్తుంటారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



అందమైన జ్ఞాపకాలు

చిరంజీవి

తెలుగు, తమిళ్, మలయాళ, కన్నడ, హిందీ చిత్రపరిశ్రమల్లోని అలనాటి తారలు చెన్నైలో తళుక్కుమన్నారు. '80స్ స్టార్స్ రీ యూనియన్' పేరుతో 1980కి చెందిన నటీనటులు ఇటీవలె కలుసుకున్నారు. ఈ ఫొటోలను మెగాస్టార్ చిరంజీవి తన ఎక్స్ ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. '1980ల నాటి నా ప్రియమైన స్నేహితులతో జరిగే ప్రతీ రీ యూనియన్‌ను ఎప్పటికీ మర్చిపోలేను. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ బంధం విడదీయరానిది. ఎన్నో అందమైన జ్ఞాపకాలు, మరెన్నో నవ్వులతో ఈ వేడుక ఆనందంగా సాగింది' అని పేర్కొన్నారు. కాగా, ఈ వేడుకల్లో మెగాస్టార్ చిరంజీవి, వెంకటేష్, నరేశ్, శరత్ కుమార్, సురేశ్, జయరామ్, ప్రభు, భానుచందర్, భాగ్యరాజ్, రెహ్మాన్, జాకీ ష్రాఫ్, రాధ, సుహాసిని, రమ్యకృష్ణ, జయసుధ, మీనా, ఖుష్బూ, రేవతి, సుమలత, సరిత, పూర్ణిమ భాగ్యరాజ్, లిస్సీ, శోభన, మేనక, అశ్వతి జయరాం, స్వప్న, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



కొనబోతే కొరివి



(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తోంది. తాను తయారు చేసే జే-35లను 2030 నాటికి పాకిస్థాన్‌కు కూడా సరఫరా చేసేందుకు చైనా సిద్ధమైంది. అంటే.. మన దాయాదికి కూడా మరో ఐదేళ్లలో ఐదో తరం యుద్ధ విమానాలు అందుబాటులోకి వస్తాయన్నమాట. మరి ఈ రేసులో భారత్ ఎక్కడుంది? అంటే.. దశాబ్ద కాలం వెనకబడి ఉంది. మన వద్ద ప్రస్తుతం ఉన్నవి నాలుగో తరం యుద్ధవిమానాలే. రాఫెల్ యుద్ధవిమానాలు ఈ కోవలోకే వస్తాయి. ఐదోతరం ఫైటర్ జెట్ మనవద్ద ఒక్కటి కూడా లేదు సరికదా.. వాటిని సమకూర్చుకోవడానికి ఇంకా పదేళ్లు పడుతుందని రక్షణ రంగ నిపుణుల అంచనా! ఒకవైపు చైనా, మరోవైపు పాకిస్థాన్‌ల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఐదో తరం యుద్ధ విమానాల విషయంలో భారత్ ముందున్న ప్రత్యామ్నాయాలు మూడు. వాటిలో మొదటిది.. రూ.15 వేల కోట్లతో చేపట్టిన 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ-అమ్కా)'. ఇవి 2035 నాటికి వాయుసేనకు అందుబాటులోకి వస్తాయని చెబుతున్నారు. కానీ.. దానిపైనా పలు సందేహాలున్నాయి. ఎందుకంటే.. అసలు ఈ విమానాల తయారీకి ఏ ఇంజన్ వాడాలన్నదే ఇంకా తేలలేదు. ఫ్రెంచ్ కంపెనీ శాఫ్రాన్‌తో ఒప్పందానికి చర్చలు జరుగుతున్నాయి. అవి ఫలించి ఇంజన్ తయారీ మొదలుపెట్టినా, అవి అందుబాటులోకి వచ్చేసరికి 2033-2034 అవుతుంది. మరి అప్పటిదాకా చైనా, పాక్ ముప్పును ఎలా ఎదుర్కోవాలి? అనే ప్రశ్నకు సమాధానంగా మిగతా రెండు ప్రత్యామ్నాయాలూ తెరపైకి వస్తున్నాయి. అవి.. అమెరికన్ ఎఫ్-35లు, రష్యన్ సుఖోయ్-57లు.

రెండింటితో కొన్ని సమస్యలు

ఐదో తరం యుద్ధవిమానాలైన ఎఫ్-35లను భారత్‌కు విక్రయించడానికి ట్రంప్ సంసిద్ధత వ్యక్తం చేశారు. కానీ.. దాంతో చాలా సమస్యలు ఉంటాయి. ఎఫ్-35ల స్టెల్త్ సామర్థ్యం అద్భుతం. అయితే, వాటిని కొనాలంటే అమెరికా పలు షరతులు విధిస్తుంది. రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థకు దూరంగా ఈ విమానాలను ఉంచాలని పట్టుపడుతుంది. ఎఫ్-35లను డిటెక్ట్ చేసేవిధంగా ఎస్400ను ట్యూన్ చేసుకుంటామన్న భయమే ఇందుకు కారణం. రెండో సమస్య.. అమెరికా మనకు ఈ విమానాలను విక్రయించినప్పటికీ, సోర్స్ కోడ్ ఇవ్వదు. అలా ఇవ్వకపోతే మన బ్రహ్మోస్, అస్త్ర, రుద్రం వంటి క్షిపణులను ఆ యుద్ధవిమానాలతో ఇంటిగ్రేట్ చేయలేం. ఇదో పెద్ద సమస్య. అన్నిటికన్నా అతిపెద్ద సమస్య.. ఎఫ్-35 యుద్ధవిమానాల్లో కిల్ స్విచ్ ఉంటుంది. అంటే.. మనం చేసే యుద్ధం ఏదైనా అమెరికాకు నచ్చకపోతే.. మన దగ్గర ఉన్న ఎఫ్-35లేవీ పనిచేయకుండా అమెరికా రిమోట్‌గా ఆపేయగలదు. అందుకే.. భారత్ ఆ విమానాల కొనుగోలుకు మొగ్గు చూపట్లేదు. ఇక మిగిలిన ప్రత్యామ్నాయం.. రష్యా వద్ద ఉన్న ఎస్‌యు-57ల కొనుగోలు. కానీ, వీటికి చాలా సమస్యలున్నాయి. నిజానికి ఈ విమానాల తయారీలో తొలుత రష్యాతో భారత్ కూడా పాలుపంచుకుంది. కానీ.. రష్యన్లు ఈ విమానం తయారీలో అనుసరిస్తున్న విధానాలు మనకు నచ్చలేదు. విమానం మొత్తానికీ స్టెల్త్ సామర్థ్యం (ఏ వైపు నుంచీ కూడా శత్రు రేడార్లకు చిక్కకుండా ఉండే సామర్థ్యం) ఉండాలని భారత్ భావిస్తే.. ముందు భాగంలో మాత్రమే ఆ సామర్థ్యం ఉంటే సరిపోతుందని రష్యా భావించింది. దీనికితోడు.. ఎస్‌యు-57 సోర్స్ కోడ్ ఇవ్వడానికి కూడా రష్యా అప్పట్లో అంగీకరించలేదు. దీంతో ఆ ప్రాజెక్టు నుంచి భారత్ బయటకు వచ్చేసింది. దరిమిలా రష్యా ఎస్‌యు-57ల స్టెల్త్ సామర్థ్యం.. ఎఫ్-35, ఎఫ్-22, జె-20, జె-35లతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. ఎస్‌యు-57 రేడార్ క్రాస్ సెక్షన్ (ఆర్‌సీఎస్) వాటితో పోలిస్తే చాలా ఎక్కువ. ఒక యుద్ధ విమానం ఆర్‌సీఎస్ ఎంత తక్కువగా ఉంటే దానికి అంత ఎక్కువ స్టెల్త్ సామర్థ్యం ఉన్నట్టు. ఎఫ్-35ల ఆర్‌సీఎస్ 0.001 నుంచి 0.005 చదరపు మీటర్లు. అంటే.. శత్రు రేడార్లకు ఆ విమానం అంత చిన్నగా.. ఒక పురుగులాగా కనపడుతుందన్నమాట. జే-20ల ఆర్‌సీఎస్ 0.02 నుంచి 0.1 చదరపు మీటర్లు అని అంచనా. అదే ఎస్‌యు-57 ఆర్‌సీఎస్.. 0.1 నుంచి 0.5 చదరపు మీటర్లు. ఎఫ్-35, జే20, జే35.. దేంతో పోల్చినా రేడార్ స్క్రీన్ మీద ఇది చాలా పెద్దగా కనపడుతుంది. అంతేకాదు.. ప్రస్తుతం రష్యా తయారుచేస్తున్న ఎస్‌యు57 విమానాలకు సూపర్ క్రూయిజ్ (ఆఫ్టర్ బర్నర్లు లేకుండా సూపర్ సానిక్ వేగంతో ఎక్కువసేపు ప్రయాణించే) సామర్థ్యం లేదు. సూపర్ క్రూయిజ్ సామర్థ్యం ఉండే కొత్త ఇంజన్ అభివృద్ధికి రష్యా శ్రమిస్తోంది. ఇన్ని సమస్యలున్నప్పటికీ.. భారత్‌కు వీటిని కొనుగోలు చేయడం తప్ప ప్రస్తుతం వేరే గతి లేని పరిస్థితి. ఈ సంగతి తెలుసు కాబట్టే రష్యా మనతో వీటిని కొనిపించేందుకు ప్రయత్నిస్తోంది. 114 రఫెల్ యుద్ధవిమానాలు.. 60 ఎస్‌యు-57లు కొనుగోలు చేయాలన్న భారత్ ఆలోచనలకు భిన్నంగా.. మొత్తం 200 ఎస్‌యు-57 విమానాలను కొనుగోలు చేయాలని సూచిస్తోంది. అలా కొంటే.. ఈ విమానాల సోర్స్ కోడ్ ఇస్తామని.. వాటితో మన క్షిపణులను ఇంటిగ్రేట్ చేసుకోవచ్చని.. భారత్‌లోనే వాటిని తయారు చేసుకోవచ్చని.. కావాలంటే ఇతర దేశాలకు ఎగుమతి కూడా చేసుకోవచ్చని అంటోంది. ఈ ఏడాది డిసెంబరులో రష్యా అధ్యక్షుడు పుతిన్ వచ్చినప్పుడు వీటి కొనుగోలుకు సంబంధించి ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఒకవేళ ఒప్పందం కుదిరినా అవి మనకు అందుబాటులోకి రావడానికి పదేళ్లు పడుతుందని అంచనా! అయినా గత్యంతరం లేని పరిస్థితి. ఎఫ్-35లు, జే-20, జే-35లంత సమర్థమైనవి కాకపోయినా.. తప్పక వీటిని కొనాల్సిన పరిస్థితిలో భారత్ ఉందని చెప్పొచ్చు!!

చివరాఖరు: ఒకవేళ పుతిన్ మనదేశానికి వచ్చినప్పుడు వీటి కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంటే ట్రంప్ ప్రతిస్పందన ఎలా ఉంటుందో చూడాలి! - సెంట్రల్ డెస్క్

అప్పటిలోగా ఏంచేయాలి?

ఇప్పటికే చైనా వద్ద 300కు పైగా జే-20లు ఉన్నాయి. 2035 నాటికి 1500 జే-20ల తయారీని ఆ దేశం లక్ష్యంగా పెట్టుకుంది. వాటిలో కొన్నింటిని పాకిస్థాన్‌కి ఇస్తే.. రెండు దేశాలూ భారత్‌కు పక్కలో బల్లేల్లాగా మారుతాయి. మనకు ఐదో తరం యుద్ధవిమానాలు అందుబాటులోకి రావడానికి పదేళ్లు పడుతుంది కాబట్టి.. అప్పటిదాకా ఆ లోటును పూడ్చుకోవడం కత్తిమీద సాములా ఉంటుంది. మనవద్ద ఉన్న, కొత్తగా కొనబోతున్న రఫెల్ యుద్ధవిమానాలకు ఫ్రంటల్ స్టెల్త్ ఉంటుంది కాబట్టి వాటిని సమర్థంగా వాడుకోవాలి. అలాగే.. మన మీదకి దూసుకువచ్చే స్టెల్త్ విమానాలను గుర్తించేలా మన రేడార్ వ్యవస్థలను, గగనతల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలి.

ఐదోతరం యుద్ధ విమానం అంటే?

రిచర్డ్ పి.హాలియన్ అనే ఎయిర్ హిస్టారియన్ 1990లో.. యుద్ధవిమానాలను ఆరు తరాలుగా వర్గీకరించారు. వేగం, టెక్నాలజీ వంటివాటి ఆధారంగా ఆయన ఆ వర్గీకరణ చేశారు. అప్పటికి స్టెల్త్ సామర్థ్యం ఇంకా ఏ దేశానికీ అందుబాటులోకి రాలేదు కాబట్టి ఆయన వర్గీరణలో ఆ అంశం కనిపించదు. 2000 సంవత్సరం తర్వాత అమెరికా వాయుసేన, వైమానిక రంగ నిపుణులు రిచర్డ్ వర్గీకరణను నాలుగు జనరేషన్లకు కుదించి.. స్టెల్త్ సహా ఐదు సామర్థ్యాలు ఉన్న విమానాలను ఐదోతరంగా పేర్కొన్నారు. స్టెల్త్ సామర్థ్యం అంటే శత్రు రేడార్లకు దొరక్కుండా ఉండడం. మిగతా నాలుగూ.. సూపర్ క్రూయిజ్ సామర్థ్యం, అడ్వాన్స్‌డ్ సెన్సర్ ఫ్యూజన్, హైలీ ఇంటిగ్రేటెడ్ ఏవియానిక్స్, నెట్‌వర్క్ సెంట్రిక్ వార్‌ఫేర్ కేపబిలిటీ(ఫైటర్‌జెట్లు, డ్రోన్లు, రేడార్లు, ఉపగ్రహాలు, గ్రౌండ్ స్టేషన్లు ఒక డిజిటల్ నెట్‌వర్క్‌లాగా ఏర్పడతాయి. దీనివల్ల పైలట్‌కు.. తనకు కనిపించని కోణాల్లో ఉన్న శత్రువుల గురించి కూడా సమాచారం వస్తుంది. శత్రు లక్ష్యాలను ఛేదించడం సులువవుతుంది).. ఈ ఐదూ ఉండే వాటిని ఐదో తరం యుద్ధ విమానాలుగా పేర్కొంటారు.

దళితులకు ప్రవేశం లేదంటూ... గుడికి తాళం వేసిన పూజారి

▸ తిరుపతి జిల్లా పాలెంపాడులో ఘటన.. పోలీసుల జోక్యంతో సర్దుబాటు

దొరవారిసత్రం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత గుడిలోకి దళితులకు ప్రవేశం లేదంటూ పూజారి ఆలయానికి తాళం వేశారు. ఈ ఘటన తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం పాలెంపాడులో ఆదివారం చోటుచేసుకొంది. పాలెంపాడులోని గ్రామదేవత కోరిందమ్మ పరమేశ్వరికి పూజలు చేసుకునేందుకు దళితకాలనీకి చెందిన కొన్ని కుటుంబాల వారు వెళ్లారు. గుడి ముందు పొంగళ్లు పెట్టుకున్నారు. ఈసందర్భంలో నైవేద్యాలు సమర్పించేందుకు గుడిలోపలికి రాకూడదని గుడి పూజారి బట్టా రమణయ్య వారికి చెప్పారు. దళితులమని వివక్ష చూపుతారా అంటూ వీరు ఆగ్రహం వ్యక్తంచేయడంతో.. ఆలయానికి తాళం వేసుకుని వెళ్లిపోయారు. దళితులు ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ అజయ్‌కుమార్ గుడి వద్దకు వెళ్లి, పూజారిని పిలిపించి తలుపులు తీయించారు. దళితకాలనీవాసులు గుడిలో పూజలు చేసుకొనేలా అవకాశం కల్పించారు. గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని ఎస్‌ఐ చెప్పారు.


పోలీసుల సమక్షంలో ఆలయంలో పూజలు చేసుకొంటున్న మహిళలు

ఏనుగుల తొక్కిసలాటలో గున్న ఏనుగు మృతి

చెరువులోకి దిగిన సందర్భంలో ఘటన

పార్వతీపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం ఓ గున్న ఏనుగు మృతి చెందింది. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా సంచరిస్తున్న తొమ్మిది గజరాజులు ఆ గ్రామ సమీపంలో ఉన్న ముదర్లై చెరువులో ఒకే సారి దిగాయి. దీంతో వాటి మధ్య జరిగిన తొక్కిసలాటలో ఓ గున్న ఏనుగు మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ట్రాకర్లు వెంటనే అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. రేంజర్ మణికంఠ , ఇతర సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని చనిపోయిన గున్న ఏనుగును బయటకు తీయించారు.

భయాందోళనలో ప్రజలు

గున్న పిల్ల మృతి చెందడంతో మిగిలిన 8 ఏనుగులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఘీంకరించాయి. దీంతో లక్ష్మీనారాయణపురం ప్రజలు బెంబేలెత్తిపోయారు. గజరాజులు ప్రస్తుతం అక్కడే సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వారంతా భయాందోళన చెందుతున్నారు. గ్రామస్థులెవరూ ఒంటరిగా బయట తిరగరాదని అటవీ శాఖాధికారులు హెచ్చరికలు జారీ చేశారు.


మృతి చెందిన గున్న ఏనుగు


విశాఖలో సోమవారం తూర్పు నౌకాదళంలో చేరనున్న ఆండ్రోత్ యుద్ధ నౌక

నేడు 'ఆండ్రోత్' జల ప్రవేశం

▸ నేవీ అమ్ముల పొదిలో మరో నౌక

▸ కోల్‌కతాలో తయారీ.. 80 శాతం పరికరాలు భారత్‌లోనే ఉత్పత్తి

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళం అమ్ముల పొదిలోకి మరో యుద్ధ నౌక చేరనుంది. తీర ప్రాంతంలోని సముద్ర జలాల్లో శత్రు దేశాల జలాంతర్గాముల ఉనికిని పసిగట్టే యుద్ధనౌక ఆండ్రోత్ సోమవారం విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డులో జలప్రవేశం చేయనుంది. యాంటీ సబ్‌మెరైన్ వాటర్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ (ఏఎస్‌డబ్ల్యూ- ఎస్‌డబ్ల్యూసీ)గా వ్యవహరించే ఆండ్రోత్.. ఇండియన్ నేవీకి రెండో ఏఎస్‌డబ్ల్యూ-ఎస్‌డబ్ల్యూసీ నౌక కావడం గమనార్హం. తూర్పు నౌకాదళం వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ సోమవారం ఉదయం ఈ నౌకను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఆండ్రోత్ చేరికతో భారత నౌకాదళం శక్తి సామర్థ్యాలు మరింత పెరగనున్నాయి. ఈ నౌకను కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్ అండ్ ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ) నిర్మించింది. ఈ నౌక తయారీలో వినియోగించిన పరికరాల్లో 80 దేశీయంగా ఉత్పత్తి చేసినవే కావడం విశేషం. వినూత్నమైన సాంకేతిక పరిజ్ఞానం, స్వదేశీ సామర్థ్యాన్ని పెంపొందించేలా ఈ నౌక నిర్మాణం జరిగింది. ఆండ్రోత్ సబ్‌మెరైన్ల ఉనికిని పసిగట్టడంలో కీలకంగా పని చేయనుంది. అత్యాధునిక తేలికపాటి టార్పెడోలు, సబ్‌మెరైన్ల విధ్వంసక రాకెట్లను కలిగి ఉంటుంది. దేశ సముద్ర భద్రతలో ఈ నౌక కీలకంగా నిలుస్తుందని నేవీ అధికారులు పేర్కొన్నారు.

పోలవరం పూర్తికి ఇవే లక్ష్యాలు!

నేడు జలశక్తి మంత్రికి నివేదించనున్న జలవనరుల శాఖ

▸ ఈ డిసెంబరుకు డయాఫ్రం వాల్

▸ ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1 పనులు వచ్చే ఫిబ్రవరికి

▸ 2026 జూలైకల్లా కుడి కాలువ కనెక్టివిటీలు

▸ 2027 ఫిబ్రవరి నాటికి ఎడమ కాలువ కనెక్టివిటీలు

▸ పనులన్నీ వచ్చే ఏడాది డిసెంబరుకల్లా పూర్తిచేయాలని టార్గెట్

▸ ఢిల్లీలో సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో సమీక్ష

▸ హాజరుకానున్న నిమ్మల బృందం

▸ పనుల పరిశీలనకు రావాలంటూ కేంద్రమంత్రిని ఆహ్వానించనున్న రాష్ట్రం



అమరావతి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సోమవారం ఢిల్లీలో సమీక్షించనున్నారు. ఆ శాఖ కార్యదర్శి దేబర్షి ముఖర్జీతో పాటు కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థలు, రాష్ట్ర జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) నరసింహమూర్తి తదితరులు హాజరు కానున్నారు. ప్రాజెక్టు స్థితిగతులు, పురోగతి, లోటుపాట్లను కేంద్ర మంత్రికి పీపీఏ వివరించనుంది. పోలవరం తాజా ప్రగతి, లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వం ఆయన ముందుంచనుంది. ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం గ్యాప్-1 పనులు వచ్చే ఫిబ్రవరికి, గ్యాప్-2 పనులు 2027 డిసెంబరు నాటికి, కుడి కాలువ కనెక్టివిటీలను 2026 జూలై నాటికి, ఎడమ కాలువ కనెక్టివిటీలు 2027 ఫిబ్రవరి నాటికి, మిగతా ఇతర పనులన్నిటినీ వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేసేలా లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు నివేదించనుంది. కాగా.. ప్రతి మూడు నెలలకు పోలవరం ప్రాజెక్టు ప్రగతి వివరాలను మంత్రి నిమ్మల నేరుగా జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు పంపుతున్నారు. తరచూ ఆయనతో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రతి సమావేశంలోనూ ఆయన్ను పోలవరం ప్రాజెక్టు సందర్శనకు ఆహ్వానిస్తున్నారు. సోమవారం నాటి భేటీలోనూ రమ్మని కోరతానని నిమ్మల 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

సహాయ పునరావాసమే అసలు సమస్య

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చాక పోలవరం ప్రధాన డ్యాం పనులన్నీ గాడిలో పడ్డాయి. అయితే నిర్వాసితులకు సహాయ, పునరావాసమే అసలు సమస్యగా మారింది. ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల కాంటూరు దాకా నిధులు ఇచ్చేందుకు కేంద్రం సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే ప్రాజెక్టులో గరిష్ఠంగా 45.72 మీటర్ల కాంటూరులో 194.6 టీఎంసీల నీటిని నిల్వచేయాలంటే భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలకు నిధుల సమస్య తలెత్తుతోంది. 2014-19 కాలంలో 45.72 మీటర్లకు సంబంధించి భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల సమాచారం పీపీఏ వెబ్‌సైట్‌లో ఉండేది. 2019-24 మధ్యకాలంలో నాటి సీఎం వైఎస్ జగన్ దానిని 41.15 మీటర్ల కాంటూరుకే పరిమితం చేశారు. ఈ కాంటూరులో నీటిని నిల్వ చేస్తే 115 టీఎంసీల నిల్వతో పోలవరం ప్రాజెక్టు చిన్నతరహా ప్రాజెక్టుగా మిగిలిపోతుందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. 194.60 టీఎంసీల నిల్వ చేసేలా భూసేకరణ, సహాయ పునరావాసానికి నిధులు మంజూరు చేస్తామనే లిఖితపూర్వక హామీని కేంద్రం నుంచి పొందాలని ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

ఆశలు వదిలేసిన పోలవరానికి మళ్లీ ఆయుష్షు

జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం స్తంభించింది. కేంద్రం వద్దన్నా వినకుండా నిర్మాణ సంస్థ కాంట్రాక్టును రద్దు చేశారు. రివర్స్ టెండర్ పేరిట ఏడాదిన్నరపాటు కాలయాపన చేశారు. 2020లో గోదావరి నదికి వచ్చిన భారీ వరదకు కీలకమైన డయాఫ్రం వాల్ దెబ్బతింది. దీంతో వరద ప్రవాహాన్ని అడ్డగించే ప్రధాన డ్యాం ఎర్త్ కం రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. ఇదే సమయంలో కాఫర్ డ్యాంకు సీపేజీ వచ్చింది. గైడ్‌బండ్ కుంగిపోయింది. ప్రాజెక్టును 2020లోనే నిర్మిస్తామంటూ అసెంబ్లీ వేదిక చెప్పిన జగన్.. తర్వాత మాటమార్చుకుంటూ వచ్చారు. చివరకు ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమని ఆయన మంత్రే ప్రకటించారు. ఇలా జీవం కోల్పోయి ఇక పోలవరం ప్రాజెక్టు పూర్తి కాదని ప్రజలు ఆశలు వదిలేసుకున్న సమయంలో.. గత ఏడాది చంద్రబాబు నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చి దానికి ఆయుష్షు పోసింది. కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జల సంఘం, అంతర్జాతీయ నిపుణులు, పీపీఏ.. ఇలా పలు సంస్థల పర్యవేక్షణలో ప్రాజెక్టు పనులు చకచకా సాగుతున్నాయి. వరద వచ్చిన సమయంలోనూ డయాఫ్రం వాల్ సహా ఇతర పనులన్నీ నిర్దేశిత సమయంలో పూర్తిచేసేందుకు యంత్రాంగం కృషిచేస్తోంది.

చాగంటి కోటేశ్వరరావుకు సాహితీ పురస్కారం

▸ ప్రదానం చేయనున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ప్రవచన రత్నాకర డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుకు ప్రదానం చేయనున్నారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 6గంటలకు హైదరాబాద్ అబిడ్స్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో దీన్ని ప్రదానం చేస్తారు. తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ పురస్కారాన్ని అందజేస్తారని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య తెలిపారు. పురస్కారం కింద రూ.25వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో పురస్కార గ్రహీతను సత్కరిస్తారని తెలిపారు.

శింగరకొండలో హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

అద్దంకి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా అద్దంకి మండలం శింగరకొండ క్షేత్రంలో ఆదివారం హైకోర్టు జడ్జి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కొండపై ఉన్న లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జ్యోతిర్మయి దంపతులకు వేదపండితులు, పూజారులు ఆశీర్వచనాలు అందజేశారు.


శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు

తురకపాలెంలో మరో మహిళ మృతి

▸ పది రోజులుగా జ్వరం.. వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స

▸ తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితం జీజీహెచ్‌లో చేరిక

▸ ఆదివారం మృతి... 'మెలియోయిడోసిస్' అనే అనుమానం

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో మళ్లీ కలకలం మొదలైంది. మిస్టరీ మరణాలకు అడ్డుకట్ట పడిందని జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో ఈ గ్రామంలో మరో మహిళ జ్వరంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందింది. గుంటూరు జిల్లా తురకపాలెంలోని బీసీ కాలనీకి చెందిన చల్లా కృష్ణవేణి వారం, పది రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. శరీరంపై గడ్డలు కూడా రావడంతో ఆమె.. మంగళగిరి, విజయవాడ ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నారు. అయినా తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితమే గుంటూరు జీజీహెచ్‌లో చేరారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. అయితే ఆమె మృతికి మెలియోయిడోసిస్ వ్యాధి కారణమై ఉంటుందని పలువురు అనుమానిస్తున్నారు. ఈ వ్యాధి వల్ల గత రెండు నెలల్లో తురకపాలెంలో 30 మందికి పైగా చనిపోయారు. దీంతో జిల్లా యంత్రాంగంతో పాటు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ కూడా ఈ గ్రామానికి వచ్చి అనేక పరీక్షలు నిర్వహించింది. ప్రజలకు సురక్షితమైన తాగునీరు, భోజనం వంటి సదుపాయాలు కల్పించారు. కానీ, మిస్టరీ మరణాలకు కారణాన్ని మాత్రం గుర్తించలేకపోయారు. ఇటీవల గ్రామంలో మరణాలు ఆగాయనుకుంటున్న తరుణంలో ఒక మహిళ మృతితో మళ్లీ అలజడి మొదలైంది.

మధుమేహం వల్లే మృతి: డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

తురకపాలెంలో మహిళ మృతిపై గుంటూరు జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి ఆదివారం రాత్రి స్పందించారు. కృష్ణవేణి మృతికి మెలియోయిడోసిస్ కారణం కాదని, మధుమేహం వల్లే ఆమె చనిపోయారని చెప్పారు. ఈ విషయాన్ని వైద్యులు కూడా ధ్రువీకరించారని తెలిపారు.


విశాఖ కేజీహెచ్‌లో విద్యార్థినితో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

కురుపాం విద్యార్థినుల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి ఆరా

▸ పరిస్థితి వివరించిన మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినుల అస్వస్థతపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరా తీశారు. ఈ మేరకు ఆదివారం గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దీనిపై అధికారులు తీసుకున్న చర్యలపై నివేదికలు అందించాలన్నారు. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో 37 మంది విద్యార్థినులు ఉన్నారని, వారిలో ముగ్గురు ఐసీయూలో ఉన్నట్టు మంత్రి సంధ్యారాణి సీఎంకు తెలియజేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించినట్టు వెల్లడించారు. ఇక పార్వతీపురం జిల్లాకేంద్రాస్పత్రిలో 120 మంది వైద్య సేవలు పొందుతున్నారని, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటున్నారని తెలిపారు. ఆదివారం సాయంత్రం మరో ఐదుగురు విద్యార్థినులను పార్వతీపురం నుంచి కేజీహెచ్‌కు తరలించారని, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యాలు నిలకడగానే ఉన్నాయని తెలిపారు.

మెరుగైన వైద్యం అందించండి : మంత్రి అచ్చెన్నాయుడు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కురుపాం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

వయోవృద్ధుల దర్శనంపై వదంతులు నమ్మొద్దు: టీటీడీ

తిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల దర్శనంపై వదంతులను నమ్మొద్దని టీటీడీ ఆదివారం ఓ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేసింది. 'ప్రతిరోజు వెయ్యి మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టీటీడీ మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ.50 విలువైన ఒక లడ్డూ ఉచితంగా లభిస్తుంది. తిరుమలలోని తిరుమలనంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్ లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు వార్తలు లేదా వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. సరైన సమాచారానికి అధికారిక వెబ్‌సైట్.. టీటీడీ.తిరుమల.ఓఆర్జీ, టీటీ దేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్ ను సంప్రతించండి' అంటూ ఆ ప్రకటనలో టీటీడీ పేర్కొంది.

సముద్రంలో కొట్టుకుపోయి..రష్యన్ ఇంజనీరు మృతి

మల్కాపురం (విశాఖపట్నం), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో స్నానానికి దిగి, నీటిలో కొట్టుకుపోయి రష్యన్ ఇంజనీరు ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన విశాఖ జిల్లా యారాడ తీరంలో ఆదివారం జరిగింది. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... ఐఎన్ఎస్ డేగాలో హెలికాప్టర్ల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టేందుకు ఆగస్టు 20వ తేదీన పది మంది రష్యన్ ఇంజనీర్లు నగరానికి వచ్చి ఒక హోటల్‌లో బస చేశారు. వీరంతా ఆదివారం ఉదయం యారాడ బీచ్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు సముద్రంలోకి దిగారు. వీరిలో ఏడుగురు ఒక చోట, ముగ్గురు మరోచోట ఉన్నారు. ఈ క్రమంలో బలమైన కెరటం రావడంతో ముగ్గురూ నీటిలో గల్లంతయ్యారు. ఇది గమనించిన సహ ఇంజనీర్లు కేకలు వేయడంతో అక్కడే ఉన్న లైఫ్‌గార్డ్స్ అప్రమత్తమై సముద్రంలో కొట్టుకుపోతున్న ముగ్గురిని తీరానికి చేర్చి సీపీఆర్ చేశారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించిన అకులెన్‌కో (62) అనే ఇంజనీరు మృతిచెందారు.

బొప్పూడిలో ఘనంగా నక్షత్ర వనమహోత్సవం

▸ పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు


బొప్పూడిలో నక్షత్ర వనమహోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

చిలకలూరిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నక్షత్రవనం అనేది భారతీయ జ్యోతిషశాస్త్రంలో అశ్వని నుంచి రేవతి నక్షత్రం వరకు 27 నక్షత్రాలకు సంబంధించిన 27 చెట్ల సముదాయమని హైకోర్టు న్యాయమూర్తి, బొప్పూడి శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడిలో నిర్వహించిన నక్షత్ర వనమహోత్సవం ప్రారంభ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. నక్షత్ర వృక్షాలను పెంచడం ద్వారా ఆయురారోగ్య ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని, ఇటువంటి నక్షత్ర వనాలు శృంగేరి పీఠంలో ప్రసిద్ధమని చెప్పారు. అన్ని ప్రసిద్ధ దేవాలయాల్లో నక్షత్ర వనాలు ఉన్నాయని తెలిపారు. బొప్పూడి గ్రామంలో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీచెన్నకేశవ స్వామి, శ్రీమల్లేశ్వర స్వామి వార్లకు చెందిన ఒక ఎకరం 20 సెంట్ల భూమిలో చిలకలూరిపేట శ్రీసత్య సాయి సేవా సంస్థ, దేవదాయ, ధర్మాదాయ శాఖ సహకారంతో నక్షత్ర రాశుల వారీగా మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వై.లక్ష్మణరావు, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్, జస్టిస్ వి.సుజాత, జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ ఎ.రవినాథ్ తిల్హారీ, జస్టిస్ ఏవీ శేషసాయి, గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి బి.శాయి కళ్యాణ చక్రవర్తి, చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బి.కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు.

దొంగ మస్టర్లకు ఇక చెక్

▸ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి జాబ్‌కార్డులకు ఈకేవైసీ

▸ ఇప్పటికే కర్నూలు, చిత్తూరులో పూర్తి

అమరావతి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో దొంగ మస్టర్లు అరికట్టి, బోగస్ జాబ్‌కార్డులను ఏరివేయాలన్న కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. తొలుత పైలట్ ప్రాజెక్టు కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మిగిలిన జిల్లాల్లోనూ ప్రారంభించింది. ఈకేవైసీ ఫీచర్ ఉపయోగించి ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ ద్వారా జాబ్ కార్డ్ ఎలా పునరుద్ధరించాలన్న దానిపై రాష్ట్ర, జిల్లా స్థాయిలో సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌తో అనుసంధానమై ఉన్న ఈకేవైసీ ఫీచర్‌ను ఉపయోగించి ఉపాధి శ్రామికులందరికీ ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. గ్రామ స్థాయిలో ఉండే అవసరాన్ని బట్టి ప్రోగ్రాం ఆఫీసర్ ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్, మేట్లను ఉపయోగించుకుని గ్రామాల్లో ఉపాధి శ్రామికులందరికీ ఈకేవైసీ పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ ఆదేశాలిచ్చారు. ఇప్పటికే ఎన్ఎంఎంఎస్ ద్వారా రోజుకు రెండు సార్లు పనులకొచ్చిన శ్రామికుల ఫొటోలు తీసేందుకు చర్యలు తీసుకోవడంతో పనులకొచ్చే శ్రామికులకే వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నారు. పనికి హాజరుకాని శ్రామికులను కూడా పనికి వచ్చినట్లు హాజరు వేసుకుని తప్పుడు మస్టర్లు నమోదు చేయడం ఇక వీలుకాదని అధికారులు పేర్కొంటున్నారు. కాగా, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బోగస్ జాబ్‌కార్డులు అధికగా ఉన్నందున వాటిని ఏరివేసేందుకు ఈకేవైసీ సాధనాన్ని ఉపయోగించుకోనున్నారు.

మండిన ఎండ.. పిడుగుల వాన

▸ రాష్ట్రంలో వాతావరణ అనిశ్చితి...నేడు తీవ్రస్థాయిలో పిడుగులు

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వేసవిని తలపించేలా ఎండ తీవ్రమైంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేడి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. నెల్లూరులో 38.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక కోస్తాంధ్ర నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొని ఆదివారం మధ్యాహ్నం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో పలుచోట్ల ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. ఎలమంచిలిలో 10.9, కొక్కిరాపల్లిలో 10.1, రామారాయుడుపాలెంలో 9.7, సోమలింగపాలెంలో 8.0, చూచుకొండ, ముమ్మిడివరంలలో 7.9, పల్నాడు జిల్లా గుళ్లపల్లిలో 6.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని, పిడుగులు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, సోమవారం దక్షిణకోస్తా, రాయలసీమల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

పెళ్లింట విషాదం నింపిన 'డీజే'

అదుపుతప్పి జనంపైకి దూసుకెళ్లిన డీజే వాహనం
వరుడి తండ్రి మృతి.. చిన్నాన్నకు తీవ్రగాయాలు
శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లిలో ఘటన

కనగానపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): డీజే వాహనం అదుపుతప్పి జనంపైకి దూసుకెళ్లడంతో వరుడి తండ్రి మరణించగా, చిన్నాన్నకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిందీ ఘటన. కుమారుడి పెళ్లిలో ఆనందంగా డ్యాన్స్ చేస్తున్న చిన్న తిరుమలయ్య(52) ఈ ఘటనలో దుర్మరణం చెందగా, ఆయన తమ్ముడు ఆదెప్ప తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కనగానపల్లికి చెందిన చిన్న తిరుమలయ్య పెద్ద కుమారుడు శివానంద వివాహం ఆదివారం ఉదయం పెనుకొండ మండలం గుట్టూరుకు చెందిన ఇందూతో జరిగింది. వధువు ఊరిలోనే వివాహం చేసి సాయంత్రం వరుడి గ్రామానికి చేరుకున్నారు. కుమారుడి మెరవణికి చిన్న తిరుమలయ్య డీజే ఏర్పాటు చేశారు. నూతన వధూవరులు ఆలయంలో కొబ్బరికాయ కొట్టేందుకు వెళ్లగా.. తండ్రి సంతోషంతో డీజే ముందు డ్యాన్స్ చేస్తున్నారు. ఆ సమయంలో అదుపుతప్పిన డీజే వాహనం డ్యాన్స్ చేస్తున్న వారిపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో తిరుమలయ్య అక్కడికక్కడే మృతిచెందగా.. ఆదెప్ప తీవ్రంగా గాయపడ్డాం. ఆదెప్పను ఆస్పత్రికి తరలించారు. పెళ్లికి వచ్చిన బంధువులు, కుటుంబసభ్యులు.. తిరుమలయ్య మృతదేహంపై పడి బోరున విలపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వ్యవసాయం చేసుకుని జీవించే తిరుమలయ్యకు భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వరంగ షెడ్యూల్డ్ బ్యాంక్)
టెండరు నోటీసు
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అక్టోబర్ 25 నుండి మార్చి 26 లోపు ఫైనాన్షియల్ & డిజిటల్ లిటరసీ క్యాంప్స్ (FDLCs) నిర్వహించడానికి ఒక RFQ ను ప్రారంభించింది. మరిన్ని వివరాలకు బ్యాంక్ వెబ్‌సైట్: https://apgb.bank.in/tenders ను సందర్శించండి.
ప్రదేశము : గుంటూరు, ఏపి — జనరల్ మేనేజర్-FI
తేది : 06-10-2025 — హెడ్ ఆఫీస్, గుంటూరు

ANDHRA PRADESH POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA VIJAYAWADA-520004
NIT No.610002068
APGENCO invites open tender for Repairing & Rectification of failed 240 KVA, 15.75 KV/236KV, BHEL make Generator Transformer, Sl.No.2007792/1993, Electrical Specification No:625377 and Erection & commissioning of repaired GT at Dr.NTTPS, through APGENCO e-Procurement platform.
Estimated Value of Contract: Rs.8,65,92,411 (Incl of all charges Statutories and GST)
Schedule available date & time: from 18:00 Hrs onwards on 01-10-2025.
Bid submission closing date & time: Upto 13:00 Hrs on 23-10-2025.
For further details visit website viz. www.apgenco.gov.in (or) https://etender.apgenco.gov.in/irj/portal
DIPR RO No.4464PP/CL/ADVT/1/1/2021-22, Dt: 03.10.2025

భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in
08 మరియు 11 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీస్ వేలం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ₹1,900 కోట్ల (ముఖ విలువ) మొత్తాన్ని వేలం ద్వారా విక్రయించడానికి ప్రతిపాదించింది.
మల్టిపుల్ ప్రైస్ ఫార్మాట్ క్రింద రాబడి ఆధారిత వేలం, భారతీయ రిజర్వ్ బ్యాంకు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (E-Kuber) మీద 07 అక్టోబర్ 2025 (మంగళవారం)న నిర్వహించ బడుతుంది. ఎటీ లేని స్కీమ్ ప్రకారం రిటైల్ డైరెక్ట్ పోర్టల్ (https://rbiretaildirect.org.in) ద్వారా కూడా వ్యక్తిగత ఇన్వెస్టర్లు బిడ్లు దాఖలు చేయవచ్చు.
మరింత సమాచారం కొరకు 03 అక్టోబర్ 2025 (శుక్రవారం) తేదీ నాటి భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారి పత్రికా ప్రకటనను RBI వెబ్ సైట్ (www.rbi.org.in)ను చూడండి.
"మీకు డబ్బు ఆశ చూపుతూ వచ్చే ఈ-మెయిల్స్/ఎస్ఎంఎస్‌లకు/కాల్స్ వల్ల మీరు మోసపోవద్దు"

भारतीय कपास निगम लिमिटेड
THE COTTON CORPORATION OF INDIA LTD.
(A Government of India Undertaking)
Branch Office: Kapas Bhavan, 4/2, Ashok Nagar, P.B.227, Guntur-522002, AP
Tele.No.0863-2233472, Fax No.0863-2357472, E-mail:guntur@cotcorp.com
Website: www.cotcorp.org.in, Ministry Website: www.ministryoftextiles.gov.in
REF NO: CCI/BO/APPEAL/2025-26 — Date: 05.10.2025
పత్తి రైతులకు విజ్ఞప్తి
2025-26 పత్తి సీజన్ కోసం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (CCI) రాష్ట్రంలో 30 సేకరణ కేంద్రాలను ప్రారంభించింది. రాకపోకల సరళి ఆధారంగా మరియు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి, CCI సేకరణ తేదీని అక్టోబర్ 21, 2025 నుండి నిర్ణయించింది. రాష్ట్రంలో సజావుగా సేకరణ MSP కార్యకలాపాలను సులభతరం చేయడానికి, CCI కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌ను ప్రారంభించింది, ఇది రైతులు వారి సౌలభ్యం ప్రకారం 7 రోజుల రోలింగ్ ప్రాతిపదికన స్లాట్ బుకింగ్‌ను సులభతరం చేస్తుంది. ఈ డిజిటల్ చొరవ పత్తి రైతులు తమ పంటను ఇబ్బంది లేకుండా విక్రయించడానికి అధికారం ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలోని అందరు పత్తి రైతులు రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్‌లో తమ రిజిస్ట్రేషన్‌ను నిర్ధారించుకోవాలని అభ్యర్థించారు, ఎందుకంటే CCI కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌లో ప్రత్యేక రిజిస్ట్రేషన్ అవసరాన్ని నివారించడానికి అదే డేటా కపాస్ కిసాన్ యాప్‌లో ఉపయోగించబడుతుంది.
బ్రాంచ్ హెడ్

ఆంధ్రజ్యోతి 8

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం • 6 అక్టోబరు 2025



హోమ్ స్టే... ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తున్న మాట. కానీ ఆరేళ్ల క్రితమే విశాఖ నగరంలో ఈ విధానానికి శ్రీకారం చుట్టారు రేణుగుప్తా. పర్యాటకులకు వసతి కొరత తీర్చడంతో పాటు సొంతింటి అనుభూతిని అందించడమే దీని ఉద్దేశం అంటున్న ఆమె... ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి అభినందనలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో 'నవ్య'తో అనేక విషయాలను ఆమె ప్రత్యేకంగా పంచుకున్నారు.

అచ్చంగా ఇంట్లో ఉన్నట్టే...

"మాది ఉత్తరప్రదేశ్‌లోని బెనారస్. ఆ రాష్ట్రంలో, ఢిల్లీలో నా చదువంతా సాగింది. కొన్నాళ్లపాటు ఢిల్లీలో కొన్ని ఎన్జీవోలలో, ఇతర సంస్థల్లో పనిచేశాను. 1985లో విశాఖకు చెందిన డాక్టర్ జి.వి.రమణతో వివాహం జరిగింది. ఆయన ఎకనామిక్ టైమ్స్‌లో అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. మేము ఎనిమిదేళ్లపాటు ఢిల్లీలో ఉద్యోగాలు చేశాం. నా అత్తమామలు అప్పటికి చాలా ఏళ్ల కిందటే విశాఖకు వచ్చి స్థిరపడ్డారు. అప్పుడప్పుడూ విశాఖకు వచ్చి వెళ్లేవాళ్లం. వారికి వయసు పైబడడంతో అనారోగ్య సమస్యలు మొదలయ్యాయి. వారిని దగ్గరుండి చూసుకోవాలన్న ఉద్దేశంతో 1993లో విశాఖ వచ్చేశాం. ఇక్కడ కొత్త ఉపాధి చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో 'ఆర్డీ హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థను ప్రారంభించాం. నేను ప్రస్తుతం ఆ సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నా.

ఆలోచన పుట్టింది అలా..

మా ఇల్లు చాలా పెద్దది. అది 60 ఏళ్లకు పూర్వానిది. నా అత్తమామలు చనిపోవడం, మా అమ్మాయికి వివాహమై బెంగళూరు వెళ్లిపోవడంతో.. నేను నా భర్త మిగిలాం. దాంతో కాస్త ఒంటరితనంగా అనిపించేది. అందేకాదు. ఇల్లు కూడా శుభ్రంగా ఉన్నట్టు అనిపించేది కాదు. నిర్వహణ ఖర్చు కూడా ఎక్కువగా ఉండేది. ఈ సమస్యల పరిష్కారం కోసం.. ఇంట్లో గదులను ఎవరైనా వినియోగించుకొనేలా చేస్తే బాగుంటుందని అనుకున్నాను. రమణకు చెబితే సరేనన్నారు. ఈ ఆలోచనలో నుంచి పుట్టిందే 'హోమ్ స్టే'. మన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, దేశంలోని ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు మా ఇంటికి వచ్చి ఆతిథ్యం పొందే అవకాశాన్ని కల్పించాం. మొదట్లో తెలిసిన వారికి మాత్రమే ఇచ్చేవాళ్లం. ఆ తరువాత ఆన్‌లైన్‌లో వివరాలు పెట్టాం. పర్యాటకులు వారు ఉండే రోజులను బట్టి, ఎంపిక చేసుకునే గదులను బట్టి, వారి సంఖ్యను బట్టి డబ్బులు చెల్లిస్తారు. వసతితోపాటు భోజన సదుపాయం కూడా కావాలంటే కల్పిస్తాం. మేము వండుకున్నదే వారికి పెడతాం. వారి ఆహారపు అలవాట్లకు అనుగుణంగా... వారే వంట చేసుకునేందుకు సదుపాయాలు కూడా ఉన్నాయి. చాలామంది మాతోపాటు మేము వండుకున్నవి తినేందుకు ఇష్టపడుతుంటారు. కొందరు మా కిచెన్‌లోకి వచ్చి, వారి వంటలు వండి, మాకు పెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక, వంట చేసే సమయంలో సాయం చేయడానికి కూడా ముందుకు వస్తూ ఉంటారు. నేను సౌతిండియన్, నార్త్ ఇండియన్ వంటలన్నీ బాగా చేస్తాను. పర్యాటకులు ఉన్నన్ని రోజులూ ఒక్కోరోజు ఒక్కో ప్రాంతానికి చెందిన వంటలు వండి పెడతాను.

మూడు కేటగిరీల్లో గదులు..

ప్రస్తుతం మా ఇంట్లో మూడు అదనపు గదులను పర్యాటకుల కోసం కేటాయించాం. వీటిలో రెండు ఫ్యామిలీతో కలిసి ఉండేందుకు, ఒకటి బ్యాచిలర్స్, స్నేహితులు ఉండేందుకు అనువుగా ఉంటాయి. వాటికి పేర్లు కూడా ఉన్నాయి. ఒకటి మెగ్నోలియా స్టే, మరొకటి మెగ్నోలియా స్టూడియో రూమ్, ఇంకొకటి మెగ్నోలియా హోమ్. మెగ్నోలియా అనేది నాకు ఇష్టమైన ఒక పువ్వు పేరు. అందుకే గదులకు ఆ పేరు పెట్టాను. మా ఇంటికి వచ్చే పర్యాటకుల్లో 70 నుంచి 80 శాతం ఇతర రాష్ట్రాలకు చెందినవారు. వారిలో కుటుంబంతో కలిసి వచ్చేవాళ్లు, స్నేహితులతో వచ్చే వాళ్లు ఉంటారు. మరో 20 శాతం మంది విదేశీ పర్యాటకులు. ఎక్కువగా అమెరికా, యూకే, జపాన్, ఫ్రాన్స్ లాంటి దేశాలకు చెందిన టూరిస్టులు వస్తారు. ఒకసారి మా ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించిన వారు... మరోసారి విశాఖ వస్తే మా దగ్గరకే వస్తారు. మరో చోటుకు వెళ్లేందుకు ఇష్టపడరు. మా ఇంటికి వచ్చే వాళ్లను టూరిస్టులుగా కాకుండా కుటుంబ సభ్యులుగా చూసుకుంటాం. వారితో మమేకమవుతాం. అన్ని విషయాలను చర్చిస్తాం. చాలా మంది ఆ తరువాత కూడా ఫోన్ చేసి, మా బాగోగులు తెలుసుకుంటూ ఉంటారు. వారి ఇళ్లకు ఆహ్వానిస్తూ ఉంటారు. అలాంటప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. అమ్మాయి పెళ్లయి వెళ్లాక, ఒంటరిగా ఉన్నామన్న భావన ఇప్పుడు లేదు. మా. కుటుంబ సభ్యులు పెరిగినట్టు అనిపిస్తోంది.

పరస్పర సహకారం..

మాకు కొద్దిమందితో చిన్న చిన్న ఇబ్బందులు ఎదురవుతాయి. అలాంటివారికి... వారు చెల్లించిన డబ్బు తిరిగి ఇచ్చి పంపించేస్తాం. మా ఇంట్లో ఉన్నన్ని రోజులు వారికి విశాఖలోని అందాలు, పర్యాటక ప్రదేశాలు, వారు వెళ్లాల్సిన ప్రాంతాల గురించి చెబుతూ ఉంటాం. కొందరు పరిశోధనల కోసం, అధ్యయనాల కోసం వస్తారు. వారికి అవసరమైన సహకారాన్ని రమణ అందిస్తారు. ఇతర దేశాల నుంచి వచ్చిన వారికి నోట్స్ ప్రిపరేషన్, ఇతర సాంకేతిక అంశాల్లో సహాయాన్ని చాలా సందర్భాల్లో రమణ అందించారు. ఒక రకంగా చెప్పాలంటే గైడ్‌గా కూడా బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉంటాం. కొన్నిసార్లు మా ఇంట్లో దిగిన వారికి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. వస్తే వారు పూర్తిగా కోలుకునేంత వరకు జాగ్రత్తగా చూసుకుంటాం. మా ఆత్మీయతను చూసి భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్న వాళ్లు కూడా ఉన్నారు.

పరిశుభ్ర నగరంగా కితాబు..

మా ఇంట్లో ఆతిథ్యం తీసుకున్న టూరిస్టుల్లో దాదాపు అందరూ నగర అందాలకు ముగ్ధులైన వారే. విశాఖ నగరం పరిశుభ్రంగా ఉండడంతోపాటు మనుషులు ఆత్మీయంగా ఉంటారని వారు చెబుతుంటారు. ఇక్కడి మనుషుల మాట తీరు, వ్యవహరించే విధానం బాగుటుందని ప్రశంసిస్తూ ఉంటారు. తొలిసారి వచ్చిన టూరిస్టులు ఎక్కడెక్కడికి వెళ్లాలో, ఏ ప్రాంతాలను సందర్శించాలో తెలుసుకుంటారు. దేశ, విదేశాలకు చెందిన, భిన్నమైన వ్యక్తిత్వం కలిగిన, వివిధ భాషలు మాట్లాడే వ్యక్తులకు ఆతిథ్యం ఇవ్వడం వల్ల అనేక విషయాలను తెలుసుకొనే అవకాశం మాకు ఏర్పడుతోంది. ఇటువంటి విధానాన్ని నగర వాసులతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు వినియోగించుకోవాలి. కొన్ని ఇబ్బందులు ఉంటాయి. అయితే, అటువంటి సందర్భాలు అతి తక్కువ మాత్రమే మాకు ఎదురయ్యాయి. మా హోమ్ స్టే సంగతి తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కిందటి నెల 27న, 'పర్యాటక దినోత్సవం' సందర్భంగా... వర్చువల్ విధానంలో నాతో మాట్లాడారు. హోమ్ స్టే విధానం అమలు తీరు, వస్తున్న ఆదాయం, తదితర విషయాలను తెలుసుకుని నన్ను అభినందించారు. అది నాకు ఎంతో సంతోషం కలిగించింది. ప్రభుత్వం రాష్ట్రమంతటా ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధపడుతుండడం మంచి విషయమే. ఇది రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందని ఆశిస్తున్నాను."

• బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం
ఫొటోలు: వై.రామకృష్ణ

వాషింగ్ మెషిన్‌లో ఇలా...

వాషింగ్ మెషిన్‌లో వేసి ఉతకడం వల్ల దుస్తులు రంగు వెలవడం, టీ షర్టులు లాంటివి సాగిపోవడం చూస్తుంటాం. ఎక్కువగా డిటర్జెంట్ వినియోగించినప్పటికీ ఒక్కోసారి దుస్తులపై మురికి, మరకలు వదలకుండా ఇబ్బంది కలిగిస్తుంటాయి. అలాకాకుండా చిన్న చిట్కాలు పాటిస్తూ వాషింగ్ మెషిన్‌లో దుస్తులను జాగ్రత్తగా ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం...

- వాషింగ్ మెషిన్‌లో వేసే ముందు దుస్తులపై మరకలు, మురికి ఎక్కడ ఎక్కువగా ఉన్నాయో పరిశీలించాలి. సాధారణంగా షర్ట్ కాలర్, డ్రెస్ చేతుల చివర్లు, చీర లేదా లెహంగా కింది భాగాల మీద మురికి ఎక్కువగా చేరుతూ ఉంటుంది. ఒక గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి కొన్ని నీళ్లు చిలకరించి పేస్టులా చేయాలి. ఈ పేస్టుని దుస్తులమీద మరకలు, మురికి ఎక్కువగా ఉన్నచోట రాసి పావుగంటసేపు ఉంచాలి. తరువాత నీళ్లు చల్లుతూ చేతులతో రుద్దితే మురికి పూర్తిగా వదులుతుంది. బాగా మాసిన దుస్తులను అరగంటసేపు సర్ఫ్ నీళ్లలో నానబెట్టిన తరువాతే వాషింగ్ మెషిన్‌లో వేయడం మంచిది.
- పెయింటింగ్, ఎంబ్రాయిడరీ వర్క్‌లు సహా వివిధ రకాల డిజైన్లు ఉన్న రంగుల దుస్తులను లోపలికి తిప్పి వాషింగ్ మెషిన్‌లో వేయాలి. దీనివల్ల దుస్తులు రంగు వెలవవు. వాటిపై ఉన్న డిజైన్లు కూడా పాడవకుండా ఉంటాయి.
- వాషింగ్ మెషిన్‌లో వేసేముందు దుస్తులకు ఉన్న బటన్లు, ఉక్కులు, జిప్పులను పెట్టేయాలి. దీనివల్ల దుస్తులు ఒకదానికొకటి చుట్టుకోకుండా ఉంటాయి. టీషర్టులు, లో దుస్తులు, సున్నితమైన ఫ్యాబ్రిక్‌లతో రూపొందించిన డ్రెస్‌లను మెష్ లాండ్రీ బ్యాగ్‌లో ఉంచి వాషింగ్ మెషిన్‌లో వేస్తే అవి సాగకుండా ఉంటాయి.



- కొన్ని వాషింగ్ మెషిన్‌లలో వేడినీళ్లు వినియోగించే వెసులుబాటు ఉంటుంది. మరీ వేడిగా కాకుండా గోరువెచ్చని నీళ్లను వాడితే దుస్తులకు పట్టిన దుర్వాసన, జిడ్డు, మురికి, మరకలు చాలావరకూ తొలగిపోతాయి. దుస్తులమీద చేరే హానికారక బ్యాక్టీరియాలు, ఇతర క్రిములు కూడా పూర్తిగా నశిస్తాయి. ముదురు రంగుల దుస్తులకు మాత్రం చల్లని నీళ్లనే వాడాలి.
- వాషింగ్ మెషిన్‌లో పరిమితికి మించి దుస్తులు వేయకూడదు. అలా వేస్తే నీళ్లలో సులువుగా తిరగలేక దుస్తులు సరిగా శుభ్రం కావు. అంతేకాదు వాటిమీద డిటర్జెంట్ నిలవడం వల్ల ఫ్యాబ్రిక్ త్వరగా పాడవుతుంది.
- డ్రయ్యర్‌ను ఎక్కువగా వాడకపోవడమే మంచిది. దీనిలోని అధిక వేడి కారణంగా దుస్తులు రంగు వెలిసిపోతాయి.

ఆరోగ్యశాఖలో ఫైళ్ల పంపకం

- మంత్రి వద్దకు 17 కీలక అంశాలు మాత్రమే
- మిగిలినవి కార్యదర్శుల స్థాయిలో క్లియరెన్స్
- ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆమోదం
- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

అమరావతి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్వర నిర్ణయాలతో పాలనలో వేగాన్ని పెంచాలన్న ఉద్దేశంతో ఆరోగ్య శాఖలో ఫైళ్ల వికేంద్రీకరణకు మంత్రి సత్యకుమార్ శ్రీకారం చుట్టారు. దీనిపై ఆదివారం ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆరోగ్య శాఖలో మొత్తం 45 ప్రధాన విషయాల్లో 17 అంశాలకు సంబంధించిన ఫైళ్లు మాత్రమే మంత్రి వద్దకు వచ్చేలా.. మిగతావి ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారుల స్థాయిలోనే నిర్ణయం తీసుకోనేలా రూపొందించిన ప్రణాళికకు మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. సీఎం ఆదేశాల మేరకు ఫైళ్ల వికేంద్రీకరణ తీసుకొచ్చామని మంత్రి సత్యకుమార్ వివరించారు. పలు విషయాల్లో ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి, మంత్రిత్వ శాఖలోని మధ్య స్థాయి అధికారులు, వివిధ విభాగాధిపతులు నిర్ణయాలు తీసుకుంటే సరిపోతుందని నిర్ణయించారు. ఉన్నతాధికారులతో పలు దఫాలు చర్చించి, నిర్ణయాధికార వికేంద్రీకరణపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. విధానపర విషయాలు, క్యాబినెట్, చట్టసభలకు సంబంధించినవి, సీఎం ఆదేశాలు, సూచనలకు సంబంధించినవి, సిబ్బంది నియామకాలు, విజిలెన్స్‌కు సంబంధించిన, ఉన్నతస్థాయి అధికారులు, సిబ్బందికి చెందిన సర్వీసు విషయాలు, కొత్త కాలేజీలు, ఆస్పత్రుల ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు, తాత్కాలిక సిబ్బంది రెగ్యులరైజేషన్, రాష్ట్ర విభజన చట్టానికి సంబంధించిన అంశాలకు సంబంధించిన ఫైళ్లు మాత్రమే మంత్రి వద్దకు వస్తాయన్నారు. వివిధ స్థాయిల్లో నిర్ణయ సాధికారత కల్పించి అధికారులు, సిబ్బందిలో బాధ్యత, జవాబుదారీతనాన్ని పెంచడం, వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, సిబ్బంది ఉత్పాదకతను పెంచడం ఈ వికేంద్రీకరణ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు.



పంతంగి టోల్ ప్లాజా దగ్గర బారులు తీరిన వాహనాలు



నందిగామ వద్ద గంటల తరబడి నిలిచిపోయిన వాహనాలు

పండగైపోయింది.. పోదాం పద..!

- సెలవులు ముగియడంతో స్వస్థలాల నుంచి తిరుగు ప్రయాణాలు
- విజయవాడ- హైదరాబాద్ హైవేపై భారీ ట్రాఫిక్
- టోల్‌ప్లాజాల దగ్గర బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్/నందిగామ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవులు ముగిశాయి. ఉద్యోగులకు వారాంతపు సెలవులు కూడా పూర్తయ్యాయి. దీంతో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజాల వద్ద పెద్దసంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. సాధారణ రోజుల్లో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని పంతంగి టోల్‌ప్లాజా మీదుగా 30వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ, ఆదివారం ఒక్కరోజే 45వేలకు పైగా వాహనాలు ప్రయాణించాయని టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు. కాగా, దసరా పండుగ తిరుగు ప్రయాణాల రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు 1,050 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశామని టీజీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సోమవారం కూడా ప్రత్యేక సర్వీసులు నడుపుతామని పేర్కొంది.

నందిగామ బైపాస్‌లో ట్రాఫిక్ జామ్

జాతీయ రహదారుల శాఖ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నందిగామ వై జంక్షన్ వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ఆకస్మికంగా ఆగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా సందర్భంగా గత వారం హైదరాబాద్ నుంచి వేలాది వాహనాలు విజయవాడ వైపు వచ్చాయి. రహదారిపై గుంతల వల్ల భారీగా తరలివస్తున్న వాహనాలు నందిగామ సమీపంలో గంటల తరబడి ఆగిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పండుగ సెలవులు ముగిసిన తర్వాత వారంతా అదే రోడ్డుపై తిరుగు ప్రయాణం చేస్తారని తెలిసినా అధికారులు మరమ్మతులు చేపట్టక పోవడంతో వాహనదారులు మరోసారి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రధాన కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ మధ్య ఏర్పడిన ఆర్థిక వివాదాలతోనే నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు తెలిసింది.



పత్తికొండ మార్కెట్ యార్డ్‌కు పోటెత్తిన టమాటా

టమాటా కిలో రూ.4

- పత్తికొండ మార్కెట్‌లో పతనమైన ధరలు

పత్తికొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో టమాటా ధరలు పతనమయ్యాయి. కిలో టమాటా ధర మరీ ఘోరంగా రూ.4కి పడిపోయింది. పది కిలోల గంపలు రెండింటికి రూ.80 నుంచి రూ.100కు మించి ధర పలకలేదు. వ్యాపారులు 25 కిలోల గంపలు రెండు కనిష్ఠంగా రూ.180కి కొనుగోలు చేశారు. దీంతో రైతులు ఆగ్రహంతో రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. దసరా సందర్భంగా 1, 2వ తేదీల్లో మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. దీంతో రెండు రోజుల నుంచి కోతకు సిద్ధంగా ఉన్న పంటను రైతులు మార్కెట్ తీసుకొచ్చారు. శనివారం మార్కెట్‌కు 5.5 టన్నులు దాటి అమ్మకానికి రావడంతో వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసినా రైతులు పట్టించుకోలేదు. ఆదివారం కూడా తక్కువ ధరకే కొనుగోలు చేయడంతో ఆగ్రహించి ధర్నా చేపట్టారు.

కన్నతల్లిని చంపిన డబ్బు పిచ్చి!

- డబ్బులివ్వలేదని కత్తితో గొంతుకోసిన కొడుకు
- గారాబంగా పెంచడమే పాపం
- హైదరాబాద్ నుంచి నేరుగా వచ్చి తల్లితో గొడవపడి హత్య
- తండ్రి బెడ్‌రూమ్‌లో ఉండగా గడియపెట్టి దారుణం
- తర్వాత ఇంట్లోకి వెళ్లి సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ నవ్వులు
- పోలియో బాధిత ఉపాధ్యాయురాలి త్యాగాలకు బహుమానం
- కడప జిల్లా ప్రొద్దుటూరులో దారుణం

ప్రొద్దుటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలియో బాధితురాలైనప్పటికీ కష్టపడి ఉపాధ్యాయురాలిగా ఎదిగారు. భర్తకు సరైన ఉపాధి లేకపోయినా.. తన జీతంతో ఇంటిని నిలబెట్టారు. ఒక్కగానొక్క కొడుకును ఎంతో గారాబంగా పెంచారు. ఉన్నత చదువులు చదివించారు. కానీ ఆమె త్యాగాలకు విలువలేకుండా పోయింది. డబ్బులివ్వలేదని కన్నబిడ్డే.. కనికరం లేకుండా ఆమెను కత్తితో గొంతు కోసి చంపేశాడు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం జరిగింది దారుణం. పోలీసుల కథనం మేరకు.. ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్‌రెడ్డినగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసే ఉప్పలపాటి లక్ష్మీదేవి (52)ని ప్రొద్దుటూరు శ్రీరామ్ నగర్‌లో ఉన్న తమ ఇంట్లోనే ఆమెను కన్న కొడుకు యశ్వంత్‌రెడ్డి (26) గొంతుకోసి చంపేశాడు. ఉదయమే హైదరాబాద్ నుంచి వచ్చిన యశ్వంత్.. అప్పటికి తండ్రి విజయభాస్కర్‌రెడ్డి బెడ్‌రూములో ఉండగా గడియ పెట్టాడు. ఆ తర్వాత తల్లిని చంపి, మృతదేహాన్ని వంట గది నుంచి ఈడ్చుకొచ్చి కాంపౌండ్‌లో పడేశాడు. తర్వాత ఇంట్లోకి వెళ్లి తాళం వేసుకోని హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ కూర్చున్నాడు. నీ భార్యను చంపాను అని గట్టిగా అరవడంతో నివ్వెరపోయిన తండ్రి కేకలు వేశాడు. లక్ష్మీదేవి మృతదేహం నుంచి రక్తం రోడ్డుపైకి రావడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి తలుపులు పగుల గొట్టి యశ్వంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో అతడు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ నవ్వుతూ కనిపించాడని పోలీసులు తెలిపారు. తండ్రి విజయభాస్కర్‌రెడ్డిని గదిలో నుంచి బయటకు తీసుకొచ్చారు. హత్య టీటౌన్ పరిధిలో జరగడంతో త్రీటౌన్ పోలీసులు కేసును విచారిస్తున్నారు.



లక్ష్మీదేవి



యశ్వంత్‌రెడ్డి

యశ్వంత్ మానసిక స్థితి బాలేదా?!

కన్నతల్లిని దారుణంగా చంపిన యశ్వంత్‌కు మూడేళ్లుగా మానసిక పరివర్తన సరిగా లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అతడు హైదరాబాద్‌లో ఉన్న గదిలో ఒక్కడే ఉండేవాడని, స్నేహితులతో కూడా ఎక్కువగా తిరగడని చెబుతున్నారు. ఇంటికి కూడా ఎన్నాళ్లకో వచ్చే వాడని, కేవలం తన అవసరాలకు డబ్బుల కోసం తప్ప ఇంట్లో తల్లిదండ్రులతో సక్రమంగా ప్రేమ సంబంధాలు నెరిపేవాడు కాదని చెబుతున్నారు.

ఉన్నత చదువులు చదివి.. ఉద్యోగం లేక...

యశ్వంత్ నాలుగేళ్ల క్రితం బీటెక్ పూర్తవడంతో జాబ్ కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. తల్లి నెలనెలా ఖర్చులకు డబ్బు పంపేవారు. ఈ క్రమంలో సినిమాలో నటించాలని చెబుతుండేవాడని కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వాళ్లు తెలిపారు. ఉద్యోగం వద్దు ఏమీ వద్దు ఇంటికి వచ్చేయాలని తల్లి అంటుంటే అతడు డబ్బు కోసం తరచూ ఆమెను వేధించేవాడని చెబుతున్నారు. గత నెలలో రూ.10 వేలు పంపినా మళ్లీ డబ్బులు అడగటంతో ఆమె మూడు వేలే పంపారు. దీంతో తల్లిపై కక్ష పెట్టుకుని హైదరాబాద్ నుంచి వచ్చి వాగ్వాదం పెట్టుకొని, వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె గొంతు కోసి చంపాడు.

రెండు కాళ్లూ సరిగా లేకున్నా...

లక్ష్మీదేవికి పుట్టుకతోనే పోలియో. రెండు కాళ్లూ సరిగా లేకున్నా, కష్టపడి టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఆమెను రోజూ భర్త విజయ్‌భాస్కర‌రెడ్డి స్కూలుకు తీసుకువెళ్లి, మళ్లీ తీసుకొస్తుంటారు. ఆయన మొదట్లో సరైన ఉపాధి లేక పెయింట్ పని చేసేవారు. ఆ తర్వాత బార్‌లో పనిచేసేవారు. లక్ష్మీదేవి కష్టంతో కష్టపడి శ్రీరాంనగర్‌లో సొంత ఇల్లు కొనుక్కున్నారు. కొడుకును అల్లారు ముద్దుగా పెంచుకుని లక్షలు ఖర్చు పెట్టి చెన్నైలో ఇంటర్, బీటెక్ చదివించారు. అతడికి ఉద్యోగం రాకున్నా నాలుగేళ్లుగా వేలకు వేలు ఇచ్చి పోషిస్తున్నారు. ఇటీవల లక్ష్మీదేవి కింద పడి కాలికి గాయమై మూడు నెలలు బెడ్ రెస్టులో ఉన్నారు. అలాంటప్పుడు కూడా ఆమెను చూడ్డానికి యశ్వంత్ రాలేదని బంధువులు, చుట్టుపక్కల వారు చెబుతున్నారు. దీంతో భార్యను చూసుకోవడానికి విజయభాస్కర‌రెడ్డి పని మానేసి ఇంటి వద్దనే ఉంటున్నారు.



లక్ష్మీదేవి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిన్నిని నరికేసి.. 4 ముక్కలుగా చేసి..!

- గోనె సంచుల్లో కట్టి కాల్వల్లో పడేసిన వైనం
- విజయవాడలో దారుణం.. పోలీసుల అదుపులో తండ్రీకొడుకు



విజయలక్ష్మి (ఫైల్)

విజయవాడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భర్తను, కుమారుడిని వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లిపోయిందో మహిళ. దీనికి కారణం తన చిన్నమ్మేనని అప్పటి నుంచి రగిలిపోతున్నాడు ఆ ఇల్లాలి భర్త. ఆ కోపాన్ని 13 ఏళ్ల తర్వాత కొడుకుతో కలిసి తీర్చుకున్నాడు. ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి నరికి చంపి, నాలుగు ముక్కలుగా చేసి కాల్వల్లో పడేశాడు. విజయవాడలోని భవానీపురం హెచ్‌బీ కాలనీలో దసరా ముందు రోజు ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. భవానీపురం ఊర్మిళానగర్‌కు చెందిన పొత్తూరి విజయలక్ష్మి(65) కుమారుడితో కలిసి జీవిస్తోంది. కోడలు చనిపోవడంతో తల్లీకొడుకులిద్దరే ఇంట్లో ఉంటున్నారు. విజయలక్ష్మి అక్క కొడుకు వంకధార హనుమాన్‌జీ సుబ్రహ్మణ్యానికి భార్య హారిక, కుమారులు శ్రీమహావిష్ణు, ఇంటర్మీడియట్ చదువుతున్న 16 ఏళ్ల కుమారుడు, కుమార్తె శ్రీలక్ష్మి ఉన్నారు. భార్యభర్తల మధ్య వివాదాలు రావడంతో 2012వ సంవత్సరానికి ముందు ఆమె పెద్దకుమారుడిని, కుమార్తెనూ తీసుకుని తిరువూరు వద్ద ఉన్న కంభంపాడులోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో సుబ్రహ్మణ్యం అప్పటి నుంచి రెండో కుమారుడితో కలిసి ఉంటున్నాడు. దీనికి చిన్నమ్మే కారణమని నాటి నుంచి సుబ్రహ్మణ్యం రగిలిపోతున్నాడు. ఈనెల ఒకటో తేదీన విజయలక్ష్మి ఇంటికి వెళ్లాడు. మంచిగా మాట్లాడి ఆమెను బైకుపై హెచ్‌బీ కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. రెండో కుమారుడితో కలిసి ఇంట్లోనే పెద్ద కత్తితో మెడ నరికేశాడు. తర్వాత తండ్రీకొడుకులిద్దరూ కలిసి విజయలక్ష్మి శరీరాన్ని నాలుగు భాగాలుగా ముక్కలు చేశారు. వాటిని గోనె సంచుల్లో కుక్కి వేర్వేరు మురుగు కాల్వల్లో పడేశాడు. విజయలక్ష్మి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి తండ్రీకొడుకులను అదుపులోకి తీసుకుని విచారించగా విషయం వెలుగులోకి వచ్చింది.

నేడు స్వచ్ఛతా అవార్డుల ప్రదానం

» బెజవాడలో సీఎం చేతుల మీదుగా..

అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం స్వచ్ఛతా అవార్డులను ప్రదానం చేయనున్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ఉత్తమ పనితీరు కనబరచిన సంస్థలు, వ్యక్తులు, ప్రభుత్వ శాఖలకు అవార్డులు అందజేస్తారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమంలో నిర్వహించనున్నారు. మొత్తం 21 కేటగిరీల్లో రాష్ట్రస్థాయిలో 69 అవార్డులను సీఎం చేతుల మీదుగా ప్రదానం చేయనున్నారు. జిల్లా స్థాయిలో 1,257 అవార్డులను అందించనున్నారు. రాష్ట్రస్థాయిలో 6 మున్సిపాలిటీలు, 6 గ్రామ పంచాయతీలు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. స్వచ్ఛతకు పెద్దపీట వేసిన పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, స్వయం సహాయక సంఘాలకు కూడా సీఎం అవార్డులను ప్రదానం చేయనున్నారు.

కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు అయ్యన్న

అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బార్బడోస్‌లో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు హాజరుకానున్నారు. కామన్వెల్త్ దేశాల్లోని చట్టసభల సభాపతులు తమ అనుభవాలను పంచుకోడానికి, చట్టసభలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చర్చించడానికి కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు ఓ వేదికగా ఉంటోంది. 180 పార్లమెంటులు, శాసనవ్యవస్థలు ఈ సదస్సులో భాగస్వామ్యం కానున్నాయి. ఈ సమావేశాల్లో భారత ప్రతినిధి వర్గానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వం వహిస్తారు. ఏపీ నుంచి స్పీకర్ అయ్యన్నపాత్రుడుతోపాటు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర కూడా సదస్సుకు హాజరుకానున్నారు.

మేఘా కృష్ణారెడ్డికి మాతృవియోగం

» స్వగ్రామం దోకిపర్రులో అంతిమ సంస్కారాలు పూర్తి

» పలువురు ప్రముఖుల సంతాపం



హైదరాబాద్, గుడ్లవల్లేరు, అక్టోబరు 5(ఆంధ్ర జ్యోతి): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(ఎంఈఐఎల్) మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి తల్లి విజయలక్ష్మి (76) అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. దీంతో ఆమె భౌతిక కాయాన్ని వారి స్వగ్రామం ఏపీలోని కృష్ణా జిల్లా దోకిపర్రు గ్రామానికి తరలించారు. ఆమె పార్థివదేహాన్ని గ్రామస్థులు, పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్, రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు(నాని), మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, కృష్ణాజిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము తదితరులు నివాళులర్పించారు. అనంతరం దోకిపర్రు గ్రామంలో విజయలక్ష్మి అంతిమ యాత్ర నిర్వహించి సాయంత్రం అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు.

పుట్టపర్తిలో విజయ్ దేవరకొండ

» కుటుంబ సభ్యులతో కలిసి సత్యసాయి మహాసమాధి సందర్శన


పుట్టపర్తికి చేరుకున్న విజయ్ దేవరకొండ

పుట్టపర్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సినీనటుడు విజయ్ దేవరకొండ పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. తల్లిదండ్రులు, సోదరుడు ఆనంద్ దేవరకొండతో కలిసి ఆయన ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలోని పుట్టపర్తికి విచ్చేశారు. ప్రశాంతి నిలయంలో ఆయనకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు వర్గాలు స్వాగతం పలికాయి. అనంతరం సాయికుల్వంత్ మందిరానికి చేరుకుని సత్యసాయి మహాసమాధిని వారు దర్శించుకున్నారు. తర్వాత శాంతిభవనం వద్దకు చేరుకున్నారు. రాత్రికి ఇక్కడే బస చేసి సోమవారం ఉదయం హైదరాబాద్‌కు బయల్దేరనున్నారు. సినీనటి రష్మిక మందన్నతో విజయ్ దేవరకొండ వివాహం నిశ్చమైన నేపథ్యంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నట్లు చర్చ జరుగుతోంది.

పీహెచ్‌సీ వైద్యులకు 20% ఇన్‌సర్వీస్ కోటా

అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్ మేరకు పీజీ ఇన్-సర్వీస్ కోటాలో 20 శాతం సీట్లను కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. డీహెచ్ కార్యాలయంలో ఆందోళనలో ఉన్న పీహెచ్‌సీ వైద్యుల సంఘం నేతలతో ఆదివారం ఆయన చర్చించారు. వైద్యుల టైం బౌండ్ పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్, ఇతర సర్వీస్ వ్యవహారాల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన తెలిపారు. ఇన్ సర్వీస్ కోటా సీట్లను 15 శాతం నుంచి 20 శాతానికి పెంచుతామని, ఇందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుందని వెల్లడించారు. వెంటనే వైద్యులంతా విధుల్లో చేరాలని కోరారు. అయితే, 20 శాతం రిజర్వేషన్‌ను 2030 వరకూ కొనసాగించాలన్న తమ డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకరించనందున ఆందోళనలు యథావిధిగా కొనసాగిస్తామని వైద్యులు ప్రకటించి అక్కడ నుంచి నిష్క్రమించారు. వైద్యుల తీరు పట్ల కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే 20 శాతం సీట్ల కేటాయింపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తదుపరి సంవత్సరాల్లో ఈ కోటాను ఎలా అమలుచేయాలన్న దానిపై సమగ్రంగా అధ్యయనం చేసి, విధానపరమైన నిర్ణయాన్ని వచ్చే నెలలోగా తీసుకుంటుందని తెలిపారు. ఇన్ సర్వీస్ కోటా అమలుతో ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు సేవలు చేయాలనుకునే డైరెక్ట్ పీజీ వైద్యులకు అవకాశాలు తగ్గుతున్నాయన్నారు. వైద్యుల నియామక నోటిఫికేషన్లో ఎక్కడా కూడా ఇన్ సర్వీస్ కోటా పీజీ సీట్ల గురించి పేర్కొనలేదని చెప్పారు. టైం బౌండ్ పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్ల గురించి చర్చించి, ప్రభుత్వానికి సిఫారసులు చేసేందుకు ఇప్పటికే ప్రత్యేకంగా కమిటీ వేశామన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవల కోసమే: వైద్యులు

తాము కూడా పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకే సర్వీస్‌లోకి వచ్చామని వైద్యులు తెలిపారు. పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించే వైద్యులకు స్పెషాలిటీ ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందన్నారు. తాము పీజీ పూర్తి అయిన వెంటనే బోధనాస్పత్రుల్లో, సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరడం లేదని, ఇన్ సర్వీస్ కోటా పెంచడం వల్ల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందుతాయని చెప్పారు.

తిరుమల తరహాలో శ్రీశైలం అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించాల్సిందిగా కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ఈ నెల 16న ప్రధాని మోదీ శ్రీశైలానికి వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా, పర్యావరణహితంగా అన్ని రకాలుగా ఈ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు. అందుకోసం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రధానంగా శ్రీశైలానికి జాతీయ రహదారులను అనుసంధానం చేసేలా ఈ ప్రణాళికలు ఉండాలన్నారు. భక్తులు పెరుగుతున్నందున ఆలయ సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు అవసరమని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల నుంచీ లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున సౌకర్యాలు విస్తరించాలన్నారు. శబరిమల, ఇతర ప్రముఖ దేవాలయాల్లో సౌకర్యాలు పరిశీలించి అభివృద్ధి చేద్దామని సూచించారు. శ్రీశైలాన్ని ఆదర్శప్రాయ యాత్రాస్థలంగా తీర్చిదిద్దేందుకు దేవదాయ, అటవీ, పర్యాటక శాఖల నడుమ సమన్వయం అవసరమన్నారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపైనా అధికారులకు తగు సూచనలు చేశారు. ఆలయంలో మల్లికార్జునస్వామి దర్శనానికి భక్తులు వెళ్లేందుకు, బయటకు రావడానికి ఇప్పుడు ఒకే మార్గం ఉంది. బయటకు వచ్చేందుకు వేరే మార్గం ఏర్పాటుపైనా సమీక్షలో చర్చించారు.

‘తల్లికి వందనం’తో జీఎస్టీ జోష్!

(మొదటి పేజీ తరువాయి)

రూ.78వేల వరకు చేతికి రావడంతో వాటితో గృహోపకరణాలు, పిల్లలకు సైకిళ్లు, తమ జీవనోపాధికి ఆటోలు, గొర్రెలు, గేదెలు సైతం కొనుగోలు చేశారు. బైకులు, కొంత చేతిసొమ్ము కలిపి కాస్త బంగారం కొన్నవారు కూడా ఉన్నారు. దీంతో ప్రభుత్వానికి పన్ను రూపంలో ఆదాయం పెరిగింది. వైసీపీ హయాంలో ఇచ్చిన అమ్మఒడి పథకం కూడా కేవలం ఒక్క విద్యార్థికే ఇవ్వడం వల్ల ఆ డబ్బు స్కూలు ఖర్చులకు కూడా సరిపోయేది కాదు.

జీఎస్టీ వృద్ధి పైపైకి..

ఆగస్టులో నికర జీఎస్టీ రూ.2,977 కోట్లు రాగా.. అంతకుముందు నెలలో రూ.2,930 కోట్లు వచ్చింది. జూన్ 12 నుంచి ప్రభుత్వం తల్లికి వందనం పథకం డబ్బు తల్లుల ఖాతాల్లో వేయడం మొదలు పెట్టింది. జూన్‌లో నికర జీఎస్టీ 7.1 శాతం పెరిగి.. రూ.2,591 కోట్లు వసూలైంది. జూలైలో ఆ పెరుగుదల 12.12 శాతానికి, ఆగస్టులో రూ.14.38 శాతానికి పెరిగింది. లబ్ధిదారులు తమ పిల్లల స్కూలు ఖర్చులకు పోను మిగిలిన డబ్బుతో ఇంట్లోకి అవసరమైన వస్తువులు, వస్త్రాలు, గృహోపకరణాలు కొనడంతో.. దాని ప్రభావం నికర జీఎస్టీ పెరుగుదలలో కనిపిస్తోంది. రూ.10 వేల కోట్లకుపైగా ఖర్చుచేసిన ఈ భారీ సంక్షేమ పథకం ప్రజలకు సంతృప్తినివ్వడంతోపాటు ఖజానాకు ఆదాయం కూడా తెచ్చిపెట్టడం విశేషం. జీఎస్టీ పెరగడం అంటే రాష్ట్రంలో ఆర్థిక లావాదేవీలు ఊపందుకున్నట్లే లెక్క. ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వల్ల వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. దీంతో ఉత్పాదక రంగం మరింత మెరుగుపడుతుంది. కొత్త ఉపాధి అవకాశాలు పుట్టుకొస్తాయి. జీఎస్టీ వసూళ్లలో నమోదవుతున్న వృద్ధి దీనినే స్పష్టం చేస్తోంది. దీనికి తోడు ఇప్పుడు జీఎస్టీ 2.0 సంస్కరణలతో పలు వస్తువులపై పన్ను తగ్గడమో, తీసివేయడమో జరిగేటప్పటికి.. వాహనాలు, గృహోపకరణాల అమ్మకాలు సాధారణ స్థాయి కంటే ఎక్కువగా పెరిగాయి. నిత్యావసరాలు, ఔషధాలపై చాలా వరకు పన్ను పూర్తిగా ఎత్తేశారు. పైగా పండుగల సీజన్ కావడంతో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కూడా రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లలో వృద్ధి కొనసాగుతుందని నిపుణులు అంటున్నారు.

సొమ్ము సద్వినియోగం..

తల్లికి వందనం పథకం కింద ప్రభుత్వం జమచేసిన సొమ్మును సద్వినియోగం చేసుకుంటున్న తల్లిదండ్రులు అధికంగానే ఉన్నారు. పిల్లల పుస్తకాలు, బట్టలతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. కొందరు కొంత సొమ్ము బాకీల కింద చెల్లించారు. జీవనోపాధి కోసం ఆటోలు, గొర్రెలు, గేదెలు కొనుక్కున్నవారూ ఉన్నారు. పిల్లలకోసం చాలా మంది సైకిళ్లు కొన్నారు. ఇంకొందరు పిల్లలకు వైద్యం నిమిత్తం ఖర్చుచేశారు. మరికొందరు పోస్టాఫీసుల్లో పొదుపునకు శ్రీకారం చుట్టారు. సుకన్య యోజనలో పిల్లలకు డిపాజిట్ చేశారు. కొంత మంది బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ ఏడాది సొంత అవసరాల కోసం ఖర్చుచేసినవారిలో ఎక్కువ మంది.. వచ్చే ఏడాది అందే మొత్తాన్ని పిల్లల పేరిట డిపాజిట్ చేస్తామని చెప్పడం గమనార్హం.

గృహోపకరణాలు కొనుక్కున్నాం

మాది నిరుపేద కుటుంబం. తల్లికి వందనం పథకం ద్వారా అందిన డబ్బులతో పిల్లల చదువుకు అవసరమైన వాటితో పాటు కొన్ని చిన్నచిన్న సామాన్లు కొనుక్కోగలిగాం. నాకు మాధవి(5వ తరగతి), లోకేశ్(4వ తరగతి), కల్యాణ్(3వ తరగతి) ముగ్గురు పిల్లలు. ముగ్గురికీ కలిపి రూ.39 వేలు ఖాతాలో జమయ్యాయి. ఆ నగదుతో పిల్లలకు దుస్తులు, నోట్ పుస్తకాలు కొన్నాం. మరికొంత నగదుతో ఇంటికి అవసరమైన గృహోపకరణాలనూ కొనుక్కున్నాం.

- బాడితమాని గౌరి, గృహిణి, భోగాపురం, విజయనగరం జిల్లా

బాబుకు సైకిల్ కొనిచ్చా

నాకు ఇద్దరు పిల్లలు. కూటమి ప్రభుత్వం తల్లికివందనం పథకం కింద ఇద్దరికీ డబ్బు బ్యాంకులో పడింది. ఈ డబ్బును ముందుగా పిల్లల చదువుకు అవసరమైన పుస్తకాలు, బట్టలు, ఇంట్లోకి అవసరమైన సరుకులు కొనుగోలు చేశాం. మా బాబు స్కూలుకు వెళ్లేందుకు సైకిల్ కొనిచ్చా. ఒకేసారి ఇద్దరు పిల్లల పేరున వచ్చిన డబ్బును ఆయా అవసరాల కోసం ఖర్చు చేశాను. వచ్చే ఏడాది అందే సొమ్మును వృథా చేయకుండా.. వారి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని గట్టి నిర్ణయం తీసుకున్నాం.

- ఉమ్మలరాజు సుబ్బరాజు, ఓబులవారిపల్లె, అన్నమయ్య జిల్లా

లోకం తీరు



మెగా డీఎస్సీ టీచర్లకు సహకారం

అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న టీచర్లకు సర్వీసు అంశాల్లో సహకారం అందించేందుకు జిల్లాల వారీగా కన్వీనర్లను ఏర్పాటు చేసినట్లు ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాల వారీగా 13 మంది టీచర్లను తమ సంఘం తరఫున నియమించామన్నారు. వీరు కొత్త టీచర్లకు సర్వీసు అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు ఇతర సమస్యల పరిష్కారంలో సహకారం అందిస్తారని పేర్కొన్నారు.

నకిలీ మద్యం తీగ.. తెనాలిలో కదిలిన డొంక!

» వైసీపీ హయాం నుంచీ యథేచ్ఛగా రాకెట్

తెనాలి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో బయటపడిన భారీ నకిలీ మద్యం రాకెట్‌లో కీలక నిందితుల కోసం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వేట మొదలుపెట్టారు. అక్కడ తీగ లాగితే గుంటూరు జిల్లా తెనాలిలో వైసీపీ నేతల పాత్ర ఉన్న ఈ రాకెట్ డొంక కదులుతోంది. ముఖ్యంగా ఓ ప్రధాన వ్యక్తి పాత్రపై అనుమానంతో రెండ్రోజులుగా ఇక్కడ నిర్వహిస్తున్నారు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ రాకెట్‌ను ఈ నెల 3న కడప జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బహిర్గతం చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే తమిళనాడు, ఒడిశాతో పాటు మన రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ రాకెట్ వెనకున్న నలుగురు కీలక నిందితులు మాత్రం పరారీలో ఉన్నారు. వారిలో తెనాలి వాసి కొడాలి శ్రీనివాసరావు కూడా ఒకరు. ములకలచెరువులో ఈ రాకెట్ నడుపుతున్న పాత డాబా అద్దె ఒప్పందం ఇతడి పేరుపైనే ఉండడంతో ఈ కేసులో 12వ నిందితుడిగా చేర్చారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఆరా తీస్తుంటే.. విస్తుగొలిపే విషయాలు చాలానే వెలుగు చూస్తున్నాయని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ కాలం నుంచి ఈ రాకెట్ యథేచ్ఛగా సాగుతోందని, అప్పటి ప్రభుత్వ పెద్దల అండదండలతో సాగించిన దందాను.. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకుల అండతో కొనసాగిస్తున్నారని అంటున్నాయి. అప్పటి ఓ వైసీపీ కీలక నేతకు శ్రీనివాసరావు బంధువని, అతడి అండతోనే గత ప్రభుత్వంలోని ఐదేళ్లు గుంటూరు జిల్లా తెనాలి, గుంటూరు, బాపట్ల జిల్లా రేపల్లె, చెరుకుపల్లి, నిజాంపట్నంలో నకిలీ మద్యం సీసాలను ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరఫరా చేసి డబ్బు వెనకేసుకున్నట్లు తెలిసింది. అప్పట్లో శ్రీనివాసరావే ములకలచెరువు నుంచి కొంత, తెలంగాణ మద్యం మరికొంత తీసుకొచ్చి దుకాణాలకు అందించినట్లు చెబుతున్నారు. శ్రీనివాసరావు బంధువు కారులో ఈ మద్యం బాక్సులు తీసుకొచ్చి ప్రభుత్వ మద్యం దుకాణాలకు అందించేవాడు. ప్రస్తుతం అదే కారులో పరారయ్యాడని అనుమానిస్తున్నారు. తెనాలిలో ఒక్క కేసు కూడా లేకుండా చేసుకున్నాడని, వైసీపీ హయాంలో సాగించిన దందాను ఇప్పుడు కూడా నడుపుతున్నాడని అంటున్నారు. అయితే తెనాలి ప్రాంతంలో మద్యం సరఫరా చేసిన దాఖలాలు లేవని ఎక్సైజ్ అధికారులు చెబుతుండగా.. ఇప్పటికీ తెనాలి, గుంటూరు, రేపల్లె ప్రాంతాల్లో దుకాణాలకు ఆయా ప్రాంతాల్లోని టీడీపీ నేతల అండతో సాగిస్తున్నాడని కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం దుగ్గిరాల దగ్గర నకిలీ మద్యం లోడుతో ఒక ట్రక్ పట్టుబడిన వ్యవహారంలోనూ ఇతడి పాత్ర ఉందని కేసు నమోదైందని.. అయితే వైసీపీ నేతల అండతో అరెస్టు కాకుండా, కేసు మాఫీ చేసే ప్రయత్నాలు చేశాడని చెబుతున్నారు. కృష్ణా జిల్లాలోనూ ఇతడి ఎన్నారై బంధువుకు సంబంధించి 3 మద్యం దుకాణాలు ఉన్నాయని, వాటి ద్వారా కూడా నకిలీ మద్యం రాకెట్ నడిపినట్లు సమాచారం. ఈ దందాలో శ్రీనివాసరావే కీలక నిందితుడా.. లేక ఎవరైనా వైసీపీ నేతలకు బినామీగా ఉన్నాడా.. పెట్టుబడులు పెడుతున్న ఎన్నారైలకు బినామీగా వ్యవహరించాడా అనే దిశగా దర్యాప్తు జరుగుతోంది.

కొడాలి కేంద్రాలపై అధికారుల కన్ను!

తెనాలి ఐతానగర్‌లో శ్రీనివాసరావు కుటుంబం నివాసం ఉంటోంది. అందులో అధికారులు శని, ఆదివారాల్లో సోదాలు నిర్వహించారు. అతడు తన బంధువు వాహనంలో శనివారమే పరారైనట్లు సమాచారం రావడంతో అతడి స్వగ్రామం బాపట్ల జిల్లా గూడవల్లితో పాటు గుంటూరు, విజయవాడ నగరాల్లోని అతడి కేంద్రాలపై దృష్టిపెట్టినట్లు సమాచారం. ఇతడు పట్టుబడితే వైసీపీ ప్రభుత్వ కాలంలో జరిగిన నకిలీ మద్యం గుట్టు చాలావరకు బయటపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మారయ్యబాబు స్పందిస్తూ.. అన్నమయ్య జిల్లా అధికారులు సమాచారం ఇవ్వడంతో సోదాలు నిర్వహించామని.. శ్రీనివాసరావు ఇంటిలో ఎటువంటి మద్యం సీసాలూ దొరకలేదని తెలిపారు. అతడు కీలక నిందితుల్లో ఒకరు కావడంతో ముమ్మరంగా గాలింపు చేపట్టామని, గత చరిత్ర కూడా తెలుసుకునేందుకు లోతుగా విచారణ జరుపుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో నకిలీ మద్యం దందా నిర్వహించిన ఇతడి వెనుక ఎవరున్నారో తెలుసుకునేందుకు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

హామీలు బారెడు.. అమలు మూరెడు

» వైసీపీ, కూటమి ప్రభుత్వాలకు తేడా లేదు

» ఆటో డ్రైవర్లకు రెండూ మోసం: షర్మిల



అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికీ, కూటమి సర్కారుకూ తేడాలేదని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. గతంలో జగన్ 2.60 లక్షల మంది ఆటో డ్రైవర్లకు పదివేల రూపాయల చొప్పున ఇస్తే, కూటమి ప్రభుత్వం 2.90 లక్షల మందికి రూ.15 వేల చొప్పున ఇచ్చిందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోడ్రైవర్లను మోసం చేయడంలో దొందూదొందేనని విమర్శించారు. బ్యాడ్జి ఉన్న ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఇస్తామని కూటమి నేతలు మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో బ్యాడ్జీ కలిగిన ఆటో డ్రైవర్లు 13 లక్షల మంది ఉంటే, జగన్ అందులో పదిశాతానికి లోపే(యజమానులకు) అమలు చేశారని, ఇప్పుడు చంద్రబాబూ అదే విధానం అమలు చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలు బారెడుంటే, అమలు మాత్రం మూరెడేనని ఆరోపించారు. ఏ పథకాన్ని అమలు చేసినా సగంసగమేనని, అన్నింటా కోతలేనని ఆరోపించారు. ఆటో డ్రైవర్ అన్నలకు చంద్రబాబు చేసింది ఘరానా మోసమేనన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, ఎన్నికల్లో ఊదర గొట్టిన ప్రసంగాలకు పొంతనే లేదని విమర్శించారు. కూటమి నేతలు ఖాకీ చొక్కాలు వేసుకుని, ఆటోల్లో తిరుగుతూ ఫొటోలకు పోజులిచ్చారని, డ్రైవర్ అన్నలకు మసిపూసి మారేడు కాయ చేశారని ఆరోపించారు.

నకిలీ మద్యం.. ఇద్దరు టీడీపీ నేతలపై వేటు

తంబళ్లపల్లి ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, కట్టా సురేంద్ర నాయుడు సస్పెన్షన్


జయచంద్రారెడ్డి

అమరావతి/రాయచోటి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో వెలుగు చూసిన నకిలీ మద్యం వ్యవహారంపై టీడీపీ అధిష్ఠానం సీరియస్ అయింది. ఈ విషయంలో టీడీపీ నాయకుల ప్రమేయంపై వివరాలు తెప్పించుకున్న టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు... ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ మేరకు తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రా రెడ్డితో పాటు స్థానిక టీడీపీ నేత కట్టా సురేంద్ర నాయుడును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ పల్లా ఆదివారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. ఈ ఇద్దరి ప్రమేయంపై సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.

పెద్దిరెడ్డి కుటుంబానికి సన్నిహితుడు

నకిలీ మద్యం వ్యవహారంలో జయచంద్రారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రాజేశ్, సన్నిహితుడు జనార్దన్‌రావు, సమీప బంధువుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారిపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం జయచంద్రారెడ్డి, కేసులో ఏ-1గా ఉన్న జనార్దన్‌రావు దక్షిణాఫ్రికాలో ఉన్నట్లు తెలిసింది. జయచంద్రారెడ్డి వ్యవహారం మొదట నుంచీ వివాదాస్పదంగానే ఉందని చెబుతున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి సన్నిహితుడిగా.. దక్షిణాఫ్రికాలో ఆ కుటుంబంతో వ్యాపార లావాదేవీలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ.. టీడీపీ అధిష్ఠానం 2024 ఎన్నికల్లో జయచంద్రారెడ్డికి తంబళ్లపల్లె టికెట్ ఇచ్చింది. 10వేలకు పైగా ఓట్లతో ఆయన ఓడిపోయారు. ఎన్నికల్లో గెలుపు కోసం ఆయన ఏమాత్రం కృషి చేయలేదని అప్పట్లో టీడీపీ వర్గాలు ఆరోపించాయి. పైగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నుంచీ నియోజకవర్గంలో అన్ని వర్గాలనూ సమన్వయం చేసుకుని వెళ్లడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు నకిలీ మద్యం వ్యవహారం ఆయన మెడకు చుట్టుకోవడంతో అధిష్ఠానం ఆయనపై వేటు వేసింది.

విజయవాడ బార్ లైసెన్సీనే సూత్రధారి!

» ఉపేక్షించొద్దు: సీఎం చంద్రబాబు

ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంలో విజయవాడకు చెందిన బార్ లైసెన్సీ అద్దేపల్లి జనార్దన్‌రావు ప్రధాన సూత్రధారి అని ఎక్సైజ్ శాఖ స్పష్టంచేసింది. ఆయన ఒక బృందాన్ని ఎ తయారుచేసి ఈ తంతంగాన్ని నడిపించాడని తెలిపింది. ఈ అంశంపై సీఎం చంద్రబాబు ఆదివారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా, డైరెక్టర్ సీహెచ్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ కేసు వివరాలను సీఎంకు వివరించారు. ములకలచెరువులో మొదట పట్టుబడిన కొందరిని విచారించి సోదాలు నిర్వహించగా కుదిరినత్తునికోట గ్రామంలో నకిలీ మద్యం తయారీ కేంద్రం బయటపడిందని చెప్పారు.

ఇందులో 14 మందిని గుర్తించి 10 మందిని అరెస్టు చేశామని తెలిపారు. విజయవాడలోని బార్ లైసెన్సీ అద్దేపల్లి జనార్దన్‌రావును ఎ1గా గుర్తించామన్నారు. నకిలీ మద్యం దందా కోసమే అతను ములకలచెరువు వచ్చాడని, అక్రమంగా తయారుచేసిన మద్యాన్ని పెద్దతిప్పసముద్రంలోని ఆంధ్రా వైన్స్, ములకలచెరువులోని రాక్‌స్టార్ వైన్స్‌లో విక్రయించాడని వివరించారు. తమిళనాడుకు చెందిన నలుగురిని, ఒడిశాకు చెందిన కొందరిని ఈ అక్రమాల కోసం నియమించుకున్నాడని తెలిపారు. జనార్దన్‌రావు ఆదేశాలతోనే నకిలీ మద్యం తయారు చేసినట్లు మిగిలిన నిందితులు అంగీకరించారని వెల్లడించారు. రాక్‌స్టార్ వైన్స్ లైసెన్సీ టి.రాజేశ్ వాహనంలోనే ఈ నకిలీ మద్యం పట్టుబడిందని, రెండు వైన్ షాపుల్లో సోదాలు నిర్వహించి సీజ్ చేశామని పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు ప్రస్తుతం విదేశాల్లో ఉన్నాడని, స్థానిక నాయకుడు జయచంద్రారెడ్డి పాత్రపైనా పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామన్నామని వివరించారు. నకిలీ మద్యం తయారీ కేంద్రానికి కొందరు స్థానికుల సహకారం కూడా ఉందని గుర్తించామని చెప్పారు. ఎ1తో పాటు ఎ2 కొట్టా రాజు, ఎ5 పి.రాజేష్, ఎ12 కె.శ్రీనివాసులును అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. అన్ని కోణాల్లో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టొద్దని, నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు.

ఏపీపీఎస్సీలో ‘లీకు’ వీరుడు!

(మొదటి పేజీ తరువాయి)

జాబితాలు విడుదల చేయాలా?. వద్దా?. గ్రూప్-2 అభ్యర్థులకు పోస్టు ప్రాధాన్యత ఎంపికకు మరో అవకాశం ఇవ్వాలా? వద్దా?. ఉద్యోగాల భర్తీలో కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తే బాగుంటుంది?. అపాయింట్‌మెంట్‌కు ముందా? తర్వాతా?." అంటూ.. టెలిగ్రామ్‌లో పోల్ నిర్వహిస్తున్నారు. అంతేకాదు ఏపీపీఎస్సీ ప్రకటించాల్సిన పలు అధికారిక నిర్ణయాలు ముందుగానే ఆయన టెలిగ్రామ్ గ్రూప్‌లో ప్రకటిస్తున్నారు. ప్రభుత్వానికి గోప్యంగా పంపే కీలక ప్రతిపాదనలనూ టెలిగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నారు. ఒక్కముక్కలో చెప్పాలంటే అనధికారికంగా ఆయన మరో వ్యవస్థను నడుపుతున్నారు. కమిషన్‌లో సభ్యుడిగా ఉంటూ ఇలా పోల్స్ నిర్వహించడం, అధికారిక నిర్ణయాలు, ప్రతిపాదనలను బహిర్గతం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై నిరుద్యోగుల సంఘం ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. మరోవైపు ఆయన నిర్వహిస్తున్న పోల్స్‌తో అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు.

అప్పట్లో ట్విట్టర్..

గత వైసీపీ ప్రభుత్వంలో పరిగె సుధీర్ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. 'సమాజ సేవ'(సోషల్ సర్వీస్) కోటాలో ఆయన ఏపీపీఎస్సీలోకి వచ్చారు. మాజీ సీఎం జగన్‌కు బంధువు అని ప్రచారం ఉంది. కమిషన్ నిబంధనల ప్రకారం ఛైర్మన్, కార్యదర్శిలు మాత్రమే అధికారిక నిర్ణయాలు ప్రకటించాలి. కానీ, ఆయన కమిషన్ సభ్యుడిగా నియామకం అయినప్పటి నుంచీ సోషల్ మీడియా వేదికగా అనధికారికంగా కమిషన్ నిర్ణయాలు ప్రకటిస్తూ వస్తున్నారు. గత ప్రభుత్వంలో 'ట్విట్టర్' వేదికగా కమిషన్ నిర్ణయాలను ప్రకటించేవారు. పరీక్షల తేదీలు, నిర్వహణలో మార్పులు లాంటి అధికారిక సమాచారం అంతా ఆయన ట్విట్టర్‌లో ముందుగానే వెల్లడించేవారు. ఆ తర్వాత కమిషన్ అధికారికంగా ప్రకటనలు జారీచేసేది. ప్రభుత్వం మారిన తర్వాత టెలిగ్రామ్ గ్రూప్ సృష్టించారు. దీనిలో ప్రస్తుతం 3,600 మంది నిరుద్యోగులు ఉన్నారు. కమిషన్ నిర్ణయాలు, ప్రతిపాదనలు అన్నీ ఆయన దీనిలో పోస్టు చేస్తున్నారు. కమిషన్ కంటే ముందుగానే నిర్ణయాలు ప్రకటించడమే తప్పయితే, అసలు గోప్యంగా ఉంచాల్సిన ప్రతిపాదనలు కూడా బహిర్గతం చేస్తున్నారు. దీంతో రాబోయే నోటిఫికేషన్లు ఎలా ఉంటాయో, ఎలాంటి మార్పులు వస్తాయోనని అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. ఆయన స్వయంగా కమిషన్‌లో సభ్యుడు కావడంతో ఎక్కువ మంది నిరుద్యోగులు ఆయన ప్రకటనలు నమ్ముతున్నారు. అలాగే ఛైర్‌పర్సన్ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై అనధికారికంగా పోల్స్ నిర్వహించడంపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. పోల్స్‌లో నిరుద్యోగుల అభిప్రాయాలను ఛైర్‌పర్సన్‌కు వివరించి సానుకూల నిర్ణయం వచ్చేలా చూస్తానని హామీలూ ఇస్తున్నారు.

ఉద్యోగ సమాచారం చెప్పేస్తారు!

ఇక ఉద్యోగం వస్తుందా? రాదా? అనే సమాచారాన్ని ఎవరైనా వ్యక్తిగతంగా మెసేజ్ చేసి అడిగితే సుధీర్ సమాధానం చెబుతున్నారని నిరుద్యోగులు చెబుతున్నారు. ఈ క్రమంలో కమిషన్ అధికారికంగా ప్రకటించాల్సిన ఫలితాలను ముందే ఎలా చెప్పగలుగుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే గ్రూప్-2 రాసిన కొందరు అభ్యర్థులతో ఆయన ఇటీవల సమావేశమైన ఫొటోలు వెలుగు చూశాయి. కమిషన్ నిబంధనల ప్రకారం ఛైర్‌పర్సన్ లేదా కార్యదర్శిని మాత్రమే నిరుద్యోగులు సమస్యలు, సందేహాలపై కలుస్తారు. సభ్యులను నిరుద్యోగులు కలవరు. కానీ, ఆయన్ను ఎందుకు కలిశారని నిరుద్యోగుల సంఘం ప్రశ్నిస్తుండడం గమనార్హం.


డార్జిలింగ్‌లో వరద బీభత్సానికి ధ్వంసమైన రోడ్డు

డార్జిలింగ్‌లో వరుణుడి బీభత్సం

- భారీ వర్షాలకు వరదలు, విరిగిపడ్డ కొండచరియలు
- వేర్వేరు ప్రాంతాల్లో 20 మంది దుర్మరణం

డార్జిలింగ్, అక్టోబరు 5 : పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం డార్జిలింగ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల వల్ల డార్జిలింగ్, ఆ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వరద పోటెత్తగా, చాలా చోట్ల పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో డార్జిలింగ్, ఆ జిల్లాలోని మిరీక్ సహా ఇతర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన ఘటనల్లో పలువురు చిన్నారులు సహా 20 మంది ప్రాణాలు కోల్పోయారు.ఒక్క మిరీక్ ప్రాంతంలోనే 11 మంది ప్రాణాలు కోల్పోగా ఏడుగురు గాయపడ్డారని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రకటించాయి. మిరీక్, సిలిగురి ప్రాంతాలను కలిపే బాలాసోన్ నదిపై దుదియాలో ఉన్న ఓ వంతెన కూలిపోయింది. దీంతో పరిసర ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా తెగిపోయాయి. కొండచరియలు విరిగి పడడంతో పెద్ద సంఖ్యలో ఇళ్లు ధ్వంసమై చాలా మంది నిరాశ్రయులవ్వగా.. పలువురి ఆచూకీ గల్లంతయింది. వర్షాలకు తోడు కొండచరియలు విరిగి పడుతుండడంతో డార్జిలింగ్‌లోని పర్యాటక ప్రదేశాలను తాత్కాలికంగా మూసేశారు. డార్జిలింగ్ అందాలను చూసేందుకు వచ్చిన వేల మంది పర్యాటకులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయారు. సోమవారం వరకు డార్జిలింగ్‌లో భారీ వర్షాలు కొనసాగుతాయనే వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోపక్క, భూటాన్‌లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశముందనే హెచ్చరికలు కూడా ఉన్నాయి. కాగా, డార్జిలింగ్‌లో విపత్కర పరిస్థితిపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరోవైపు, నేపాల్‌లోనూ భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో నేపాల్‌లో 51 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఎయిరిండియా విమానానికి తప్పిన ముప్పు!

ముంబై, అక్టోబరు 5: ఎయిరిండియాకు చెందిన మరో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. అమృత్‌సర్-బర్మింగ్‌హామ్ మధ్య నడిచే బోయింగ్ 787లో అత్యవసర పరిస్థితుల్లో తెరచుకునే ర్యామ్ ఎయిర్ టర్బైన్ (ర్యాట్) తెరచుకుంది. శనివారం (ఈ నెల 4న) విమానం బర్మింగ్‌హామ్‌లో ల్యాండ్ కావడానికి ముందు ర్యాట్ తెరచుకున్నట్లు, అయితే విమానం సురక్షితంగా ల్యాండ్ అయినట్లు ఎయిరిండియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, విమానంలో ప్రధానమైన ఎలక్ట్రికల్, హైడ్రాలిక్ వ్యవస్థలు పనిచేయని సందర్భంలోనే ర్యాట్ తెరచుకుంటుంది. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో ప్రమాదానికి గురైన ఎయిరిండియా బోయింగ్ 787 విమానానికి కూడా ర్యాట్ తెరుచుకోగా.. ఆ వెంటనే అది కూలిపోయింది. ఈ ఘటనలో 260 మంది చనిపోయారు. ఈ నేపథ్యంలో దేశంలోని బోయింగ్ 787 విమానాలన్నింట్లోనూ ఎలక్ట్రికల్ వ్యవస్థను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని భారత పైలట్ల సమాఖ్య (ఎఫ్ఐపీ) కోరింది. ఈ మేరు ఆదివారం డీజీసీఏకు లేఖ రాసింది.

ఆక్రమణలో ఉన్న గదిని స్వాధీనం చేసుకోవాలి

- పీఓకేపై భాగవత్ పరోక్ష వ్యాఖ్యలు

సాత్నా, అక్టోబరు 5: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను తిరిగి స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆరెస్సెస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ పరోక్షంగా చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని సాత్నాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీఓకేని ఇంటిలోని ఓ గదితో సరిపోల్చారు. "మొత్తం భారత దేశం ఓ ఇల్లు. కొందరు మన ఇంటిలో ఓ గదిని లేకుండా చేశారు. ఆ గదిలోనే నా టేబులు, కుర్చీ, దస్తులను పెట్టుకునేవాడిని. దాన్ని వారు ఆక్రమించుకున్నారు. రేపయినా దాన్ని తిరిగి తెచ్చుకోవాలి గదా! దీని ద్వారా మనం అవిభాజ్య భారత దేశాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి" అని అన్నారు. సమావేశానికి హాజరయిన సింధీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ విభజన సందర్భంగా వారు పాకిస్థాన్‌ను కాకుండా భారత్‌ను ఎంచుకున్నారని చెప్పారు. "పరిస్థితుల కారణంగా వారు ఇక్కడికి వచ్చారు. ఆ ఇల్లు, ఈ ఇల్లు వేరువేరు కాదు" అని అన్నారు.

హమాస్ ఇంకా ఆలస్యం చేయవద్దు: ట్రంప్

వాషింగ్టన్ డీసీ, గాజా, అక్టోబరు 5: గాజా శాంతి ప్రణాళికపై వేగంగా నిర్ణయం తీసుకోకపోతే గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హమాస్‌ను మరోమారు హెచ్చరించారు. గడువులోగా స్పందించకపోతే నరకం చూపిస్తామని, మునుపెన్నడూ చూడనంతగా దాడులు చేస్తామని ఆయన ఇప్పటికే హెచ్చరించారు. గాజా నుంచి బలగాలను ఉపసంహరించేందుకు ఇజ్రాయెల్ కూడా అంగీకరించిందని, హమాస్ ఇక ఆలస్యం చేయవద్దని ట్రంప్ సూచించారు. ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల్లో నిరాయుధీకరణ, గాజాపై అధికారాన్ని వదులుకోవడంపై హమాస్ విభేదిస్తోంది. మరోవైపు, ఈజిప్టులో కొద్ది గంటల్లో జరిగే శాంతి చర్చల కోసం ఇజ్రాయెల్ తన ప్రతినిధులను ఇప్పటికే పంపగా అమెరికా నుంచి ట్రంప్ తన అల్లుడు జరేద్ కుష్నర్‌ను, ప్రత్యేక రాయబారి విట్కాఫ్‌ను తన ప్రతినిధులుగా పంపారు.

చెక్కుపై తప్పులు రాసిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

సిమ్లా, అక్టోబరు 5: చెక్కుపై తప్పులుతడకగా స్పెల్లింగ్‌లు రాసిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. సర్మౌర్ జిల్లా రోహనత్‌లోని ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాలలో డ్రాయింగ్ టీచరుగా పని చేస్తున్న అత్తర్ సింగ్‌పై ఈ చర్యలు తీసుకున్నారు. ఆయన గత నెల 25న రూ.7,616కు చెక్కు రాశారు. అక్షరాల్లో 'సావెన్ థర్స్‌డే సిక్స్ హరేంద్ర సిక్స్‌టీ' అని రాశారు. సిక్స్ అన్న పదానికి తప్పించి మిగిలిన పదాల స్పెల్లింగ్‌లన్నీ తప్పులే. ఇందుకు సంబంధించిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ స్పందించారు. ఆ ఉపాధ్యాయుడితో పాటు, పాఠశాల ప్రిన్సిపల్‌ను పిలిపించి మాట్లాడారు. శ్రద్ధగా చూడకపోవడం వల్ల అనుకోకుండా ఆ తప్పు జరిగినట్టు ఆ ఉపాధ్యాయుడు ఇచ్చిన వివరణతో ఆయన ఏకీభవించలేదు.

క్షయ నిర్ధారణ ఇక తేలిక..!

- రెండు కొత్త స్వదేశీ పరికరాలకు ఐసీఎంఆర్ ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబరు 5: క్షయ వ్యాధిపై పోరాటంలో కీలక ముందడుగు పడింది. తక్కువ ఖర్చుతో వేగంగా క్షయ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వీలుగా దేశీయంగా అభివృద్ధి చేసిన రెండు కొత్త సాధనాలకు ఐసీఎంఆర్ ఆమోదం తెలిపింది. తక్కువ ఖర్చుతోనే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు... క్వాంటీప్లస్ ఎంటీబీ ఫాస్ట్ డిటెక్షన్ కిట్, యూనిఏఎంపీ ఎంటీబీ న్యూక్లియిక్ యాసిడ్ టెస్ట్ కార్డ్ అనే పరికరాలను తెలంగాణకు చెందిన హువెల్ లైఫ్‌సైన్సెస్ దేశీయంగా అభివృద్ధి చేసిందని ఐసీఎంఆర్ వెల్లడించింది. క్వాంటీప్లస్.. టీబీని గుర్తించడానికి ఆమోదం పొందిన తొలి ఓపెన్ సిస్టమ్ ఆర్‌టీ-పీసీఆర్. ఎందుకంటే ఇది ఇప్పటికే ఉన్న ఇతర పీసీఆర్ పరికరాల్లోనూ పనిచేస్తుంది. దీనిసాయంతో టీబీ పరీక్షను తక్కువ ఖర్చుతో, వేగంగా నిర్వహించవచ్చని ఐసీఎంఆర్ వర్గాలు వెల్లడించాయి. క్వాంటీప్లస్ ఒకేసారి 96 నమూనాలను పరీక్షించగలదని పేర్కొన్నాయి. ఇతర పద్ధతుల్లో టీబీ నిర్ధారణ పరీక్షకయ్యే వ్యయంతో పోలిస్తే క్వాంటీప్లస్ వల్ల ఖర్చు ఐదింతలు తగ్గుతుందని తెలిపాయి. కాగా, ఐసీఎంఆర్ ఆమోదించిన మరో స్వదేశీ ఆవిష్కరణ యూనిఏఎంపీ ఎంటీబీ న్యూక్లియిక్ యాసిడ్ టెస్ట్ కార్డ్‌ను కూడా హువెల్ లైఫ్‌సైన్సెస్ అభివృద్ధి చేసింది. ఈ రెండు పరికరాల ద్వారా కఫం నమూనాలకు బదులుగా నాలుకపై ఉండే ఉమ్ముతో టీబీ నిర్ధారణ చేయవచ్చని ఆ వర్గాలు తెలిపాయి.

బిహార్ ఎన్నికలు నవంబరు 22లోపే

ఛఠ్ పూజలాగే ఉత్సాహంగా పాల్గొనాలి

- ఓటర్లకు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ పిలుపు
- ఎన్నికల సన్నద్ధతపై పట్నాలో సమీక్ష



న్యూఢిల్లీ, అక్టోబరు 5: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు.. శాసనసభ పదవీకాలం ముగిసే నవంబరు 22వ తేదీలోపే జరుగుతాయని ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ స్పష్టంచేశారు. ఛఠ్ పూజ(ఈ నెల 25 నుంచి 28 వరకు) మాదిరిగానే ఓటింగ్‌లోనూ ఆనందోత్సాహాలతో పాల్గొనాలని రాష్ట్ర ఓటర్లకు పిలుపిచ్చారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేశామన్నారు. ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)ను చట్టబద్ధంగానే చేపట్టామని చెప్పారు. త్వరలోనే దీనిని దేశవ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. రెండ్రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం రెండో రోజు ఆదివారం ఆయన పట్నాలో సహచర ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలతో కలిసి అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బూత్ స్థాయి అధికారు(బీఎల్‌వో)లు కూడా దీనికి హాజరయ్యారు. బిహార్ ఎన్నికలతో మొదలయ్యే పలు సంస్కరణలను సీఈసీ విశదీకరించారు. ఇక నుంచి ఈ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా పోలింగ్ కేంద్రానికి 1,200 మంది మాత్రమే ఓటర్లు ఉంటారని చెప్పారు. 'బిహార్లోని వైశాలి ప్రపంచానికే ప్రజాస్వామ్య మార్గాన్ని ఎలా చూపిందో.. అదే విధంగా ఓటర్ల జాబితాల ప్రక్షాళనలో వీరు దేశానికే స్ఫూర్తిగా నిలిచారు' అని కొనియాడారు. ప్రతి ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాల సవరణ ప్రజాప్రాతినిధ్య చట్టప్రకారం చట్టబద్ధమేనని.. ఎన్నికలు ముగిశాక సవరించడం కుదరదని గుర్తుచేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సెప్టెంబరు 30న ఓటర్ల జాబితాను ప్రచురించామని.. చేర్పులు, తొలగింపులపై అభ్యంతరాలున్నా.. అర్హులైనవారిని చేర్చకపోయినా.. అభ్యంతరాలు తెలియజేసేందుకు ఇప్పటికీ పది రోజుల వ్యవధి ఉందని చెప్పారు. అన్ని అభ్యంతరాలను ఓటర్ నమోదు అధికారు(ఈఆర్‌వో)ల స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. నామినేషన్లు మొదలు కాగానే ఓటర్ల జాబితా నిశ్చలంగా ఉంటుందని.. ఎన్నికల ప్రక్రియ ముగిసేదాకా అందులో మార్పులకు ఆస్కారం ఉండదన్నారు.

పారదర్శకత కోసం 17 సంస్కరణలు..

ఎన్నికల ప్రక్రియలో నిష్పాక్షికత, పారదర్శకత కోసం 17 సంస్కరణలను బిహార్ ఎన్నికల నుంచే ఎన్నికల కమిషన్ శ్రీకారం చుడుతోందని జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. వీటిలో పోలింగ్ సందర్భంగా కొన్ని, ఓట్ల లెక్కింపు సమయంలో కొన్ని అమలవుతాయన్నారు. ఇకపై ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండరని స్పష్టంచేశారు. ప్రస్తుతం 1,500 మంది ఓటర్లు ఉంటున్నారు. తాజా సవరణతో బిహార్లో ఇప్పుడున్న 77,895 పోలింగ్ కేంద్రాలు 90,712కి పెరుగుతాయి.

- బీఎల్‌వోలు గుర్తింపు కార్డులు ధరించడం తప్పనిసరి. ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ కేంద్రాల వెలుపల ఓటర్లు తమ మొబైల్ ఫోన్లను డిపాజిట్ చేసేందుకు ఒక కేంద్రం ఏర్పాటుచేస్తారు.
- ఎన్నికల గుర్తు ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఈవీఎంలోని బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థి ఫొటో బ్లాక్ అండ్ వైట్‌లో ఉంటోంది. వారిని గుర్తించడం కష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఫొటోలు ఇక కలర్‌లో ఉంటాయి. బిహార్‌తో మొదలుపెట్టి ఇక దేశవ్యాప్తంగా ఇదే అమలవుతుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఉంటారో ప్రిసైడింగ్ అధికారి ఇచ్చే ఫాం-17సీకి, ఈవీఎం కౌంటింగ్ యూనిట్‌లో పోలైన ఓట్లల సరిపోలనప్పుడు వీవీప్యాట్లన్నిటినీ పూర్తిగా లెక్కిస్తారు.
- ఇక మీదట ఓట్ల లెక్కింపులో తుది రెండు రౌండ్ల ముందు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఓట్లను రీకౌంట్ చేస్తారు.

ఆధార్ గుర్తింపు కార్డు మాత్రమే..

గుర్తింపు ధ్రువపత్రాల్లో ఆధార్‌ను చేర్చడంపై జ్ఞానేశ్‌కుమార్ స్పష్టత ఇచ్చారు. అది గుర్తింపు కార్డు మాత్రమేనన్నారు. అదీగాక ఆధార్ నంబర్ ఇవ్వాలని ఎన్యుమరేషన్ ఫాంలో ఎన్నికల కమిషనే కోరిందని గుర్తుచేశారు. 'సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. ఆధార్ చట్టం కింద కూడా ఆధార్ కార్డును పుట్టినరోజు, చిరునామా, పౌరసత్వాలకు ధ్రువీకరణగా పరిగణించడానికి వీల్లేదు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 26వ సెక్షన్ ప్రకారం అది ఐచ్ఛికం మాత్రమే' అని ఆయన వివరించారు.

బిహార్ అసెంబ్లీలో ప్రస్తుత బలాలు..
మొత్తం అసెంబ్లీ స్థానాలు : 243
ఎన్డీఏ -138 (బీజేపీ-84, జేడీయూ-48, హెచ్ఏఎం-4, స్వతంత్రులు-2)
మహాకూటమి -103 (ఆర్జేడీ-71, కాంగ్రెస్-17, సీపీఐఎంఎల్-లిబరేషన్-11, సీపీఎం-2, సీపీఐ-2)
ఇతరులు -2 (ఎంఐఎం-1, స్వతంత్ర-1)

కులగణన వెంటనే ఆపండి

- అదో పిచ్చోళ్ల సంతలా ఉంది: సోమణ్ణ

బెంగళూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో చేపడుతున్న కులగణన సర్వేను వెంటనే ఆపాలని, అదో పిచ్చోళ్ల సంతలా మారిందని కేంద్రమంత్రి సోమణ్ణ మండిపడ్డారు. ఆదివారం బెంగళూరు విజయనగర్‌లోని నివాసం వద్ద మంత్రి మీడియాతో మాట్లాడారు. సర్వే చేసేందుకు వచ్చిన ఉద్యోగులు తన ఒక్కడి సమాచారాన్ని గంటకుపైగా సేకరించారని తెలిపారు. ఇలా రాష్ట్ర మంతటా ఉండే ఏడు కోట్ల మంది వివరాలను కేవలం 15 రోజుల్లో సేకరించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇదో అశాస్త్రీయత సర్వే అంటూ కొట్టిపారేశారు.

లోకాయుక్త వలలో కర్ణాటక విద్యుత్ మంత్రి ఓఎస్‌డీ

బెంగళూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్‌కు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీకి లంచం తీసుకుంటూ కర్ణాటక విద్యుత్‌శాఖ మంత్రి ఓఎస్‌డీ లోకాయుక్త అధికారులకు పట్టుబడారు. ఓఎస్‌డీతోపాటు కారు డ్రైవర్‌ను అరెస్టు చేశారు. కేపీటీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అయిన జ్యోతిప్రకాష్ ప్రస్తుతం విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్‌కు ఓఎస్‌డీగా సేవలు అందిస్తున్నారు. లేఅవుట్‌కు కరెంటు కనెక్షన్ కోసం బ్యాడరహళ్లి నివాసి కేఎం అనంతరాజు దరఖాస్తు చేసుకోగా, ఎన్‌ఓసీ మంజూరు చేసేందుకు జ్యోతిప్రకాష్ లక్ష రూపాయల లంచం డిమాండ్ చేశారు. దీంతో అనంతరాజు లోకాయుక్త అధికారులను ఆశ్రయించారు.

భారత్‌ను సమాధి చేస్తాం

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్

న్యూఢిల్లీ, అక్టోబరు 5: పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ భారత్‌పై మరోసారి నోరు పారేసుకున్నారు. భారత్‌ను దాని యుద్ధ విమానాల శిథిలాల కిందే సమాధి చేస్తామంటూ 'ఎక్స్'లో చేసిన ట్వీట్‌లో ప్రగల్భాలు పలికారు. పాక్‌ను ప్రపంచ పటం నుంచి తుడిచేస్తామంటూ భారత సైనికాధికారులు, రాజకీయ నాయకులు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఆపరేషన్ సిందూర్‌లో 0-6 తేడాతో భారత్ ఓడిపోయిందని, ఇంకా తమపై యుద్ధానికి ప్రయత్నిస్తే పాక్ స్కోరు మరింత మెరుగుపడుతుందని ఖవాజా వ్యాఖ్యానించారు.

ఆయుర్దాయంలో మనం వెనుకే!



- జపనీయులు 85 ఏళ్లు.. భారతీయులు 72 ఏళ్లే..
- రోజువారీ అలవాట్లు, తినే ఆహారంలో తేడానే కారణం

న్యూఢిల్లీ, అక్టోబరు 5: ప్రపంచవ్యాప్తంగా దీర్ఘాయుష్షుతో జీవించే ప్రజలు ఎవరంటే.. జపనీయులే అని చెబుతాం..? జపాన్‌లో మనిషి సగటు ఆయుర్దాయం 85 ఏళ్లు. అయితే వారితో పోలిస్తే భారతీయుల ఆయుర్దాయం 13 ఏళ్లు తక్కువగా ఉందని తాజా డేటాలో వెల్లడైంది. జపనీయులు అంత ఎక్కువకాలం జీవించడానికి, భారతీయుల జీవితకాలం 75 ఏళ్లకు తగ్గిపోవడానికి రోజువారీ అలవాట్లు, తినే ఆహారమే కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆహారం, పని, నిద్ర వంటి వాటిలో చిన్నచిన్న మార్పులు చేసుకుంటే ఎవరైనా మరింత ఎక్కువ కాలం హాయిగా జీవించొచ్చంటున్నారు.

నిశ్చల జీవితం..!

జపాన్‌లో ఒకచోటు నుంచి మరొక చోటుకి వెళ్లాలంటే ఎక్కువగా నడిచే వెళ్తారు. సైకిల్ తొక్కడం వారి దినచర్యలో భాగం. వాళ్లు రోజూ 7వేల నుంచి 10 వేల అడుగుల దూరం నడుస్తారు. కానీ.. భారత్‌లో ఎక్కడికైనా వెళ్లాలంటే.. కారు, క్యాబ్, లేదంటే బైక్ వినియోగిస్తారు. పట్టణాల్లో ఉండే వాళ్లయితే రోజుకు కనీసం 3వేల అడుగులు కూడా వేయడం లేదు. జపాన్ వాళ్లు బ్రేక్‌ఫాస్ట్‌లో మిసో సూప్, రైస్, గ్రిల్డ్ ఫిష్‌తో పాటు ప్రొటీన్లు అధికంగా ఉండేలా చూసుకుంటారు. భారత్‌లో అల్పాహారం అంటే.. నెయ్యి, వెన్నతో కూడి పరోటాలు, కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే వంటకాలు ఉంటాయి. వీటి వల్ల ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు ఎక్కువవుతాయి.

పని ఒత్తిడి..

జపాన్‌లో పనికి అధిక ప్రాధాన్యమిస్తారు. అక్కడ రోజూ సగటున 8.5 గంటలు పనిచేస్తారు. భారత్‌లో రోజూ 10 నుంచి 12 గంటలు కష్టపడతారు. దీనికి ప్రయాణ సమయాన్ని కూడా జోడిస్తే భారతీయులు రోజులో ఎక్కువ సమయం కూర్చుని పనిచేస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

నిద్రలేమి

జపానీయులు సగటున 6 నుంచి 7 గంటలు నిద్రపోతారు. భారతీయుల సగటు నిద్ర 5-6 గంటలే. దీర్ఘకాలిక నిద్రలేమి వల్ల ఊబకాయం, మధుమేహం, గుండెజబ్బులు, అకాల మరణం సంభవించే ప్రమాదం ఉంటుంది. జపనీయులు నడక, సైక్లింగ్ వంటి దినచర్యతో ఫిట్‌నెస్‌ను వారి జీవితంలో భాగం చేసుకుంటారు. భారత్‌లో చాలా కొద్దిమంది మాత్రమే ఫిట్‌నెస్‌పై దృష్టి పెడతారు.

లేట్ నైట్ డిన్నర్

జపాన్‌లో దాదాపు అందరూ రాత్రి 8 గంటలలోపే భోజనం ముగించేస్తారు. అదికూడా చాలా తేలికగా జీర్ణమయ్యే ఆహారమే తింటారు. భారత్‌లో రాత్రి 10, 11 తర్వాత కూడా బిర్యానీలు, పిజ్జాలు, బటర్ చికెన్లు వంటివి తింటారు. దీనివల్ల సరిగా జీర్ణం కాక.. బరువు పెరగడం, నిద్రలేమి సమస్యలు ఎదురవుతాయి.

జపాన్‌లో లక్షకు చేరువైన శతాధికులు

జపాన్‌లో వృద్ధుల జనాభా గణనీయంగా పెరుగుతోంది. ఈ దేశంలో 100 ఏళ్లకుపైబడిన వృద్ధుల సంఖ్య రికార్డు స్థాయిలో లక్షకు చేరువైందని జపాన్ ప్రభుత్వం వెల్లడించింది. వారిలో 90 శాతం మంది మహిళలేనని పేర్కొంది. ప్రపంచంలోని నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జపాన్‌లో ఓ వైపు ప్రజల ఆయుర్దాయం పెరుగుతుండగా.. మరోవైపు జననాల రేటు గణనీయంగా తగ్గిపోతోంది. దీంతో ఈ దేశం అతిపెద్ద జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నాటికి జపాన్‌లో 99,763 మంది శతాధిక వృద్ధులు ఉన్నారు.

ఔషధం..నిర్లక్ష్యం..విషం!

నాణ్యతలేని మందులతో ప్రజలకు ప్రాణ సంకటం



- రసాయనం కలిసిన దగ్గుమందుతో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 14 మంది మృతి

అదో చిన్న ఫార్మా కంపెనీ.. ఎన్నో మందులు తయారు చేసి అమ్ముతోంది.. పెద్ద కంపెనీలతో పోటీపడలేక అడ్డదారులు తొక్కుతోంది.. మందులపై ఎక్కువ ఎమ్మార్పీ (గరిష్ఠ చిల్లర ధర) ముద్రించి.. అతి తక్కువ ధరకే మందుల షాపులకు హోల్‌సేల్‌గా సరఫరా చేస్తుంది.. వైద్యులకు అడ్డగోలు కమీషన్లు ఆశచూపి.. పేషెంట్లకు తమ మందులే రాసేలా ప్రలోభపెడుతుంది.. ఇటు వైద్యులకు, అటు మందుల షాపులకు బోలెడు లాభం.. ఇంతదాకా బాగానే ఉంది. కానీ అతి తక్కువ ధరకు మందులు, ఆపై కమీషన్లు ఇస్తూ, తాను కూడా లాభం పొందాలంటే.. ఆ ఫార్మా కంపెనీ ఎంత నాణ్యంగా మందులు తయారు చేస్తుంది? చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయదా? ప్రాణాలకు ప్రమాదం తలెత్తదా? మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో అదే జరిగింది. ఓ చిన్న ఫార్మా కంపెనీ తయారు చేసిన దగ్గు మందులోని విష పదార్థాల కారణంగా ముక్కుపచ్చలారని 14మంది చిన్నారులు చనిపోయారు.

ప్రమాదకర రసాయనం కలవడంతో..

మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో పిల్లలకు ఇచ్చిన 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందును ల్యాబ్‌లలో పరీక్షించగా 'డైథిలీన్ గ్లైకాల్ (డీఈజీ), ఇథిలీన్ గ్లైకాల్ (ఈజీ)'గా పిలిచే ప్రమాదకర రసాయనాల ఆనవాళ్లు ఉన్నట్టు తేలింది. తమిళనాడులోని కాంచీపురంలో శ్రేసన్ ఫార్మా కంపెనీకి చెందిన యూనిట్‌లో ఈ దగ్గు మందు తయారైంది. డీఈజీ, ఈజీ రసాయనాలను పరిశ్రమల్లో పెయింట్లు, బ్రేక్ ఫ్లూయిడ్స్, కొన్ని రకాల ప్లాస్టిక్ తయారీలో వినియోగిస్తారు. మందుల తయారీకి వాటితో ఏమాత్రం సంబంధం ఉండదు. అయితే ఔషధాల తయారీలో వాడే గ్లిసరిన్ వంటి ముడి పదార్థాల రవాణా సమయంలో వాటిలో డీఈజీ, ఈజీ చేరే అవకాశం ఉంటుంది. డీఈజీ, ఈజీ మన శరీరంలో మూత్రపిండాలు, కాలేయంతోపాటు నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతాయి.

వైద్యులు, దుకాణదారుల కక్కుర్తితో..

చిన్న ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం వైద్యులను, మందుల దుకాణాల వారిని ప్రలోభపెట్టడం సాధారణంగా మారిపోయింది. అతి తక్కువ ధరకు ఇచ్చే ఆ మందులపై ఎమ్మార్పీ మాత్రం పెద్ద పెద్ద కంపెనీల మందులకన్నా ఎక్కువగా ఉంటుంది. దీనితో వైద్యులు, దుకాణాల వారికి భారీగా మార్జిన్లు మిగులుతాయి. దీనితో వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులకు ఆ కంపెనీల మందులే రాస్తున్నారు. ఫార్మా కంపెనీల్లో పరిస్థితులు, పరికరాలు, ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలను సంబంధిత ప్రభుత్వ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. కానీ ఈ విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని, తూతూమంత్రంగా పరిశీలించి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

'దగ్గు మందు' కంపెనీల్లో తనిఖీలు

మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో దగ్గు మందుతో చిన్నారులు మృతి చెందడంతో కేంద్రం అప్రమత్తమైంది. ఆదివారం అన్ని రాష్ట్రాల వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా దగ్గు మందు తయారీ సంస్థల వివరాలు సేకరించి.. వెంటనే ఆయా యూనిట్లలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ, ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు, పరీక్షలకు ఏర్పాట్లు ప్రారంభించారు.

- సెంట్రల్ డెస్క్

పిల్లల మృతి కేసులో వైద్యుడి అరెస్టు

మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారాలో దగ్గు మందు కారణంగా పిల్లలు మృతి చెందిన ఘటనలో ప్రభుత్వ వైద్యుడు ప్రవీణ్ సోనిని ఆ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఈ దగ్గుమందు తయారుచేసిన సంస్థపైనా కేసు నమోదు చేసినట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. కోల్డ్రిఫ్ దగ్గు మందుపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది. ప్రవీణ్ సోని ప్రైవేటు ప్రాక్టీసు చేస్తూ ఈ దగ్గుమందును సిఫారసు చేసినట్లు ఛింద్వారా ఎస్పీ చెప్పారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రవీణ్‌ను వైద్య విధుల నుంచి సస్పెండ్ చేసింది. మరోవైపు తమిళనాడు డ్రగ్ కంట్రోల్ అధికారులు ఈ నెల 2వ తేదీన ఇచ్చిన తమ నివేదికలో శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్ తయారుచేసిన కోల్డ్రిఫ్ దగ్గుమందు డైఇథలీన్ గ్లైకాల్(48.6%)తో కల్తీ అయ్యిందని పేర్కొంది.

పాక్‌కు జెట్ ఇంజన్లు ఇవ్వట్లేదు!

- భారత్‌ను ఇబ్బంది పెట్టే పనిచేయం: రష్యా

న్యూఢిల్లీ, అక్టోబరు 5: పాకిస్థాన్‌కు తాము ఫైటర్ జెట్ ఇంజన్లు సరఫరా చేస్తున్నట్లు వచ్చిన వార్తలను రష్యా ఖండించింది. భారత్‌ను ఇబ్బంది పెట్టే పని చేయబోమని తేల్చిచెప్పింది. చైనా తయారీ జేఎఫ్-17 థండర్ బ్లాక్-3 యుద్ధ విమానాలకు అమర్చేందుకు కీలకమైన ఆర్డీ-93 ఎంఏ ఇంజన్లను పాక్‌కు రష్యా సరఫరా చేస్తోందని.. మోదీ మార్కు దౌత్యం విఫలమైందని.. కేంద్రం దీనికి జవాబు చెప్పాలని కాంగ్రెస్ శనివారం డిమాండ్ చేసింది. ఈ వార్త అర్థరహితమని రష్యా ప్రభుత్వ వర్గాలు తాజాగా తేల్చిచెప్పాయి. పాక్‌తో ఆ స్థాయిలో మిలిటరీ సహకారం లేదని స్పష్టం చేసినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ నివేదించింది. పాక్‌కు రష్యా ఫైటర్ జెట్లు సరఫరా చేస్తుందన్న వార్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ శనివారం 'ఎక్స్'లో స్పందిస్తూ.. ప్రధాని మోదీ దౌత్యం దేశ ప్రయోజనాల కంటే తన ఇమేజ్‌ను పెంచుకోవడం కోసం ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. ఒకప్పుడు భారత్‌కు అత్యంత విశ్వసనీయ వ్యూహాత్మక మిత్రదేశంగా ఉన్న రష్యా.. భారత్ అభ్యర్థనలను విస్మరించి, పాక్‌కు జెట్ ఇంజన్లు సరఫరా చేసేందుకు ఎందుకు ముందుకెళ్తోందో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సరిహద్దు రక్షణకు ఏకే-630 గన్స్

- ఆరు శతఘ్నుల కొనుగోలుకు ఆర్మీ టెండర్

న్యూఢిల్లీ, అక్టోబరు 5: ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ తన గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా భారత ఆర్మీ.. ప్రభుత్వ యాజమాన్యంలోని అడ్వాన్స్‌డ్ వెపన్ అండ్ ఎక్విప్‌మెంట్ ఇండియా లిమిటెడ్ (ఏడబ్ల్యూఈఐఎల్) నుంచి ఆరు ఏకే-630 వైమానిక రక్షణ శతఘ్నుల కొనుగోలుకు టెండర్ జారీ చేసింది. మిషన్ సుదర్శన్ చక్ర ప్రాజెక్టు కింద డ్రోన్లు, రాకెట్ల వంటి వైమానిక ముప్పుల నుంచి పాకిస్థాన్‌కు సరిహద్దుకు దగ్గరగా ఉన్న సున్నితమైన ప్రాంతాల్లో వీటిని మోహరించనున్నట్టు రక్షణశాఖ అధికారులు తెలిపారు. ఈ కొత్త ఆయుధ వ్యవస్థ భారత గగనతల రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తుందని, ముఖ్యంగా భూమిపై నుంచి 10వేల మీటర్ల ఎత్తు నుంచి వచ్చే ముప్పులపై ఇది దృష్టిపెడుతుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో జమ్ము కశ్మీర్, పంజాబ్‌ల్లోని పౌర నివాసాలు, మతపరమైన భవనాలపై పాక్ సైన్యం ప్రత్యక్ష దాడులకు తెగబడింది. దీంతో భవిష్యత్తులో ఇలాంటి ముప్పుని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారత్ ఏకే-630 వైమానిక రక్షణ శతఘ్నుల కొనుగోలుకు సిద్ధమైంది.ఏకే-630 అనేది ఆరు బ్యారెళ్లతో కూడిన 30 ఎంఎం ఫిరంగి. 4 నుంచి 6 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను అలవోకగా ఛేదించగలదు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.